
మంగళవారం
30•1•2018
కరీంనగర్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 213
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



సోమవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ సెంట్రల్‌హాల్‌లో ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

జమిలి ఎన్నికలే మేలు

అన్ని రాజకీయపక్షాలు ఏకాభిప్రాయానికి రావాలి

లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల ఉమ్మడి ఎన్నికల అవసరాన్ని నొక్కిచెప్పిన రాష్ట్రపతి

- మైనారిటీలు, పేదలను బుజ్జగించే విధానాల అవసరం లేదు
- 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు ప్రభుత్వ లక్ష్యం
- రామగుండం సహా ఐదు ఎరువుల కర్మాగారాల పునరుద్ధరణకు ప్రయత్నాలు
- ట్రిపుల్ తలాక్‌కు ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నా
- బడ్జెట్ కీలకాంశాలను స్పృశిస్తూ పార్లమెంట్‌లో తొలిసారిగా రాష్ట్రపతి కోవింద్ ప్రారంభోపన్యాసం


న్యూఢిల్లీ, జనవరి 29:

లోక్‌సభతోపాటు రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై నిరంతర చర్చ జరుగాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభిప్రాయపడ్డారు. దీనిపై అన్ని రాజకీయపక్షాలు ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరముందన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సెంట్రల్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ఉభయసభలనుద్దేశించి ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రపతి హోదాలో పార్లమెంటులో తన తొలిప్రసంగంలో కోవింద్.. పదే పదే ఎన్నికలు నిర్వహించడం వల్ల తీవ్రమైన వ్యయభారంతోపాటు దేశాభివృద్ధికి విఘాతం కలుగుతున్నదని చెప్పారు. తరుచూ ఎన్నికల నిబంధనావళిని అమలుచేయడం ద్వారా ప్రగతి పనులకు ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. ముందస్తు ఎన్నికలకు ప్రధాని మోదీ సన్నద్ధమవుతున్నారనేందుకు ఈ వ్యాఖ్యలే సంకేతాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలను ముందుకు జరిపి ఈ ఏడాది జరుగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటే నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్టు భావిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు తన మనసులో మాటను

మిగతా 5వ పేజీలో

ఎగుమతుల్లో టాప్

దేశ ఎగుమతుల్లో ఎగిరిన తెలంగాణ జెండా.. టాప్ ఐదు రాష్ట్రాల్లో చోటు



70% ఎగుమతులు ఐదు రాష్ట్రాల నుంచే

- వెల్లడించిన ఆర్థిక సర్వే నివేదిక
- రాష్ట్రం నుంచి 190కి పైగా దేశాలకు ఎగుమతులు
- ఇప్పటికే ఫార్మారంగాన్ని ఏలుతున్న తెలంగాణ

భవిష్యత్‌లో అగ్రగామిగా ఎదుగుతాం

- సీఎం కేసీఆర్ విప్లవాత్మక విధానాల ఫలితమే ఇది
- ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

న్యూఢిల్లీ, హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ మరోసారి తన సత్తాను చాటింది. బుడిబుడి అడుగులు వేస్తూనే ప్రపంచానికి తనేంటో చూపించింది. ఇప్పటికే అనేక అంశాల్లో ప్రశంసలు అందుకుంటున్న రాష్ట్రానికి మరో గుర్తింపు లభించింది. కొత్త రాష్ట్రమైనా జాతీయస్థాయి ఎగుమతుల్లో మొదటి ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచే 70% ఎగుమతులు ఉన్నాయని సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే పేర్కొన్నది. రాష్ట్రం నుంచి కమోడిటీ ఎగుమతులు 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.35,444 కోట్లు, 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.40,239 కోట్లు, 2017 ఏప్రిల్ నుంచి 2017 సెప్టెంబర్ వరకు రూ.19,830 కోట్ల ఎగుమతులు నమోదయ్యాయి.

190 దేశాలకు తెలంగాణ ఎగుమతులు


ఉత్పత్తి, తయారీరంగంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకున్న విప్లవాత్మక విధానాలు, ఐటీ, పరిశ్రమల

మిగతా 2వ పేజీలో



న్యూఢిల్లీ, జనవరి 29:

ఇన్నాళ్లూ మందగమనంలో మగ్గిపోయిన జీడీపీ.. మళ్లీ పరుగందుకున్నది. దేశ ఆర్థిక వ్యవస్థపై పాత పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ప్రభావం తొలిగిపోతున్నదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. భారతావని ప్రగతి ముఖచిత్రాన్ని ప్రతిబింబించే ఆర్థిక సర్వే 2017-18ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం పార్లమెంట్‌కు సమర్పించారు. దాదాపు ఏడాదిన్నర మందగమనం నుంచి తేరుకుంటున్న దేశ ఆర్థిక వ్యవస్థ.. క్రమేణా వృద్ధిపథంలోకి వస్తున్నదని అభిప్రాయపడిన సర్వే.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో వృద్ధిరేటు 7-7.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సాయం ఇతరత్రా సంస్కరణలతో దేశ ఆర్థిక మందగమన పరిస్థితులు దూరమవుతున్నాయన్నది. పెద్ద నోట్ల రద్దు అనంతరం ద్రవ్యవ్యవస్థలో తిరిగి నగదు చలామణి పెరుగడం వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలనూ ఉత్సాహపరించిందని, తయారీ రంగం 11.3 శాతం పురోగమించిందని, ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు 2.3 శాతం పెరిగాయని వివరించింది. ఈ క్రమంలోనే భారత్ మళ్లీ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలబడనున్నదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ముడి చమురు ధరలు, దేశీయ ఇంధన, స్టాక్స్ ధరలపై ఆ ప్రభావంపట్ల ఆందోళన



ఆర్థిక సర్వేతో ప్రధాన ఆర్థిక సలహాదారు సుబ్రమణ్యన్

మిగతా 2వ పేజీలో

పంచాయతీ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ హవా

- పదహారు సర్పంచ్ స్థానాలు కైవసం
- కాంగ్రెస్‌కు 4, బీజేపీకి ఒకటి, ఇద్దరు స్వతంత్రులు
- వార్డు సభ్యుల్లోనూ గులాబీదే పైచేయి.. కాంగ్రెస్, కమ్యూనిస్టు కోటలకు బీటలు
- ఫలించని ప్రతిపక్షాల ఉమ్మడి పోటీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

స్థానిక సంస్థల నుంచి మొదలుకుని.. ఢిల్లీస్థాయి వరకు రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలైనా ప్రజలు అధికార టీఆర్‌ఎస్ వెంటే నడుస్తారనేదానికి మరో సాక్ష్యం క్షేత్రస్థాయిలో స్పష్టమయ్యింది. ఎన్నిక ఏదైనా.. ప్రజలు చెక్కుచెదురకుండా అధికార పార్టీకి ఓటుతో ఆమోదముద్ర వేస్తూ ఎప్పటికప్పుడు బలపరుస్తున్నారు. కాంగ్రెస్, సీపీఎం కోటల్లో కూడా టీఆర్‌ఎస్‌ను గెలిపించి ఆదరిస్తున్నారు. అధికార టీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఉమ్మడిగా రంగంలోకి దిగిన చోట్ల కూడా గులాబీ జెండా రెపరెపలను నిలువరించలేక పోయాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీ అయిన 23 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు, 166 గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ హవా కొనసాగింది. 23 సర్పంచ్ పదవులకు 16 సీట్లను గెలుచుకుని తిరుగులేని ఆధిపత్యం చాటింది. ఇందులో సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం మైకోడ్ గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా టీఆర్‌ఎస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 166 వార్డు సభ్యులకు ఎన్నికలు జరుగగా 150 వార్డులను అధికార టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. నల్లగొండ జిల్లా పీఏ పల్లి మండలం వడ్డిపట్ల గ్రామంలో, నకిరేకల్ మండలం పాలెంలో టీఆర్‌ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఇటీవల కాలంలో నల్లగొండ జిల్లాలో టీఆర్‌ఎస్ పార్టీ బలహీనపడిందని ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు చేసిన ప్రచారానికి ఈ తీర్పు చెంపపెట్టులా మారింది. పాలెం గ్రామ పంచాయతీలో 340 ఓట్ల ఆధిక్యంతో అవుట రవీంద్రమ్మ కమ్యూనిస్టు కంచుకోటలో విజయం సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మండలం సుజాతనగర్ సర్పంచ్ పదవికి అన్ని ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడిగా అభ్యర్థిని నిలబెట్టినప్పటికీ టీఆర్‌ఎస్ అభ్యర్థి 1126 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. సీపీఎంకు కంచుకోటగా ఉన్న సుజాతనగర్‌లో ప్రతిపక్షాలు ఏకమైనా ప్రజలు కేసీఆర్ అభివృద్ధి కార్యక్రమాలకు పట్టంకట్టారని, భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఇదే రకమైన ఫలితాలు ఉంటాయని కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం కొండాపూర్ గ్రామ సర్పంచ్‌గా టీఆర్‌ఎస్ అభ్యర్థి మంగి నాగావత్ 372 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం మనపురం గ్రామ పంచాయతీలో బానోతు బాలునాయక్ గెలుపొందారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పోలింగ్

మిగతా 2వ పేజీలో

జపాన్ స్ఫూర్తికావాలి

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి.. ప్రాక్టికల్ విద్యే అందుకు మార్గం

మంత్రి కే తారకరామారావు పిలుపు

విశ్వవిద్యాలయాల్లో వినూత్న ప్రయోగాలకు త్వరలో నాందిపలుకుతామని వెల్లడి

కేటీఆర్ సమక్షంలో టీహబ్, ఆర్‌ఈసీ మధ్య ఒప్పందం



సోమవారం హైదరాబాద్ టీహబ్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో టీహబ్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) మధ్య అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, విశ్వవిద్యాలయాల ఉప కులపతులు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కళాశాలల నుంచి బయటికి వచ్చే ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పరిశ్రమలకు తగ్గట్లు నైపుణ్యాలు ఉండటం లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారక రామారావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ లోపాన్ని అధిగమించేందుకు వైస్ చాన్సలర్లు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు ఎక్కువగా ప్రాక్టికల్స్ ద్వారా బోధించే విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. హిరోషిమా, నాగసాకి వంటి దుర్ఘటనలు జరిగినా, పెద్ద దేశం కాకపోయినా, భూకంపాలు, సునామీలు సవాల్‌గా నిలిచినా జపాన్ కేవలం జ్ఞానం, ప్రాక్టికల్ విద్యతో బలమైన ఆర్థిక దేశంగా ఎదిగిందని మంత్రి కేటీఆర్ చెప్పారు. అనేక వనరులు అందుబాటులో ఉన్న మన దేశం కూడా గొప్పగా ఎదిగే అవకాశం కలిగి ఉందన్నారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో టీహబ్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ విద్యార్థులను మరింత ప్రతిభావంతులుగా

మిగతా 2వ పేజీలో

• రేపటి నుంచే మహాజాతర



బుధవారం నుంచి ప్రారంభం కానున్న మేడారం సమ్మక్క-సారలక్క మహాజాతరకు ముందుగానే చేరుకున్న భక్తులు అమ్మవార్ల గద్దెల వద్ద దర్శనాలు చేసుకుంటున్నారు. సోమవారం రాత్రి కూడా వనదేవతల గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతున్న దృశ్యం.

3

మెట్రో రెండోదశకు డీపీఆర్

కసరత్తు ప్రారంభించిన అధికారులు

ఐదు నెలల్లో సిద్ధంచేసేలా ప్రణాళిక

రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు విస్తరణ

6




కాంగ్రెస్‌ది ఉత్త భ్రమ!

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 సీట్లు వస్తాయని ఆ పార్టీ నాయకులు భ్రమిస్తున్నారని మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. ఆ పార్టీ హయాంలో రైతులకు కష్టాలే మిగిలాయని, వారు ఇప్పుడు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. రైతులపై కాంగ్రెస్ నాయకులకు నిజమైన ప్రేమే ఉంటే సాగునీటి ప్రాజెక్టులపై వారు వేసిన కేసులను ఉపసంహరించుకొని రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లాలో పర్యటించిన హరీశ్ పామిరెడ్డిపల్లి సమీపంలో బహిరంగసభలో ప్రసంగించారు. వనపర్తి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. వేరుశనగకు మద్దతు ధర సాధిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

వివరాలు 3వ పేజీలో

నేడు రెండు నిమిషాలు మౌనం పాటించాలి

ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఉదయం 11 గంటలకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని కోరింది. ఎవరికివారు మౌనం పాటించాలని, ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపివేయాలని, హారన్లు ఆపేయాలని ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీచేసింది.

14వ ఆర్థికసంఘం నిధులు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ స్థానిక సంస్థలకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. 2017-18 ఏడాది రెండోవిడుత రూ.434.24 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు

మిషన్ భగీరథ ప్రాజెక్టుకు 553.26 కోట్లు

బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణం తీసుకొనేందుకు ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ ప్రాజెక్టులో భాగంగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో చేపడుతున్న పనులకు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.553.26 కోట్ల రుణం తీసుకొనేందుకు తెలంగాణ మిషన్ భగీరథ కార్పొరేషన్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, మహేశ్వరం నియోజకవర్గాలకు తాగునీటిని అందించే పనులకు ఈ నిధులు వినియోగిస్తారు.

అర్బన్ గురుకుల సిబ్బంది జీతాల పెంపు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం గౌరవ వేతనాలను పెంచింది. స్పెషల్ ఆఫీసర్ల జీతాన్ని రూ.25 వేలకు, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల జీతాన్ని రూ.20 వేలకు పెంచుతూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ విద్యాధికారులను ఆదేశించారు.



చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయం గేటుకు తాళం వేసిన దృశ్యం (ఫైల్)

హైదరాబాద్‌లో రేపు రెడ్‌మూన్!

సాయంత్రం 6.25 నుంచి 7.25 గంటల వరకు చంద్రగ్రహణం



హైదరాబాద్: ఈ నెల 31న ఏర్పడే సంపూర్ణ చంద్రగ్రహణం భారత్‌లో కనిపిస్తుందని హైదరాబాద్‌లోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ బీజీ సిద్ధార్థ చెప్పారు. నగరవాసులు పూర్తిగా చంద్రగ్రహణాన్ని వీక్షించవచ్చునన్నారు. గ్రహణం సందర్భంగా చంద్రుడు ఎర్రని వర్ణంలోకి వస్తాడని, దాన్ని 'బ్లడ్ మూన్' అని కూడా అంటారని అన్నారు. బుధవారం చంద్రుడ్ని బ్లూ మూన్‌గా, సూపర్‌మూన్‌గానూ చూడవచ్చుని తెలిపారు. 'బుధవారం సాయంత్రం 5.20 గంటలకు చంద్రగ్రహణం పాక్షికంగా ప్రారంభమవుతుంది. కానీ, 6.25 గంటలకు సూర్యాస్తమయం తర్వాత తూర్పు దిక్కున చంద్రుడు పొడుచుకొస్తున్నప్పుడే ప్రధాన గ్రహణం మొదలవుతుంది' అని బిర్లా సైన్స్ సెంటర్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నది. స్వల్పంగా చంద్రుడు వెండి వర్ణంలోకి మారుతున్నప్పుడు దాని చుట్టూ నల్లని ఛాయ ఏర్పడుతుంది. కొన్ని నిమిషాలపాటు విస్తరించిన మీద రాత్రి 7.25 గంటల్లోపు చంద్రగ్రహణం వీడుతుంది. ఈ నెలలో పౌర్ణమి రావడం రెండోసారి. చంద్రగ్రహణం సందర్భంగా నదులు, సముద్రాల్లో స్వల్పంగా అలలు ఎగసిపడుతాయే తప్ప ఆందోళన చెందాల్సిందేమీ లేదని బీజీ సిద్ధార్థ తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 31న ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 వరకు శ్రీవారి ఆలయం తలుపులు మూసివేస్తారు. ఆ సమయంలో భక్తులకు దర్శనం ఉండదు. గ్రహణానికి 6 గంటల ముందు ఆలయాన్ని ఆనవాయితీ ప్రకారం మూసివేస్తారు. రాత్రి 9.30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి జరుపుతారు. 10.30 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది. ప్రత్యేక దర్శనాలు, సేవలు ఏవీ ఉండవు.



సోమవారం హైదరాబాద్‌లోని టీహబ్‌లో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్‌తో ఒప్పందం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు

జపాన్ స్ఫూర్తికావాలి

మొదటిపేజీ తరువాయి...

తీర్చిదిద్దేందుకు విశ్వవిద్యాలయాలు కృషిచేయాలన్నారు. పరిశ్రమలను ఇంజినీరింగ్ విద్యార్థులకు చేరువచేసి, పారిశ్రామిక విప్లవాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చూడాలని చెప్పారు. విశ్వవిద్యాలయాలకు సాంకేతికతను జోడించి, వినూత్న ప్రయోగాలకు త్వరలో నాంది పలుకుతామన్నారు. వర్సిటీ పరిశోధన ఫలాలు సామాన్యుడికి సైతం చేరువవ్వాలని అన్నారు. వినూత్న ఆవిష్కరణలు చేయాలన్న కేటీఆర్.. ప్రజలు ఎక్కువగా ఇబ్బందిపడే వైద్య ఖర్చులు తగ్గించేలా పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2015లో టీహబ్ ప్రారంభించిన సమయంలో ఐదు కంటే తక్కువ ఇంక్యుబేటర్స్ ఇక్కడ ఉన్నాయని, ప్రస్తుతం అత్యధికంగా హైదరాబాద్‌లోనే ఉండటం గర్వకారణమని చెప్పారు. టీహబ్ భవనం ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా నిలుస్తున్నదని, ఆలోచనలకు ఆసరాగా నిలిచి కార్యరూపం దాల్చేలా చేస్తున్నదని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైన ఇంధన వనరుల కొరత, పర్యావరణ రక్షణవంటి అంశాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు టీహబ్, ఆర్ఈసీ ముందుకురావటం సంతోషకరమని చెప్పారు. తాజా ఒప్పందంవల్ల ఏర్పాటైన ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాంలో తెలంగాణ, ఏపీలకు చెందిన 30 యూనివర్సిటీల్లోని 1800 మంది విద్యార్థులు సోలార్, విండ్, బయోవేస్ట్ పవర్‌పై పరిశోధన చేస్తారని తెలిపారు. సుమారు 600 ప్రాజెక్టులను పరిశోధిస్తారని, ప్రాథమికంగా 30 ప్రాజెక్టులను పరిశీలించాక చివరకు ఉత్తమమైన 3 ప్రాజెక్టులను మరింత అభివృద్ధి చేసేందుకు గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ రక్షణకు పెద్దపీట వేసిందని, దీనికి అనుగుణంగానే హరితహారం, మిషన్ కాకతీయ, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. మిషన్ కాకతీయతో భూగర్భ జలాలు పెరుగుతాయని, హరితహారం వల్ల పచ్చదనం పెరుగుతుందని, సోలార్ వినియోగం పర్యావరణహితమని తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, 16% సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నదని వివరించారు. మనది సన్‌షైన్ దేశమన్న కేటీఆర్.. 300 రోజులపాటు సౌర విద్యుత్ ఉత్పత్తికి అనుగుణంగా సూర్యరశ్మి అందుబాటులో ఉంటుందని, దీన్ని వాడుకోగలిగే సాంకేతికతను అభివృద్ధిపరిస్తే దేశానికికేగాక, ప్రపంచానికి మార్గం చూపినవాళ్లమవుతామని చెప్పారు. యంగ్ ఇండియన్స్ ప్రపంచానికి దారిచూపేదిశగా వినూత్న ఆవిష్కరణలు జరుపాలని కోరారు. ఆర్ఈసీ తరహాలో ఇతర సంస్థలు ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్నిచ్చేందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోని అన్ని వర్సిటీలు పరిశోధనవైపు దృష్టి సారించాలని, ఉన్నతవిద్యామండలి, ఉపకులపతులు ఈ దిశగా ఆలోచించాలన్నారు. ఆర్ఈసీ చైర్మన్ పీవీ రమేశ్ మాట్లాడుతూ నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం కనుక్కోవాలని, దీనిలో యువతరం కీలకపాత్ర పోషించాలని కోరారు. నూతన ఆవిష్కరణలే భవిష్యత్‌లో ప్రపంచం ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీహబ్ సీఈవో జైక్రిష్ణన్, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, పలు యూనివర్సిటీల ఉపకులపతులు పాల్గొన్నారు.

ఎగుమతుల్లో టాప్

మొదటిపేజీ తరువాయి...

శాఖల మంత్రి కే తారకరామారావు నిత్య పర్యవేక్షణ, సమీక్షలతో రాష్ట్రం తన స్థానాన్ని మెరుగుపర్చుకుంది. ఒకే సంవత్సరంలో రూ.5వేల కోట్ల ఎగుమతులు పెరిగాయి. రాష్ట్రం నుంచి దాదాపుగా 190కి పైగా దేశాలకు ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. కమోడిటీ రంగంలో మొత్తం 170కి పైగా దేశాలకు అవుతున్న ఎగుమతుల్లో అమెరికాకు అత్యధికం ఉంటున్నాయి. ఆ తరువాతి స్థానంలో దుబాయ్, చైనా, రష్యా దేశాలకు తెలంగాణ నుంచి ఎగుమతులు అవుతున్నాయి. ఇక్కడ ఉత్పత్తులకు ఇతర దేశాల్లో డిమాండ్ ఉండటంతో ఎగుమతులకు అద్భుత అవకాశాలున్నాయి.

మూడు దశాబ్దాలుగా ఫార్మా ఎగుమతుల్లో టాప్

తెలంగాణ ప్రాంతం గత మూడు దశాబ్దాలుగా ఫార్మారంగంలో అగ్రస్థానంలో నిలుస్తున్నది. ఫార్మా ఉత్పత్తులకు కేంద్రంగా భాసిల్లుతున్నది. ప్రపంచానికి అవసరమయ్యే ఫార్మా ఉత్పత్తుల్లో అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న ఒకే నగరంగా హైదరాబాద్ గుర్తింపు పొందింది. హైదరాబాద్, ఇతర తెలంగాణ జిల్లాల్లో 600 వరకు ఔషధ కంపెనీలున్నాయి. దేశంలో ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తుల్లో 30 శాతానికి పైగా తెలంగాణ నుంచే ఎగుమతి అవుతున్నాయి.

అగ్రస్థానం కోసం ప్రత్యేక కార్యాచరణతో..

రాష్ట్రానికున్న అనుకూలతల దృష్ట్యా ఎగుమతుల్లో దేశంలో ముందంజలో నిలుపడానికి ప్రత్యేక కార్యచరణతో ప్రభుత్వం ముందుకెళుతున్నది. రాబోయే రోజుల్లో ఎగుమతులను రెట్టింపు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు ఎగుమతులపై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఎగుమతులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను అంతర్జాతీయ స్థాయిలో కల్పించాలని నిర్ణయించారు. ఎగుమతులను రెట్టింపు చేయాలనే లక్ష్యంగా ఇతర రాష్ట్రాల్లో డ్రై పోర్టులను నిర్మిస్తున్నా.. తెలంగాణ ప్రాంతానికి డ్రై పోర్టు అవసరమనే విషయాన్ని నాటి సమైక్య ప్రభుత్వాలు గ్రహించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో డ్రై పోర్టును ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. ఏ ప్రాంతం అనువైనదో కన్సల్టెన్సీ ద్వారా ఇప్పటికే నివేదిక తెప్పించుకున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పత్తి ఉత్పత్తి అవుతున్నా వస్త్రాల తయారీ, ఇతర అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై గత ప్రభుత్వాలు ఏనాడూ దృష్టి పెట్టలేదు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో భారీగా ఎగమతులు ఉండేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. ఇందులో భాగంగానే వరంగల్ రూరల్ జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి అనేక కంపెనీలు ముందుకొచ్చాయి.

జీవన ప్రమాణాలను చాటి చెప్తున్న సర్వేగణాంకాలు

అంతర్జాతీయ ఎగుమతులకు సంబంధించిన ఈ కొత్త గణాంకాలు రాష్ట్రాల మధ్య గల అన్యోన్యతను, ఆయా రాష్ట్రాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను చాటిచెప్తున్నాయి. దేశంలో రాష్ట్రాల మధ్య జరుగుతున్న వాణిజ్యం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30% నుంచి 50% మేరకు ఉంటుందని గత ఏడాది ఆర్థిక సర్వే అంచనా వేసింది. అయితే వస్తు, సేవల రంగంలో (జీఎస్టీ యేతర వస్తువులు, సేవలు మినహా) దేశ అంతర్గత వాణిజ్యం వాస్తవానికి ఇంత కంటే ఎక్కువగానూ, జీడీపీలో దాదాపు 60% మేరకు ఉన్నట్లు జీఎస్టీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వస్తు, సేవల ఎగుమతుల్లో రాష్ట్రాల వాటా

రాష్ట్రం	వాటా	సంచిత వాటా
మహారాష్ట్ర	22.3%	22.3%
గుజరాత్	17.2%	39.5%
కర్ణాటక	12.7%	52.3%
తమిళనాడు	11.5%	63.8%
తెలంగాణ	6.4%	70.01%
హర్యానా	4.9%	75.0%
ఉత్తరప్రదేశ్	4.8%	79.8%
పశ్చిమ బెంగాల్	3.2%	83.0%
ఆంధ్రప్రదేశ్	2.8%	85.8%
ఒడిశా	2.0%	87.8%
ఢిల్లీ	1.9%	89.7%
రాజస్థాన్	1.8%	91.5%
కేరళ	1.7%	93.2%
పంజాబ్	1.7%	94.8%
మధ్యప్రదేశ్	1.3%	96.1%
గోవా	0.9%	97.0%

(తొలి రాష్ట్ర వాటాను, ఆ తర్వాతి రాష్ట్రాల వాటాను కలిపి సంచిత వాటా అంటారు)

రాష్ట్రం నుంచి కమోడిటీ ఎగుమతులు

2015-16	రూ.35,444 కోట్లు
2016-17	రూ.40,239కోట్లు
2017 సెప్టెంబర్ వరకు	రూ.19,830కోట్లు


దేశంలో గత ఏడాది కొత్తగా అమల్లోకి వచ్చిన వస్తు, సేవల పన్ను గణాంకాలను ఆధారంగా చేసుకున్న ఈ ఆర్థిక సర్వే.. ఎగుమతులకు సంబంధించిన బలమైన స్థాయిని మరింత విస్తృతంగా ఆవిష్కరిస్తున్నది. ఇతర దేశాల్లోని సంస్థలతో పోలిస్తే దేశంలోని పెద్ద సంస్థల నుంచి జరుగుతున్న ఎగుమతులు చాలా తక్కువని, అమెరికా, జర్మనీ, బ్రెజిల్, మెక్సికో తదితర దేశాల్లోని సంస్థల కంటే మన దేశంలోని సంస్థలు ఎగుమతులపై చాలా తక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నాయని ఈ సర్వే వెల్లడించింది. బ్రెజిల్‌లోని సంస్థల్లో అగ్రస్థానంలో ఉన్న ఒక్క శాతం సంస్థలు ఆ దేశం జరిపే మొత్తం ఎగుమతుల్లో 72% వాటా కలిగి ఉన్నాయి. ఈ ఎగుమతులు జర్మనీలో 68 శాతంగానూ, మెక్సికోలో 67 శాతంగానూ, అమెరికాలో 55 శాతంగానూ ఉండగా.. మన దేశంలో కేవలం 38 శాతంగా మాత్రమే ఉన్నది. ఇదేవిధంగా ఈ దేశాల్లోని టాప్ 5 శాతం సంస్థలు ఆయా దేశాల మొత్తం ఎగుమతుల్లో వరుసగా 91% (బ్రెజిల్‌లో), 86% (జర్మనీలో), 91% (మెక్సికోలో), 74% (అమెరికాలో) చొప్పున వాటాను కలిగి ఉండగా, మనదేశం నుంచి జరిగే ఎగుమతుల్లో టాప్ 5 శాతం సంస్థల వాటా 59% మాత్రమేనని ఈ సర్వే స్పష్టం చేసింది.

రాష్ట్ర యువతకు ఇది శుభవార్త


టాప్5లో తెలంగాణకు చోటుపై మంత్రి కేటీఆర్

ఉత్పత్తులు, తయారీరంగ ఎగుమతుల్లో తెలంగాణ దేశంలోనే ఐదో స్థానానికి చేరుకోవడం గొప్ప విషయమని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి, ముఖ్యంగా ఇక్కడి యువతకు ఇది శుభవార్త అని పేర్కొన్నారు. సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎకనామిక్ సర్వే 2017-18 నివేదికలో ఉత్పత్తులు, తయారీలో తెలంగాణ టాప్-5లో ఒకటిగా నిలిచిందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, టీఎస్ఐపాస్ వంటి ఆకర్షణీయ విధానాలు, అవినీతికి అడ్డుకట్ట, తయారీరంగం వృద్ధి వంటి అంశాలు తెలంగాణను ఉన్నత స్థానంలో నిలిపాయని చెప్పారు. ఒక వైపు ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు కల్పిస్తూనే, ప్రైవేటురంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ప్రోత్సహిస్తూ ఉద్యోగ కల్పనకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలిపారు. తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు చాలా ఉంటాయని, వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ధీమా వ్యక్తంచేశారు. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ అగ్రగామి రాష్ట్రంగా ఎదిగే లక్ష్యంతో ముందుకు వెళ్తామని, నంబర్ వన్ స్థానాన్ని చేరుకుంటామని అన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.52 గంటలకు



సూర్యాస్తమయం: 6.07 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం చతుర్దశి రాత్రి 10.24 వరకు తదుపరి పూర్ణిమ, నక్షత్రం: పునర్వసు రాత్రి 8.18 వరకు తదుపరి పుష్యమి, అమృతఘడియలు: సాయంత్రం 6.11 నుంచి రాత్రి 7.47 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.18 నుంచి 4.42 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.07 నుంచి 9.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.22 నుంచి 3.07 వరకు, వర్జ్యం: ఉదయం 9.41 నుంచి 11.17 వరకు.

లోకం పోకడ



కొంపదీసి బిడ్డ పేరుమీద ఇంకో పది ఆధార్ కార్డులు తీసుకొమ్మనరుగదా అంటున్నారు సార్!

పట్టాలెక్కిన జీడీపీ

మొదటిపేజీ తరువాయి...

వెలిబుచ్చింది. ఈ ఆర్థిక సర్వేను ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ రూపొందించగా, సర్వేను పార్లమెంట్‌లో జైట్లీ ప్రవేశపెట్టిన అనంతరం విలేఖరులతో సుబ్రమణ్యన్ మాట్లాడారు. ఈ సందర్భంగా జీడీపీపై డిమానిటైజేషన్, జీఎస్టీలది తాత్కాలిక ప్రభావమేనన్నారు. ఈ ప్రభావం పూర్తిగా తొలిగిపోయినట్లేనన్న ఆయన ఎగుమతులు పుంజుకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ 7.5 శాతాన్ని దాటుతుందన్న విశ్వాసాన్ని కనబరిచారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో వృద్ధిరేటు 6.75 శాతంగా నమోదు కావచ్చన్నారు. ఇటీవల కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) వేసిన 6.5 శాతం అంచనా కంటే ఇది ఎక్కువ కావడం గమనార్హం. 2016-17లో 7.1 శాతంగా ఉన్న జీడీపీ.. 2015-16లో 8 శాతంగా, 2014-15లో 7.5 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. అయితే నల్లధనం, నకిలీ కరెన్సీల నియంత్రణకుగాను 2016 నవంబర్ 8వ తేదీన ప్రకటించిన రూ.500, రూ.1,000 నోట్ల రద్దు, ఒకే దేశం.. ఒకే మార్కెట్.. ఒకే పన్ను నినాదంతో పరోక్ష పన్నులను ఏకం చేస్తూ గతేడాది జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన జీఎస్టీతో జీడీపీ అంచనాలు ఒక్కసారిగా పడిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఆర్థిక వ్యవస్థ కోలుకుంటుందన్న సంకేతాలు.. మోదీ సర్కారుకు వివిధ రాష్ట్రాల్లో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో కొత్త ఊపిరులూదుతున్నాయి. నిజానికి జీఎస్టీ అనంతరం పరోక్ష పన్ను చెల్లింపుదారులు 50 శాతం పెరిగారన్న ఆర్థిక సర్వే.. 34 లక్షల వ్యాపార సంస్థలు జీఎస్టీ పరిధిలోకి వచ్చాయన్నది. అయితే పెరుగుతున్న ముడి చమురు ధరలు ఆర్థిక ప్రగతికి విఘాతం కలిగిస్తాయా? అన్న ఆందోళన మాత్రం తాజా సర్వేలో స్పష్టంగా కనిపించింది. దేశ ఇంధన అవసరాల్లో 80 శాతం విదేశాల నుంచి జరిగే ముడి చమురు దిగుమతుల పైనే ఆధారపడ్డ నేపథ్యంలో బ్యారెల్ చమురు ధరలో పెరిగే ప్రతీ 10 డాలర్లు.. జీడీపీని 0.2-0.3 శాతం చొప్పున తగ్గిస్తుందని, ద్రవ్యోల్బణాన్ని 0.2-0.3 శాతం మేర పెంచుతుందని, కరెంట్ ఖాతా లోటును తీవ్రం చేస్తుందని సుబ్రమణ్యన్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం దేశ ముడి చమురు దిగుమతులు దాదాపు 14 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరం 10-15 శాతం పెరుగవచ్చని అంచనా వేశారు. ఇదిలావుంటే ప్రభుత్వ సంస్కరణలతో ప్రైవేట్ రంగంలో ఆహ్వానించదగ్గ వ్యవస్థీకృత మార్పులు చోటుచేసుకున్నాయని, నిష్పక్షపాత వ్యాపారాభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. ప్రభుత్వ వర్గాలతో దగ్గర సంబంధాలుంటేనే మిక్కిలి ప్రయోజనాలుంటాయని, వ్యాపారం నడుస్తుందన్న భావన నుంచి అందరికీ సమాన ప్రయోజనాలు అన్న దృక్పథం ఏర్పడిందన్నారు. లైసెన్స్ రాజ్ రోజుల్లో మాదిరి కాకుండా, ఆశ్రిత పక్షపాతం లేకుండా నైపుణ్యం ఆధారంగానే ఇప్పుడు వ్యాపార రంగానికి పెద్దపీట దక్కుతున్నదన్నారు. మరోవైపు వ్యవసాయ ఆదాయం 20-25 శాతం పడిపోయే వీలున్నదని, వాతావరణ మార్పులే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఈ నేపథ్యంలోనే నీటిపారుదల వసతులు పెరుగాలని, సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, విద్యుత్, ఎరువుల రాయితీలు ప్రభావవంతంగా ఉండాలన్నారు. మొత్తానికి సమీప భవిష్యత్తులో విద్య, ఉపాధి, వ్యవసాయం ప్రధాన సవాళ్లను ఎదుర్కోనున్నవన్నారు. కాగా, కొత్త ఆర్థిక సంవత్సరానికిగాను గురువారం పార్లమెంట్‌లో జైట్లీ బడ్జెట్ ప్రవేశపెడుతున్న క్రమంలో ఆర్థిక స్థిరీకరణ ప్రణాళికపై మాత్రం తాజా సర్వే ఏవిధంగానూ స్పందించలేదు.

భారీగా పెరిగిన జీఎస్టీ

డిసెంబర్‌లో జీఎస్టీ రాబడి రూ.725 కోట్లు

జనవరిలో ఇప్పటికే రూ.831 కోట్లు దాటిన వసూళ్లు

రాష్ట్రంలో ఫలిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లు ● మొత్తం రాబడి 3,400 కోట్లుగా అంచనా



ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: జీఎస్టీ విషయంలో రాష్ట్రంలో స్పెషల్ డ్రైవ్‌లు ఫలిస్తున్నాయి. ప్రతీ రెండువందల మంది డీలర్లకు ఒక ఇంచార్జి ఆఫీసర్‌ను నియమించడంతోపాటు బకాయిదారులకు వెంటవెంటనే నోటీసులు జారీచేయడం, సంచార బృందాలను నెలకొల్పడంతో రాష్ట్రంలో జీఎస్టీ వసూలు పెరిగింది. గతేడాది డిసెంబర్‌లో జీఎస్టీ రూపంలో రూ.725కోట్ల రాబడి రాగా ఈ జనవరి నెలలో ఇప్పటికే రూ.831కోట్లు దాటింది. మద్యం, పెట్రోల్, డీజిల్ ఇతర వ్యాట్ రాబడి మొత్తం కలిపి ఈ నెల రూ.3,400కోట్ల వరకు రావచ్చని అధికారులు అంచనా వేశారు. డిసెంబర్‌తో పోలిస్తే జనవరిలో జీఎస్టీ రాబడి ఎకాఎకిన రూ.106 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఐజీఎస్టీ రాబడి భారీగా పెరిగింది. ఈ నెల ఇప్పటికే రాబడి రూ.800కోట్లకు చేరింది. ఐజీఎస్టీ రూపంలో ఆగస్టులో రూ.418 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.669 కోట్లు, అక్టోబర్‌లో రూ.784కోట్లు, నవంబర్‌లో రూ.798కోట్లు, డిసెంబర్‌లో రూ.768 కోట్ల రాబడి వచ్చింది. జనవరిలో అది రూ.800కోట్లను దాటింది. ఇంటర్‌స్టేట్ జీఎస్టీ రాబడి డిసెంబర్‌లో రూ.768కోట్లు రాగా ఈసారి ఇప్పటికే రూ.800 కోట్లు దాటింది. ఐజీఎస్టీ రాబడి క్రమంగా పెరుగుతున్నది. కొన్ని నెలలుగా రాష్ట్రంలో విలువ ఆధారిత పన్ను, వస్తువులు, సేవల పన్ను రాబడులు స్థిరంగా పెరుగుతున్నాయి. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత మొదటి నెల ఆదాయం తగ్గినప్పటికీ ఆగస్టు నుంచి బాగా పుంజుకుంది. గత ఏడాది వ్యాట్ వసూళ్లతో పోలిస్తే రాబడి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో వరుసగా 5.68%, 14.67%, 26.34%, 25.69శాతానికి పెరిగింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, మద్యంపై వసూలు చేసిన వ్యాట్ పన్ను వాటానే ఎక్కువగా ఉండటం గమనించదగ్గ విషయం. అక్టోబర్‌లో స్టేట్ జీఎస్టీ ద్వారా రూ.850.66 కోట్లు వసూలుకాగా, నవంబర్‌లో రూ.750.51కోట్లు వచ్చింది. జీఎస్టీ రాబడి జనవరి నెలలో బాగా పెరిగిందని ప్రభుత్వ కార్యదర్శి (వాణిజ్యపన్నులు, ఆబ్కారీ) సోమేశ్‌కుమార్ తెలిపారు. బకాయిదారులకు ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. ప్రతీ రెండువందల మంది డీలర్లకు ఒక ఆఫీసర్ ఇంచార్జిని నియమించడం, ఎప్పటికప్పుడు పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించడంవల్ల పన్నుల వసూలు పెరిగిందన్నారు. జీఎస్టీ 3-బీ రిటర్న్‌లను దాఖలుచేయని డీలర్లు వెంటనే దాఖలు చేయాలని ఆయన సూచించారు. వ్యాట్ రిటర్న్‌లలో ఇంకా చెల్లించని బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐదు నోటిఫికేషన్ల ఫలితాలు విడుదల

వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతంలో నిర్వహించిన ఐదు పరీక్షల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఫలితాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నది. తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు పరిధిలోని అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, తెలంగాణ గిరిజన సంక్షేమ హాస్టళ్ల ఫిజికల్ డైరెక్టర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పరీక్షా ఫలితాలను విడుదల చేసింది.

పంచాయతీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ హవా

మొదటిపేజీ తరువాయి...

జరిగింది. సమయంలోగా పోలింగ్ కేంద్రం కాంపౌండ్ లైన్‌లో ఉన్న వారికి ఓటు వేయడానికి అవకాశం కల్పించారు.

రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన సర్పంచ్‌ల వివరాలు

జిల్లా	మండలం	గ్రామ పంచాయతీ	గెలిచిన పార్టీ
వనపర్తి	వీపనగండ్ల	వీపనగండ్ల	కాంగ్రెస్
వనపర్తి	నర్వ	నాగల్ కోడ్మూర్	టీఆర్ఎస్
సూర్యాపేట	తుంగతుర్తి	మనపురం	టీఆర్ఎస్
సిద్దిపేట	హుస్నాబాద్	పొట్లపల్లి	కాంగ్రెస్
సిద్దిపేట	మద్దూర్	కొండాపూర్	టీఆర్ఎస్
సంగారెడ్డి	మనూర్	మైకోడ్	టీఆర్ఎస్(ఏకగ్రీవం)
సంగారెడ్డి	రాయ్‌కోడ్	రాయ్‌కోడ్	కాంగ్రెస్
పెద్దపల్లి	పెద్దపల్లి	బ్రాహ్మణపల్లి	టీఆర్ఎస్
నల్లగొండ	నకిరేకల్	పాలెం	టీఆర్ఎస్
నల్లగొండ	పీఏ పల్లి	రాంపూర్	టీఆర్ఎస్
నాగర్‌కర్నూలు	తెల్కపల్లి	గడ్డంపల్లి	బీజేపీ
మెదక్	యెల్దుర్తి	దామరచర్ల	స్వతంత్ర
మెదక్	శివంపేట	అల్లీపూర్	టీఆర్ఎస్
మంచిర్యాల	మంచిర్యాల	కర్ణమామిడి	టీఆర్ఎస్
మహబూబ్‌నగర్	దేవరకద్ర	బస్వాపూర్	కాంగ్రెస్
మహబూబ్‌నగర్	జడ్చర్ల	బూరుగుపల్లి	టీఆర్ఎస్
మహబూబాబాద్	నర్సంపేట	గుండ్రాజ్‌పల్లి	టీఆర్ఎస్
కరీంనగర్	గంగాధర	ఉప్పర్‌మల్యాల	టీఆర్ఎస్
జోగుళాంబ- గద్వాల	వడ్డెపల్లి	రామాపురం	స్వతంత్ర
భద్రాద్రి- కొత్తగూడెం	కొత్తగూడెం	సుజాతనగర్	టీఆర్ఎస్
భద్రాద్రి- కొత్తగూడెం	చంద్రుగొండ	గుంపెన	టీఆర్ఎస్
ఆదిలాబాద్	ఇచ్చోడ	బోరేగాన్	టీఆర్ఎస్

ముగ్గురు ఐఏఎస్‌లకు స్పెషల్ సీఎస్‌లుగా పదోన్నతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా పదోన్నతులు రానున్నాయి. ఇందుకు సంబంధించి సోమవారం జరిగిన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశం ఆమోదం తెలిపింది. డీవోపీటి కార్యదర్శి హీరాలాల్ సమారియా, సీఎస్ ఎస్పీసింగ్, స్పెషల్ సీఎస్ ఎస్కే జోషిలతో కూడిన డీపీసీ.. 1988 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు అధర్‌సిన్హా, శాలినీ మిశ్రా, రాణి కుముదినికు పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయించింది. త్వరలో వీరికి పదోన్నతులు ఖరారు చేస్తూ గెజిట్ విడుదల కానున్నది.

కాంగ్రెస్‌కు 70 స్థానాలు భ్రమే




వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి సమీపంలో బుద్దారం కుడికాలువ పైలాన్‌ను సోమవారం ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి తదితరులు కూడా ఉన్నారు. బహిరంగ సభకు హాజరైన రైతులు

- ఆ పార్టీ హయాంలో రైతులకు కష్టాలే మిగిలాయి
- మంత్రి హరీశ్‌రావు మండిపాటు
- రైతులపై ప్రేమే ఉంటే కేసులు ఉపసంహరించాలి
- వనపర్తి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరిస్తాం
- వేరుశనగకు మద్దతుధర సాధిస్తామని మంత్రి హామీ

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ నాయకులు తమకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 70 అసెంబ్లీ సీట్లు వస్తాయని భ్రమల్లో బతుకుతున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. కృష్ణానది నికర జలాలు పాలమూరుకు దక్కాలన్నది సీఎం కేసీఆర్ తపన అన్నారు. కృష్ణానది నికరజలాలు పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకే కేటాయిస్తామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతకాలం రాష్ట్రంలో రైతులకు కష్టాలే మిగిలాయని రైతులపై కపటప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్‌కు నిజమైన ప్రేమ ఉంటే సాగునీటి ప్రాజెక్టులపై కోర్టుల్లో వేసిన కేసులను ఉపసంహరించుకుని, రైతులకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా పరిధిలోని పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి సమీపంలో రూ.18 కోట్లతో 21 వేల ఎకరాలకు నీరందించే బుద్దారం కుడి కాలువ పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు పెద్దమందడి మండలం వెల్టూరు, వనపర్తి మండలం చిట్యాలలో నిర్మించిన ఆధునిక గోదాంలను మంత్రి హరీశ్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి సమక్షంలో ప్రారంభించారు. అనంతరం పామిరెడ్డిపల్లి సమీపంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సాగించినంత కాలం రైతులకు ఎలాంటి మేలు జరుగలేదని హరీశ్ అన్నారు. వనపర్తి జిల్లాలో బీమా, కల్వకుర్తి, మైనర్ లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. పదేండ్లకాలం అధికారంలో ఉన్నప్పుడు మంత్రులుగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిన్నారెడ్డి తెలంగాణకు సాగునీటిపరంగా నష్టం జరుగుతున్నా ఎందుకు మౌనం వహించారని నిలదీశారు. హామీలతో ఆశలు కల్పించి కాలయాపన చేసిన కాంగ్రెస్ నాయకులు మళ్లీ రైతులకు మాయమాటలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. 2009 ఎన్నికల్లో పగలు 9 గంటలు త్రీఫేస్ కరంట్ ఇస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పాలమూరులోని ఎంజీకేఎల్‌ఐ, నెట్టెంపాడ్ ప్రాజెక్టులకు వరదజలాల కేటాయింపులున్నాయని, ఈ ప్రాజెక్టులకు నికరజలాలు కేటాయించాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమని చెప్పారు. వేరుశనగకు మద్దతుధరపై కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు జితేందర్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెంలో నిర్మాణం జరుగుతున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన వెంకటాద్రి రిజర్వాయర్ పనులను పరిశీలించి మంత్రి సమీక్షించారు. సమావేశంలో జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బీ లక్ష్మయ్య, జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, మార్కెట్ చైర్మన్లు ఎత్తం రవికుమార్, గౌని బిచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హరీశ్‌రావు ప్రాజెక్టుల సందర్శన

హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు మంగళవారం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లోని ప్రాజెక్టు పనులను పరిశీలించనున్నారు. ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో 11.15 గంటలకు తుపాకులగూడెం బయలుదేరుతారు. 12.45 గంటలకు గంగారం పంప్‌హౌస్‌కు చేరుకుంటారు. తుపాకులగూడెం బరాజ్ పనులను పరిశీలించిన అనంతరం సుందిళ్ల గ్రామానికి మధ్యాహ్నం 2.20 గంటలకు చేరుకుంటారు. బరాజ్, పంప్‌హౌస్ పనుల పరిశీలన అనంతరం 4.15 గంటలకు సుందిళ్ల నుంచి హైదరాబాద్ బయలుదేరుతారు.

శ్రీరామనవమికి ముహూర్తం ఖరారు

మార్చి 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం • 27న శ్రీరామ పట్టాభిషేకం



భద్రాచలం, నమస్తే తెలంగాణ: శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. వైదికకమిటీ తేదీలను ఖరారుచేసి ప్రభుత్వ ఆమోదానికి పంపింది. మార్చి 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా, 26న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, 27న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీ విలంబినామ సంవత్సర వసంత పక్ష తిరుకల్యాణ శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఉగాది రోజైన మార్చి 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వైదిక కమిటీ తేదీలను ఖరారుచేసింది. మార్చి 22న పంచమి రోజున ఈ ఉత్సవాలకు అంకురారోపణ గావించనున్నారు. అదేరోజు గరుడాదివాసం వేడుక జరుపుతా రు. మార్చి 24న గజారోహణం, 25న ఎదుర్కోలు ఉత్సవం జరుపుతారు. 26న శ్రీరామనవమి వేడుక (శ్రీసీతారాముల కల్యాణం),27న శ్రీరామ పట్టాభిషేకం, అదేరోజు రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. 28న సదశ్యం, 29న స్వామివారి తెప్పోత్సవం, తాతగుడి సెంటర్‌లో దొంగల దోపు ఉత్సవం, 30న ఊంజల్‌సేవ, 31న వసంతోత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్1న చక్రస్నానం, మహాపూర్ణాహుతి, ద్వాదశహారతులు, కంకణ ఉద్వాసన, గరుడపట ఉద్వాసన తదితర వాటిని నిర్వహిస్తారు.

విమానాశ్రయంలో ఐటీ ఉద్యోగి మృతి

ఫోన్ మాట్లాడుతూ బ్రిడ్జిపై నుంచి జారిపడి దుర్మరణం

మృతుడు ఏపీలోని విజయవాడ వాసి

చెన్నై, జనవరి 29: చెన్నై విమానాశ్రయంలో యువ ఐటీ ఉద్యోగి సోమవారం ప్రమాదశాత్తు మరణించారు. మృతుడిని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన ఉయ్యూరు చైతన్యగా గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపిస్తున్న దృశ్యాల ప్రకారం.. అంతర్గత, అంతర్జాతీయ టెర్మినళ్ల మధ్యలోఉన్న బయటకు వెళ్లే గేట్ల వంతెనపై నుంచి జారిపడి చనిపోయి ఉంటాడని అధికారులు పేర్కొన్నారు. చైతన్య ఫోన్‌లో మాట్లాడుతూ బ్రిడ్జిపై ఓ పక్కన కూర్చునేందుకు ప్రయత్నిస్తుండగా 50 అడుగుల ఎత్తైన వంతెనమీది నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బెంగళూరులో పనిచేస్తున్న ఆయన.. స్నేహితుడిని కలిసేందుకు చెన్నైకి వచ్చాడు

తెలుగురాష్ట్రాల్లో భారీ వాయుకాలుష్యం

గ్రీస్ పీస్ ఇండియా హెచ్చరిక

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల్లో కూడా వాయుకాలుష్య ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు గ్రీన్ పీస్ ఇండియా వెల్లడించింది. ఉత్తరాది రాష్ట్రాలు కాలుష్యం ముట్టడిలో ఉక్కిరిబిక్కిరవుతున్న క్రమంలో రెండు రాష్ట్రాలు వెంటనే మేలుకోవాల్సిన అవసరముందని హెచ్చరించింది. ఎయిర్ కొలిప్సీ-2 పేరిట గ్రీన్ పీస్ ఇండియా విడుదల చేసిన రెండో వార్షిక నివేదికతో ఈ సంగతి తెలిపింది. తెలంగాణలోని 11 నగరాల్లో కాలుష్యాన్ని నెలవారీగా పరిశీలించారు. నవంబర్ 2016లో హైదరాబాద్‌లో కాలుష్య తీవ్రత చాలా ఎక్కువగా పీఎం-10స్థాయి 117 యూనిట్లుగా నమోదైంది. ఇది సాధారణ కాలుష్యస్థాయి కన్నా 17 శాతం ఎక్కువ. వార్షిక కాలుష్యస్థాయి సరాసరి కన్నా కూడా ఇది రెండు రెట్లకంటే ఎక్కువే. 2016లో హైదరాబాద్‌లో ఐదు నెలల కాలుష్యస్థాయి వంద యూనిట్ల కన్నా ఎక్కువగా ఉంది. ఏపీ, తెలంగాణల్లో వాయుకాలుష్య తీవ్రత ఆందోళనకరంగానే ఉన్నదని గీస్ పీస్ ఇండియా ముఖ్యప్రచారకర్త సునీల్ దాహియా తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 15 నగరాల్లో వాయు కాలుష్య తీవ్రత పీఎం-10 కంటె అధికంగా ఉందని, ఇది ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్దేశించిన తీవ్రతకన్నా మూడు రెట్లు అధికమని పేర్కొన్నారు. ఈ వాయుకాలుష్యాన్ని అరికట్టలేకపోతే రెండు రాష్ట్రాల్లో పర్యాణవరణం ప్రమాదకరంగా మారి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఉత్తరాదిరాష్ట్రాలు వాయు కాలుష్యం బారిన పడి ఇప్పటికే విల విలలాడుతున్నాయని,తెలుగురాష్ట్రాలు వాటి సరసన చేరకముందే తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవడం అవసరమని దాహియా సూచించారు.

కోమటిరెడ్డిది శవరాజకీయం

- హతుడు, నిందితులూ కాంగ్రెస్ పార్టీవాళ్లే
- స్ట్రీట్‌ఫైట్‌ను స్టేట్‌ఫైట్‌గా మారుస్తున్నరు
- ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజం



సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పూల రవీందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త హత్యను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి శవరాజకీయాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అధికారాన్ని కోల్పోయిన నిరాశా నిస్పృహలతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, స్ట్రీట్‌ఫైట్‌ను కాస్తా స్టేట్‌ఫైట్ మార్చేందుకు యత్నిస్తున్నారని అన్నారు. సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పూల రవీందర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీనివాస్ హత్యతో టీఆర్‌ఎస్‌కు ఎలాంటి సంబంధంలేదని, హతుడు, నిందితులు అందరూ కాంగ్రెస్‌పార్టీకి చెందినవారేనని చెప్పారు. హత్య ఉదంతంపై జిల్లా ఎస్పీ వాస్తవాలు వెల్లడించినప్పటికీ జిల్లా, రాష్ట్ర నాయకులను నల్లగొండకు రప్పించుకుని ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హత్య జరిగిన తరువాత శ్రీనివాస్ సతీమణి లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతోపాటు, మీడియాతో కూడా మాట్లాడుతూ.. 'మా అనుచరులే నమ్మించి హత్య చేశారు' అని పలుమార్లు పేర్కొన్నారని గుర్తుచేశారు. ఎక్కడా టీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయలేదన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, తమ పార్టీనాయకులు, ఎమ్మెల్యే వీరేశంలకు ఎవరితోనూ వైరంలేదని, జిల్లాలో అన్నిపార్టీల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలని కోరుకొనే వారే తప్ప హింసా రాజకీయాలను ప్రోత్సహించరని అన్నారు. రాజకీయాల్లో అనుభవజ్ఞులైన జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శ్రీనివాస్ హత్యకు సంబంధించి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఎమ్మెల్యే భాస్కర్‌రావు చెప్పారు. రాజకీయాలకతీతంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుందామని కోరారు. కోమటిరెడ్డి వైఖరి చూస్తుంటే దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్టుగా ఉందని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గల్లీ లొల్లిని ఢిల్లీ లొల్లిగా మార్చేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నిస్తున్నారని ఎమ్మెల్సీ పూల రవీందర్ విమర్శించారు.

ఉత్తమ్‌కుమార్‌వి పగటి కలలు

- గడ్డం నేలకు తాకినా అధికారంలోకి రారు
- పరకాల నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సవాల్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తరకుమారుడిలా ప్రగల్భాలు పలుకుతున్నారని, వచ్చే ఎన్నికల్లో 70 స్థానాలు వస్తాయంటూ పగటికలలు కంటున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. ఆయన గడ్డం నేలను తాకినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేదని ఎద్దేవా చేశారు. సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వేలాది మంది పార్టీలో చేరుతున్నారని, ఒక నాయకుడు చెప్పగానే ఉత్తమ్ పరకాల నియోజకవర్గంలో మీటింగ్ పెట్టారని, కానీ నలుగురైదుగురు గల్లీ స్థాయి నాయకులు తప్ప ఎవరూ చేరకపోవడంతో అసహనానికి గురై పిచ్చిపట్టినట్టుగా మాట్లాడుతున్నారని అన్నారు. ఉత్తమ్, రేవంత్‌రెడ్డిలలో ఎవరు వచ్చి పరకాలలో గెలిచినా రాజకీయసన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. బంగారు తెలంగాణ కోసం పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకుపోతున్న కేసీఆర్ నాయకత్వం నచ్చి టీఆర్‌ఎస్‌లో చేరానన్నారు. పరకాల నియోజకవర్గంలో గత అరువై ఏండ్లలో జరుగని విధంగా రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎక్కడ చర్చించడానికైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టంచేశారు.

2న మేడారానికి సీఎం కేసీఆర్

అదేరోజు రానున్న ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రి ఓరం




హైదరాబాద్/జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: ఈ ఏడాది మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు మహా అతిథులు తరలి రానున్నారు. ఉప ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు, సీఎం కేసీఆర్, కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి ఓరం పర్యటన ఖరారైంది. మేడారంలో సమ్మక్క, సారలమ్మలు ఫిబ్రవరి 2న గద్దెలపై కొలువై ఉంటారు, అదేరోజు తల్లులను దర్శించుకొనేందుకు ఈ ముగ్గురు ప్రముఖులు వస్తున్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం వెళ్తారని తెలిసింది. ఇప్పటికే ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తాత్కాలిక షెడ్యూల్ ఖరారైంది. శుక్రవారం 11.30 నుంచి 1 గంట మధ్య ఉపరాష్ట్రపతి వచ్చే అవకాశం ఉన్నది. వెంకయ్యానాయుడు సమ్మక్కసారలమ్మలను దర్శించుకోవడా నికి తొలిసారి వస్తున్నా రు. కేసీఆర్ కూడా ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి మేడారం రానున్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2016లో జాతరకు వివిధ కారణాల వల్ల సీఎం కేసీఆర్ రాలేకపోయారు. ఉద్యమనేతగా 2012లో వనదేవతలను దర్శించుకొని మొక్కులు సమర్పించారు. ఉపరాష్ట్రపతి, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో మేడారంలో హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నారు. హెలిప్యాడ్ ఏర్పాటు పనులను సోమవారం రాత్రి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ఎస్పీ ఆర్ భాస్కరన్ పరిశీలించారు. సోమవారం కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి వైద్యారోగ్యశాఖ మంత్రి మల్లాది కృష్ణారావు వనదేవతలను దర్శించుకున్నారు. గురువారం ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ మేడారం వస్తారని బీజేపీ నేత లు సోమవారం అధికారులను కలిసి చెప్పారు.

జాతరకు 4200 బస్సులు

50 కేంద్రాల నుంచి నడుపనున్న ఆర్టీసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆసియాలోనే అతి పెద్దదైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనున్నది. 50 కేంద్రాల నుంచి 4200కుపైగా ప్రత్యేక బస్సులను నడుపనున్నది. బుధవారం నుంచి ప్రారంభమయ్యే మేడారం జాతర ఫిబ్రవరి 2 వరకు జరుగనున్నది. ఈ నాలుగు రోజుల్లో భక్తుల రద్దీ దృష్ట్యా మరిన్ని బస్సులు నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు తెలిపారు. రెండేండ్ల కిందట జాతర సందర్భంగా 3700 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడిపింది. సుమారు 8 లక్షల మందికిపైగా భక్తులు ఆర్టీసీ సేవలను ఉపయోగించుకున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఈ సారి జాతరకు మరో 500 బస్సులను పెంచింది. ఈ సారి సుమారు 10 లక్షల నుంచి 12 లక్షల మంది భక్తులు ఆర్టీసీలో ప్రయాణించే అవకాశం ఉంటుందని అంచనా. ప్రధానంగా వరంగల్, హన్మకొండ, కాజీపేట, కరీంనగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి తదితర 50 కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నారు. జాతరకు 12 వేల మంది ఆర్టీసీ సిబ్బందిని మేడారం స్పెషల్ ఆపరేషన్స్ విధుల్లో నియమించారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం, ఇబ్బందులు కలుగకుండా బస్సులు ఏర్పాట్లుచేయడంతో పాటు, మేడారం వద్ద ఆర్టీసీ తాత్కాలిక బస్ టర్మినల్ ఏర్పాటుచేసింది. అక్కడ వసతులను ఇప్పటికే రవాణాశాఖ మంత్రి పీ మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ రమణారావు, సంస్థ ఉన్నతాధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.

వరంగల్‌లో అధికారులతో ఎండీ సమీక్ష

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కలిసి ఆర్టీసీ ఎండీ రమణరావు సోమవారం వరంగల్‌కు వెళ్లారు. బుధవారం నుంచి జాతర ప్రారంభమవుతున్నందున బస్సుల ఆపరేషన్స్, ప్రయాణికులకు ఏర్పాట్లు, మేడారంలో బస్ టర్మినల్, భక్తుల డిమాండ్ మేరకు ఆయా రూట్లలో బస్సుల నిర్వహణపై ఆర్‌ఎంలు, డిపో మేనేజర్లు,అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.



సోమవారం జంపన్న వాగు వద్ద మేడారం జాతరకు తరలివచ్చిన భక్తుల సందడి (ఇన్‌సెట్) జంపన్న వాగులో స్నానమాచరించి అమ్మవార్లకు మొక్కుతున్న భక్తుడు

రేపటి నుంచే జన జాతర

నాలుగు రోజులు మహానగరాన్ని తలపించనున్న మేడారం • భక్తులకు విస్తృత ఏర్పాట్లుచేస్తున్న యంత్రాంగం
వారంరోజులుగా మకాంవేసిన ఉన్నతాధికారులు • భక్తులకు ఏర్పాట్లు.. బందోబస్తుపై నిరంతరం పర్యవేక్షణ

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: సాధారణ సమయంలో కనుచూపు మేర ఖాళీగా కనిపించే మేడారం చీమలదండులా మారుతున్నది. తాత్కాలిక గుడారాలు, లెక్కకు మిక్కిలి వాహనాలతో మేడారం మహానగరాన్ని తలపిస్తున్నది. కోటి మంది భక్తుల కొంగు బంగారమైన సమ్మక్క-సారలమ్మ మహా జాతర ప్రారంభానికి ఒక్కరోజే మిగిలి ఉండడంతో పిల్లాపాపలతో వనదేవతలను దర్శించుకొనేందుకు పయనమవుతున్నారు. మహాజాతర బుధవారం నుంచి శనివారం వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నది. బుధవారం సాయంత్రానికి కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజులు ఇప్పటికే ప్రయాణమయ్యారు. వీళ్లు కూడా బుధవారం రాత్రి గద్దెల ప్రాంగణానికి చేరుకోనున్నారు. అప్పటి నుంచి జాతర అధికారికంగా ప్రారంభమవుతుంది. గురువారం సాయంత్రం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెలపైకి చేరితే సకల వనదేవతలు కొలువైనట్టే. ఈ నేపథ్యంలో ఇప్పటినుంచే ఇసుకేస్తే రాలనంతగా మేడారం వనమంతా జనంతో నిండిపోతున్నది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా మేడారం చేరుకునే రహదారి పొడవునా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. భక్తులు ప్రైవేటు వాహనాల ద్వారా వచ్చి వెళ్లేందుకు ఆదివారం నుంచి వన్‌వే విధానాన్ని అమలుచేస్తున్నారు. గత 20 రోజుల ముందు నుంచే భక్తులు పెద్దసంఖ్యలో మేడారం వస్తున్నారు. ఆదివారం అత్యధికంగా 12లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం కూడా భక్తులు పోటెత్తారు.



ఏర్పాట్లు, భద్రతపై నిరంతరం సమీక్ష

ఇప్పటికే వారం రోజులుగా మేడారంలోనే మకాం వేసిన ఉన్నతాధికారులు భక్తుల కల్పించే ఏర్పాట్లు, భద్రతపై నిరంతరం సమీక్షిసున్నారు. 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జాతర నిర్వహణలో కీలకపాత్ర పోషించే పోలీసుశాఖ, అత్యధికంగా 15 వేల మంది సిబ్బందితో బందోబస్తుకు ప్రణాళిక రచించింది. 12 వేల మంది సిబ్బందితో మహాజాతరకు 4200 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ రంగంలోకి దిగింది. జాతర విధులు నిర్వర్తించే సిబ్బంది మొత్తం సోమవారమే మేడారం చేరుకున్నారు. జంపన్నవాగు, అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోలీసులు విధుల్లో చేరారు. నార్త్ జోన్ ఐజీ నాగిరెడ్డి, కరీంనగర్ డీఐజీ రవివర్మ, జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్ సోమవారం మేడారంలో పర్యటించారు. సీసీ, క్రౌడ్‌కౌంటింగ్, మానిటరింగ్ కెమెరాలను పరిశీలించారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి ఓరం పర్యటన పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష చేశారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, జేసీ అమయ్‌కుమార్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చక్రధర్‌రావు మేడారంలోనే మకాం వేసి జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. సోమవారం కలెక్టర్ కర్ణన్ బుల్లెట్‌పై పర్యటించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు.

జంపన్నవాగుకు జలకళ

భక్తులు పుణ్యస్నానాలు చేయటానికి లక్నవరం సరస్సు నుంచి విడుదల చేసిన నీరు జంపన్నవాగులోకి చేరింది. ఇక్కడ మహిళలు దుస్తులు మార్చుకోవడానికి 132 తాత్కాలిక గదులను సిద్ధం చేశారు. మేడారం పరిసరాల్లో 11,250 మరుగుదొడ్లను నిర్మించారు. భక్తులు విడిది చేసే ప్రదేశాల్లో నల్లాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం 3,400 మంది నిరంతరం శ్రమిస్తున్నారు. గద్దెల ప్రాంగణం సమీపంలో ప్రారంభించిన 50 పడకల ప్రభుత్వ దవాఖానలో వైద్యులు నిరంతరం సేవలు అందిస్తున్నారు.



దేశంలో ఆర్థిక వ్యత్యాసాలు వేగంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని పరిస్థితిని అర్థం చేసుకొని ప్రజాప్రతినిధులు తమ జీతభత్యాలలో కొంతభాగాన్ని స్వచ్ఛందంగా త్యజించి, దాన్ని పేదల కోసం వెచ్చించేందుకు వినియోగించాలి. ఒక్కో ఎంపీకి అందుతున్న రూ.2.7 కోట్లలో కొంత భాగాన్ని పేదలకు అందేట్లు చేస్తే ప్రజలు హర్షిస్తారు, గౌరవిస్తారు.

వరుణ్ గాంధీ, బీజేపీ ఎంపీ

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాహుల్‌గాంధీకి సముచిత స్థానం కేటాయించకపోవటం దురదృష్టకరం. ఆయన కేవలం ఎంపీ మాత్రమే కాదు. పార్లమెంటులో అతిపెద్ద ప్రతిపక్షపార్టీకి అధ్యక్షుడు. ఇది అధికార బీజేపీకి అర్థం కాకపోవటం విషాదం.

గులాం నబీ ఆజాద్, రాజ్యసభలో ప్రతిపక్ష నేత




చరిత్రలో నేడు



1931
చార్లీ చాప్లిన్ సినిమా 'సిటీ లైట్స్' విడుదల.

1934
ఏకీకృత జర్మనీకి నేతగా హిట్లర్.





1948
నాథురామ్ గాడ్సే జరిపిన కాల్పుల్లో చనిపోయిన జాతిపిత మహాత్మా గాంధీ.

2019 ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు అప్పడే కసరత్తు ప్రారంభమైంది. గణతంత్ర దినోత్సవం రోజున ముంబైలో 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' పేరిట ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ నేతృత్వంలో ప్రతిపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ప్రదర్శన జరిగింది. దీంట్లో వామపక్ష అగ్రనేతలు సీతారాం ఏచూరి, డి. రాజా, హార్దిక్ పటేల్, ఒమర్ అబ్దుల్లా, తృణముల్ నేతలు పాల్గొని ప్రతిపక్షాల ఐక్యతను చాటారు. వచ్చే సాధారణ ఎన్నికలకు ముందు ఈ విధంగా దేశంలోని ప్రధాన ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావటం బీజేపీకి గుబులు పుట్టించేదే. ఇప్పటికే శివసేన దూరమవటంతో ఓటుబ్యాంకుకు గండిపడిందని భావిస్తున్న తరుణంలో ప్రతిపక్షాల ఏకతారాగం బీజేపీకి వ్యతిరేక సంకేతమే.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

రాజకీయాల్లో అనుబంధాలకు తావుండదని ఒడిషా ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ చాటిచెప్పారు. ఎన్నో ఏండ్లుగా తనకు అనుచరుడిగా, ముఖ్యపదవులు నిర్వహించిన ఎంపీ బైజయంతి పాండాను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడన్న కారణంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇది ఒడిషా ప్రభుత్వంలో, బీజేడీలో ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉన్నది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నవీన్ పట్నాయక్ ఈ నిర్ణయం తీసుకోవటం సాహసోపేత నిర్ణయమని చెప్పక తప్పదు.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

గ్రామ స్వరాజ్యం

పార్లమెంటులో సోమవారం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే దేశ పరిస్థితిపై ఆశాజనక దృశ్యాన్ని ఆవిష్కరించింది. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడుతుందనే వాదనను తిప్పికొట్టే విధంగా వ్యాఖ్యానించింది. పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య యాభై శాతం పెరిగిందని వెల్లడించింది. స్థూల దేశీయాభివృద్ధి అంచనాను మించిందని వివరించింది. ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నదని పేర్కొన్నది. జీఎస్టీ మూలంగా ఆర్థిక పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చిందనీ, కొత్త కోణాలు ఆవిష్కరించడానికి ఈ విధానం దోహదపడ్డదని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఆర్థిక సర్వే రాష్ట్రాల వారీగా ఎగుమతుల వివరాలను అందించగలిగింది. ఐదు రాష్ట్రాల నుంచే ఎనభై శాతం ఎగుమతులు సాగుతున్నాయనేది ఆశ్చర్యకరం. ఈ ఐదు రాష్ట్రాలలో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక సరసన తెలంగాణ కూడా ఉండటం విశేషం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న తరువాత మొదటి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు. 2019 పార్లమెంటు ఎన్నికలకు ముందు ప్రవేశ పెట్టే పూర్తి స్థాయి బడ్జెట్ ఇది. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే ప్రాధాన్యం పొందుతున్నది. ప్రభుత్వం ఎంత చెప్పుకున్నప్పటికీ జీఎస్టీ విధానం ఇంకా కుదురుకోలేదనేది వాస్తవం. అంతర్జాతీయ పరిస్థితి ఆశాజనకంగా లేదు. పెట్రోలు ధరలకు సంబంధించి ఇంతకాలం లభించిన వెసులుబాటు ఇక ముందు సాధ్యపడకపోవచ్చు. అంతర్జాతీయ రంగంలో, ఆంతరంగికంగా ఆటుపోట్లు ఎప్పుడయినా తప్పవు. ఈ విపరీత పరిణామాలు ఎట్లా ఉన్నా ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో, దీర్ఘకాలికంగా ఆలోచిస్తే, దేశ ఆర్థిక రంగాన్ని కుదురుగా నిలుపడానికి, పునాదులు నిర్మించడానికి ఆర్థిక సర్వే నిర్దేశిస్తున్న మౌలికాంశాలు ఏమిటి అనేది పరిశీలించాల్సిన విషయం.

ఆర్థిక సర్వే చర్చించిన మరో కీలకమైన అంశం- పంచాయతీలను పటిష్టం చేయడం. ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో ప్రత్యక్ష పన్నుల శాతం తక్కువగా ఉన్నది. గ్రామీణ స్థానిక సంస్థలు పెద్దగా పన్నులు వసూలు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుపైనే నెట్టుకొస్తున్నాయి. దీనికి కారణం ఏమిటనే అంశాలను ఆర్థిక సర్వే చర్చించింది. 73వ రాజ్యాంగ సవరణ చేపట్టిన తరువాత కూడా పంచాయతీలు బలోపేతం కాలేదు. పంచాయతీలు స్వయంగా వనరులను సమీకరించుకొని మరింత జవాబుదారీగా మారాలె.

విద్య, ఉపాధి, వ్యవసాయం అనే మూడు రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలనేది ఆర్థిక సర్వే సూచన. మానవ వనరుల ప్రాధాన్యాన్ని కూడా సర్వే గుర్తించింది. నగరాలకు వలస పెరుగడం వల్ల గ్రామీణ రంగంలో, వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర పెరుగుతున్నది. దీనికి తగిన విధంగా పరిస్థితులను కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. మహిళా కేంద్రంగా గ్రామీణ పరివర్తన అనేది సర్వేలో చెప్పిన కీలకమైన అంశం. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయదారులుగా, వ్యాపారులుగా, కూలీలుగా మహిళలు విభిన్న పాత్రలు పోషించబోతున్నారు. దీనిని అనుకూలాంశంగా గుర్తించి భూమి, నీరు, సాంకేతిక పరిజ్ఞానం మహిళాలోకానికి అందుబాటులోకి తేవాలె. సమాజంలో బాలికల పట్ల ఉండే వివక్షను రూపుమాపడం అవసరం. వ్యవసాయ రంగానికి సాధారణంగా అనేక ప్రతికూలాంశాలు ఉంటాయి. వాతావరణం అనుకూలించక పోవచ్చు. మార్కెట్ హెచ్చుతగ్గులు దెబ్బకొట్టవచ్చు. దిగుబడిలో నిర్దిష్టత ఉండదు. ఈ ప్రతికూలాంశాలు ఉన్నప్పటికీ, నష్టాన్ని నివారించి, లాభసాటిగా మార్చడం ఒక సవాలు. దీనికి వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ప్రోత్సహించడం ఒక విధానం. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తున్న నేపథ్యంలో తగిన శాస్త్ర సాంకేతిక పునాదిని నిర్మించుకోవడం అవసరం. ఇందుకోసం విజ్ఞానాభివృద్ధిపై దృష్టిసారించాలని ఆర్థిక సర్వే సూచించింది. దేశం విజ్ఞానాన్ని వినియోగించుకునే దశ నుంచి సృష్టించే స్థాయికి చేరుకోవాలె. ఇందుకు పరిశోధనారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలె. ప్రవాసుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలె. ఎగుమతులు పెరుగడానికి, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుదలకు లంకె ఉన్నదని కూడా సర్వే వెల్లడించింది.

ఆర్థిక సర్వే చర్చించిన మరో కీలకమైన అంశం- పంచాయతీలను పటిష్టం చేయడం. ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో ప్రత్యక్ష పన్నుల శాతం తక్కువగా ఉన్నది. గ్రామీణ స్థానిక సంస్థలు పెద్దగా పన్నులు వసూలు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుపైనే నెట్టుకొస్తున్నాయి. దీనికి కారణం ఏమిటనే అంశాలను ఆర్థిక సర్వే చర్చించింది. 73వ రాజ్యాంగ సవరణ చేపట్టిన తరువాత కూడా పంచాయతీలు బలోపేతం కాలేదు. పంచాయతీలు స్వయంగా వనరులను సమీకరించుకొని మరింత జవాబుదారీగా మారాలె. దీనికి కారణం సమాజం పన్నుల చెల్లించలేనంత బలహీన స్థితిలో ఉన్నదా? వసతులు కల్పించకపోవడం వల్ల స్థానిక సంస్థలు పన్నులు అడగలేక పోతున్నాయా అనే ప్రశ్నలు తెలెత్తుతున్నాయి. పంచాయతీలను మరింత బాధ్యతాయుతంగా మార్చాల్సిన అవసరాన్ని సర్వే గుర్తు చేసింది. అయితే గ్రామీణ రంగాన్ని మరింత సంపన్నం చేస్తూనే, వాటికి బాధ్యతాయుతంగా వ్యవహరించడం అలవరచాలె. నీటి పారుదల సౌకర్యాలను పెంచడం, వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడం, వివిధ సామాజిక వర్గాల వృత్తి నైపుణ్యాలను పూర్తిగా వినియోగంలోకి తేవడం, విద్యారంగాన్ని పటిష్టం చేయడం మొదలైన చర్యల వల్ల గ్రామీణ రంగం పరివర్తన చెందుతుంది. ఆర్థిక వేత్తలు చెబుతున్న ప్రకారం- వ్యక్తుల స్వల్ప ఆదాయ పెరుగుదల జాతీయోత్పత్తి పెరగడానికి దోహదపడదు. వ్యక్తులు కూడబెట్టుకొని ఖర్చు చేసే స్థితికి వచ్చినప్పుడు ఆ ఆదాయం ఆర్థికాభివృద్ధికి దారితీస్తుంది. అందువల్ల గ్రామీణ ఆర్థిక రంగంలో మౌలిక మార్పులు తేవడం, గ్రామీణ మహిళల సాధికారతకు మార్గాలు ఏర్పరుచడం తక్షణ అవసరం.

జనగళం

హుందాగా వ్యవహరించాలె

టీటీడీపీ నేతలు తాము అధికారంలోకి వస్తే ప్రగతిభవన్‌ను దవాఖానగా మారుస్తామనడం హాస్యాస్పదం. ప్రగతిభవన్ గురించి ఇప్పటికే సీఎం అనేకసార్లు వివరించారు. అది తన సొంతిల్లు కాదన్నారు. ఇది ప్రజలకూ అర్థమైంది. కానీ టీడీపీ నేతలు ఇప్పటికీ దానిపై అసత్యాలు మాట్లాడటం శోచనీయం. రాజకీయాల్లో విమర్శలు అనేవి హుందాగా ఉండాలి. కానీ ప్రతిపక్ష నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం సరికాదు. ప్రభుత్వానికి తగిన సూచనలు చేయాలే కానీ రాజకీయం కోసం ప్రతి అంశాన్ని రాద్ధాంతం చేయడం సరికాదు. అప్పుడే ప్రజల్లో కొంత విశ్వసనీయత పెరుగుతుంది.

- బెక్కం తిరుపతి, హైదరాబాద్

అధికారులదే బాధ్యత

ఆసియాలోనే అతిపెద్ద జాతర అయిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఇప్పటికే జనం తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. జాతర ప్రారంభం రోజుకల్లా కోటికిపైగా జనం వచ్చే అవకాశాలున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ప్రభుత్వం ఈ అంచనాకు తగ్గట్టు మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేసింది. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలి. భక్తులకు రక్షణ కల్పించాలి.

- చుంచు అరుణ్‌కుమార్, వెల్గనూర్, దండెపల్లి, ఆదిలాబాద్

అవగాహన కల్పించాలె

మన ఆహారపు అలవాట్లే అనారోగ్యానికి కారణమౌతున్నట్టు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఆరోగ్యానికి హానిచేసే ఇలాంటి అంశాల పట్ల ప్రజలూ అప్రమత్తంగా ఉండాలి.

- ఎ.సమ్మయ్య, ఆలేరు

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



డాక్టర్ పిడిగెం సైదయ్య

వరిపై ఆంధ్ర వితండవాదం

తెలంగాణ భూముల్లో పంటలు పండవని పొంతన లేని, అశాస్త్రీయ వాదన వినిపిస్తున్నారు ఆంధ్ర వరి శాస్త్రవేత్తలు. ఇక్కడ వరి సాగు చేస్తే నీటి వృథా అని మూర్ఖపు వాదనలు వినిపిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులు తెలంగాణలో కాల్వలు నిర్మించక, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయక ఈ ప్రాంత వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారు.

నాడు అన్యాయం చేసిందే కాక నేడు అసంబద్ధ గణాంకాలతో తెలంగాణకు వ్యతిరేకంగా నీటి కేటాయింపులపై కృష్ణా ట్రిబ్యునల్‌కు అఫిడవిట్ సమర్పించింది. కృష్ణాలో తెలంగాణ వాటాను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ కోరుతున్నది. ఏపీని కాదంటే దేశ ఆహార భద్రతకే ముప్పు అని అబద్ధాలు చెబుతున్నది. దీనికి తెలంగాణలో ఒక కిలో వరి ఉత్పత్తికి అయ్యే ఖర్చులు ఎక్కువని, సాగునీటి వాడుక సామర్థ్యం తక్కువని, అసలు వాతావరణమే అనుకూలంగా లేదని మతిలేని వాదనలు చేస్తున్నది. అసలు ఆంధ్రప్రదేశ్‌లో వరి సాగుకు అవసరమయ్యే విత్తనోత్పత్తి తెలంగాణలోని కరీంనగర్, వరంగల్‌లో జరుగుతున్నది. ఇది వారు తెలుసుకుంటే మంచిది.

'వరి సాగు విరామం' (Paddy crop holiday) ప్రకటించింది ఏపీ రైతులు కాదా? దీన్నిబట్టి వరి సాగు తలకు మించిన భారం ఆంధ్రప్రదేశ్‌లో కాదా? విపరీతంగా సాగునీటిని వాడుతూ తక్కువ ఉత్పాదకత తీస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో ముందు వరి సాగును నిషేధించాలి. తరాలుగా వరిని ఏక పంటగా సాగుచేయటం వల్ల ఆ రాష్ట్రంలో భూములు వ్యాధుల క్షేత్రాలుగా మారాయి. విపరీత ఎరువుల వాడకం వల్ల అక్కడి భూములు ఆమ్లత్వం సంతరించుకున్నాయి. పంజాబ్ రాష్ట్రం వరి, గోధుమల సాగు నుంచి అపరాలు, మక్కజొన్న సాగుకు మారినట్టు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వరి సాగు నుంచి వేరే పంటలకు మారాలి.

దేశంలో ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో వరి సాగుకు అత్యంత అనుకూల వాతావరణం ఉన్నది. కాబట్టే 'భారతీయ వరి పరిశోధన సంస్థ'ను తెలంగాణలో ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అభివృద్ధిపరిచిన వరిలో సూటిరకాలు, హైబ్రిడ్ రకాలను విడుదలకు ముందు ఇక్కడ కచ్చితంగా పరీక్ష చేయాల్సిందే. అంతెందుకు మీరు అభివృద్ధి చేసిన రకాలను కూడా ఇక్కడ పరీక్షించినవే అన్నది మరిచిపోవద్దు.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు, పంటలకు ప్రత్యేకించి వరి పరిశోధన, కొత్త వంగడాల రూపకల్పన, విడుదలలో మీరు చూపెట్టిన వివక్ష ఇప్పటికీ కన్పిస్తున్నది. మా ప్రాంతానికి అంతగా అనుకూలం కాని సన్నరకం బియ్యాన్నిచ్చే బీపీటీ 5204ను బలవంతంగా తెలంగాణ రైతులపై రుద్దారు. ఈ రకానికి సోకని రోగమంటూ లేదు. దోమపోటు, కాండం తొలిచే పురుగు, ఇతర వ్యాధులు సోకుతాయి. దీంతో సగానికిపైగా పెట్టుబడి ఖర్చులు వీటి నివారణకే వాడాల్సి వస్తున్నది. కానీ ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన తెలంగాణ సోన రైతులకు సిరులు కురిపిస్తున్నది. ఇప్పటికే ఇతర రాష్ట్రాలు ఈ రకాన్ని భారీగా సాగుచేస్తున్నాయి. గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటంతో అన్నం అంటే భయపడే 'మధుమేహ' వ్యాధ్యిగ్రస్తులూ భేషుగ్గా తింటున్నారు.ఈ రకం వరి సాగుకు ఆంధ్ర రైతులు క్యూ కడుతున్న విషయం మీకు తెలుసా? యాసంగిలో ఎక్కువ చలి సందర్భంలో 'తాలు గింజలు' ఏర్పడి ధాన్యం నష్టం జరుగుతుంది. అటువంటి పరిస్థితుల్లోనూ భేషైన దిగుబడి నివ్వగలిగిన రకాలు జగిత్యాల, వరంగల్‌లోని పరిశోధన సంస్థల్లో సిద్ధమై ఉన్నాయి .ఈరకం యాసంగిలో మేలైన దిగుబడినిస్తుంది. తెలంగాణ అంతా విత్తనోత్పత్తికి అత్యంత అనుకూలం. అందులో వరిలో సూటి రకాలు, హైబ్రిడ్ రకాల విత్తనోత్పత్తి భారీగా తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలో జరుగుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో, విడిపోయిన తర్వాత ఇప్పటివరకు విడుదలైన 'సుమతి' బాసుమతి రకం ఒక్కటే. అంటే తెలంగాణే 'వరి' సాగుకు అనుకూలమని దీనితో సుస్పష్టం.

'సాగు నీటి వాడుక సామర్థ్యం' గురించి మాట్లాడుకుందాం. దేశవ్యాప్తంగా సాగునీటి వాడుక సామర్థ్యం 33 శాతమే. ఒక యూనిట్ ఉత్పత్తికి వాడబడే మొత్తం నీరు ఇది. ఆంధ్ర ప్రాంతంలో మొదటి నుంచి 'ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగునీటి కాలువలు, నీరు వరి సాగుకు అందుబాటులో ఉన్నాయి. అవసరమున్నా లేకున్నా అధికంగా నీటిని వాడటంతో వృథాగా పోయే నీరే ఎక్కువ. దీంతో కిలో వరి ధాన్యం ఉత్పత్తికి వాడబడుతున్న నీటి పరిమాణం చాలా ఎక్కువ. అంటే నీటి వాడుక సామర్థ్యం చాలా తక్కువ. నిజానికి ఆంధ్ర పండించే వరి రకాల కంటే రాయలసీమలో పండించే 'కర్నూలు సోన, మా తెలంగాణ సోనకే వినియోగదారుల ఆదరణ ఎక్కువ. కేవలం ఆరు తడి వరి, వర్షాధార సాగే తెలంగాణ రాష్ట్రంలో సాధ్యమని మీ 'మిథ్యా' శాస్త్రవేత్తల డొల్ల వాదనలు. అయితే ఎకరాలో సాగునీటి ఆధారంగా పండించటంలో అవసరమయ్యే నీటితో రెండు ఎకరాల్లో ఆరుతడి వరి వేయవచ్చు. అంటే ఆరుతడి పంటకు అవసరమయ్యే నీరు తక్కువ కాబట్టి నీటి వినియోగ సామర్థ్యం ఎక్కువ. మరి మీ శాస్త్రజ్ఞుల వ్యాఖ్యల మతలబు ఏమిటి? అన్ని పంటల్లో 'బిందు, తుంపర సేద్యాల వాడకంతో అత్యధికంగా 80-90 శాతం నీటి వాడుక సామర్థ్యం సాధిస్తున్న రాష్ట్రం తెలంగాణ. 'ఇప్పటికే తెలంగాణలో కొంతమంది రైతులు వరిలోనూ తుంపర బిందు నీటి సేద్యాన్ని అవలంబిస్తున్నారు. ఈ లెక్కన నీటిని పొదుపుగా వాడుతున్నది తెలంగాణ లేక ఆంధ్రానా?

ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి కేటాయింపులో మీ వివక్ష వల్ల తెలంగాణ భూములు బీడువారాయి. రైతులు సొంత పెట్టుబడులతో బోర్ల ద్వారా పొలాలకు నీటిని అందించటానికి అప్పులు చేశారు. పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. కరెంటు ఛార్జీల కష్టాలూ పెరిగాయి. అయినా మొక్కవోని ధైర్యంతో తెలంగాణ రైతులు వరి సాగు చేశారు. సరసమైన ధరకే వినియోగదారులకు అందించగలిగారు. మరి మీరు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీటిని కూడా మీ సాగునీటి అవసరాలకు వాడుకున్నారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకున్నారు. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. తెలంగాణ ప్రభుత్వం చేట్టిన మిషన్ కాకతీయతో చెరువులు కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. సాగునీటి అందుబాటు పెరిగింది. వరి ఉత్పాదకత కూడా భారీగా పెరిగింది. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో వరికి ప్రత్యేక పరిశోధన స్థానాన్ని ఏర్పాటుచేసిన పాపాన పోలేదు. మారుటేరులో మీరు మాత్రం 'వరి పరిశోధన స్థానం' ఏర్పాటు చేసుకున్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీల ప్రధాన కేంద్రంగా ఉన్న 'అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ' తెలంగాణలో ప్రాంతీయ కేంద్ర ఏర్పాటుకు స్థలం ఇవ్వమని కోరితే, నిరాకరించి మాకు అన్యాయం చేశారు. అత్యంత వైవిధ్యమైన వరి రకాలు తెలంగాణలో ఉన్నాయి. ఆసియాలోనే అత్యధిక 'రైస్ మిల్లులు' మిర్యాలగూడలో ఉన్నాయి. ఎంత ఉత్పత్తి ఉంటే అన్ని మిల్లులు అవసరం ఉంటాయి? ఇదిఎప్పుడైనా మీరు బుర్రలు పెట్టి ఆలోచించారా?

రెండు రాష్ట్రాల్లో దాదాపు ఒకే వ్యవసాయ వాతావరణం ఉన్నది. దీనికితోడు రెండు రాష్ట్రాల్లో 20పైగా వరి రకాలు సాగులో ఉన్నాయి. వీటి జన్యు సామర్థ్యం, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు నాగార్జునసాగర్ ఆయకట్టులో ఖమ్మం, నల్లగొండ జిల్లాలో వరి రకాల పంటకాలం 120 రోజులు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 150 రోజులు. ప్రకాశం జిల్లాలో 140 రోజులు పడుతుంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ వాదనలు అసత్యం. కచ్చితంగా స్వల్పకాలిక వరి రకాలు తక్కువ దిగుబడినిస్తాయి. దీర్ఘకాలిక వరి రకాలు అధిక దిగుబడినిస్తాయి. ఆంధ్రలో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యేది దీర్ఘకాలిక రకాలే. ఆంధ్రలో డెల్టా భూముల్లో 14 రోజులపాటు నీరు నిలిచిపోతుందని, అక్కడ వరి సాగు అనుకూలమని వారి వాదన. నిజానికి అక్కడ వరి మాత్రమే పండుతుంది. ఇతర పంటల సాగుకు ఆ భూములు పనికి రావని వారి వాదన ఉండాలి. తెలంగాణల ఎర్ర నేలలున్నాయి కాబట్టి ఆరు తడి పంటలే వేసుకోవాలని ఆంధ్ర వాదన. అసలు నిజమేమిటి అంటే ఆరుతడిపంటలు ఒక అవకాశం మాత్రమే. మిగతా అన్ని పంటలు ఈ భూముల్లో సాగుకు అత్యంత అనుకూలం. సాగునీటి ఆధారం యాసంగిలో ఎక్కువ అవసరం. వానకాలంలో వర్షమే ప్రధాన ఆధారం. ఇక ఉత్పాదకత అత్యంత గొప్పగా ఉండి ఉత్పత్తి ఖర్చులు తక్కువగా ఆ పంటను పండించాలంటే 2012-13 గణాంకాల ప్రకారం క్వింటాలు వరి ధాన్యం ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.1135 ఉంటే, పంజాబ్‌లో రూ.946, ఉత్తరప్రదేశ్‌లో రూ.1019 మాత్రమే. మక్కజొన్నలో క్వింటాలు ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్‌లో రూ.1096 అయింది. బీహార్‌లో రూ.786 మాత్రమే. క్వింటాలు పత్తి ఉత్పత్తికి పంజాబ్‌లో రూ.3745, హరియాణాలో రూ.3796 అయితే ఆంధప్రదేశ్‌లో రూ.4089, కందులు క్వింటాలు ఉత్పత్తికి ఆంధప్రదేశ్‌లో రూ.4484 అయితే, కర్ణాటక, మహారాష్ట్రలలో రూ.3102, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో ఇంకా తక్కువ. పై రాష్ట్రాల అనుకూలతతో పోలిస్తే ఆంధప్రదేశ్ అనుకూలం కాదు. అలాంటప్పుడు ఈ పంటలు మీరెందుకు పండిస్తున్నారు?

ఆంధ్రప్రదేశ్ చెప్పినవి పసలేని, శాస్త్రీయత లోపించిన గణాంకాలు. ఇవి వారి సొంత గణాంకాలు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అత్యంత శాస్త్రీయంగా, చిత్తశుద్ధితో రైతుల కోసం, సాగు బాగు కోసం పనిచేస్తున్నది. సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ చెప్పినవి పసలేని, శాస్త్రీయత లోపించిన గణాంకాలు. ఇవి వారి సొంత గణాంకాలు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అత్యంత శాస్త్రీయంగా, చిత్తశుద్ధితో రైతుల కోసం, సాగు బాగు కోసం పనిచేస్తున్నది. సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతినిధులు ప్రశంసలు కూడా అందుకుంటున్నది. రాబోయే రోజుల్లో అన్ని పంటల్లో ఆంధప్రదేశ్‌ను తలదన్నే రీతిలో వ్యవసాయం భవిష్యత్తు తెలంగాణలో ఉంటుందనడం అతిశయోక్తి కాదు.

(వాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

వందశాతం ఎఫ్‌డీఐలతో అల్లకల్లోలమే

ఆర్థికం



డాక్టర్ చెన్నమనేని రమేశ్

ఈమధ్య కేంద్ర ప్రభుత్వం సింగిల్ బ్రాండ్ రిటేల్ వ్యాపారంలో వంద శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తూ విధానపరమైన నిర్ణయం తీసుకున్నది. దీంతో దేశంలోకి కుప్పలుతెప్పలుగా విదేశీ పెట్టుబడులు ప్రవహించి దేశాభివృద్ధికి, వృద్ధిరేటుకు సహకరిస్తాయని చెప్పుకొస్తున్నది. అయితే రిటేల్ రంగంలోకి వందశాతం పెట్టుబడుల కారణంగా దేశీయంగా చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులపై ఎలాంటి ప్రభావం చూపుతున్నదన్న దాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. మరోవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ పన్నువిధానంతో దేశీయంగా సకల ఉత్పత్తి, వ్యాపారరంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకోలేదు. అంతేకాదు స్థూల ఆర్థికాభివృద్ధిలో మందగమనం చోటుచేసుకున్నది. అలాగే వాస్తవ జీడీపీలో వృద్ధి ఏడాదిలో 6-7 శాతం ఉండొచ్చని అంచనా. దీంతో దేశంలో కొత్తగా ఉనికిలోకి వచ్చిన వస్తు వినియోగవర్గం అంటే ఏడాదికి 90 వేల ఆదాయం గల వారు 60 కోట్లకు చేరుకున్నది. దీంతో దేశ రిటేల్ మార్కెట్ 10 శాతం పెరుగుతుందని ప్రభుత్వం చెబుతున్నది. దీంతోపా టు సాలీన వ్యాపారం కూడా గణనీయంగా పెరుగుతుందని 2016లో 641 అమెరికా మిలియన్ డాలర్ల వ్యాపారం మాత్రమే ఉన్నది, 2026 నాటికి అది 1.6 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందంటున్నది.

దేశ వ్యాపార, మార్కెట్ పరిస్థితి చూస్తే.. దేశీయ రిటైల్ మార్కెట్ సంఘటిత రిటైల్‌మార్కెట్, అసంఘటిత రిటైల్ మార్కెట్‌గా విడిపోయి ఉన్నది. దేశంలో సంఘటిత రిటైల్ మార్కెట్ 9 శాతమే ఉండి 60 బిలియన్ డాలర్ల వ్యాపారం మాత్రమే చేస్తున్నది. అదే అసంఘటిత రిటైల్ మార్కెట్ 91 శాతం ఆక్రమించి ఉన్నది. ఈ నేపథ్యంలో జీఎస్టీతో నే అసంఘటిత చిన్న, మధ్య తరహా వ్యాపారవర్గం ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో 100 శాతం ఎఫ్‌డీఐలు సింగిల్ బ్రాండ్ రిటేల్ రంగంలోకి వస్తే ఈ వర్గాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుం ది. గతంలో స్థానిక చిన్న వ్యాపారాల్లోకి 30 శాతం స్థానిక వర్గాల పెట్టుబడులకే చోటుండాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో వంద శాతం విదేశీ పెట్టుబడులు వస్తే స్థానిక చిన్న వ్యాపారస్తులు విదేశీ వ్యాపార వర్గాలతో పోటీపడలేక చతికిలపడే పరిస్థితి దాపురిస్తున్నది. స్థానిక చిన్న వ్యాపారాల్లోకి విదేశీ పెట్టుబడులు, సరకులు ప్రవేశిస్తే స్థానిక వర్గాలు పోటీ తట్టుకోలేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. చిన్నచిన్న వ్యాపారాలతో జీవనోపాధిగా ఉన్న వర్గాలు, ముఖ్యంగా మహిళలు తమ జీవనోపాధిని కోల్పోవాల్సి వస్తుంది. కాబట్టి ఇప్పటికే పెద్ద నోట్లరద్దు, జీఎస్టీతో చిన్న, మధ్య తరహా వ్యాపారవర్గాలు అనేక ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ఇప్పుడు వందశాతం ఎఫ్‌డీఐలకు అవకాశం ఇవ్వ టం ఆ వర్గాలకు పెద్ద ఉప ద్రవమే.

సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో అసంఘటిత వ్యాపార వర్గమంతా ఆహారపదార్థాల తయారీ, అమ్మకంలో ఉన్నది. తోపుడుబండ్లు, ఇతర చిన్నచిన్న వాహనాలపై తిను బండారాలను తయారుచేసి అమ్ముకోవటం లాంటి నగర జీవితంలో ఎక్కువగా ఉంటున్నది. అలాగే చిన్నచిన్న కిరాణా దుకాణాలు కూడా వీటిలో భాగంగానే చెప్పుకోవచ్చు. ఈ క్రమంలో చిన్నచిన్న నిత్యావసర వస్తువుల తయారీ, అమ్ముకొని జీవనోపాధిని పొందే వ్యక్తుల సమూహం పెద్ద సంఖ్యలో ఉంటుంది. ఈ క్రమంలోనే చూస్తే ప్రపంచంలోనే అతి ఎక్కువ సంఖ్యలో చిన్న తరహా జీవనోపాధి రిటైల్ రంగంలో 15 మిలియన్ల షాపులున్నాయి. చిన్నతరహా ఆహారపదార్థాల తయారీ పంపిణీ చేస్తూ జీవనోపాధి పొందే వర్గం కూడా గణనీ య సంఖ్యలో ఉన్నది. దీంతో లక్షలాదిమంది జీవనోపాధి పొందుతున్నా రు. కానీ ప్రస్తుత వందశాతం ఎఫ్‌డీఐలకు అనుమతి విధానంతో ఈ వర్గా లు తీవ్రంగా ప్రభావితమయ్యే పరిస్థితులున్నాయి. దీనికి రోజురోజుకూ మారుతున్న నగరజీవిత ఆహారపు అలవాట్లు కూడా దీనికి తోడవుతున్నాయి. ఇలాంటి సామాజిక, జీవన పరిస్థితులున్న నేపథ్యంలో ప్రభుత్వాలు ఒక విధానపరమైన నిర్ణయం చేసేటప్పుడు ప్రజాజీవనంపై ఎలాంటి ప్రభావం పడనున్నదో చూడాల్సిన అవసరం ఉన్నది. కానీ మన పాలకులు దీన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు కనపించటం లేదు.

ప్రస్తుత వంద శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి విధానం కారణంగా పట్టణ, గ్రామీణ చిన్నతరహా వ్యాపార రంగమే తీవ్రంగా ప్రభావితం కాబోతున్నది. ఈ క్రమలో అనేక సామాజిక మార్పులకు, ఆహారపు అలవాట్లలో మార్పునకు హేతువుగా మారబోతున్నది.

నిజానికి ఎఫ్‌డీఐల అనుమతి విషయంలో అనేకం ముడిపడి ఉన్నాయి. ఎఫ్‌డీఐలు దేశంపై ఎలాంటి ప్రభావం చుపుతాయో, దీర్ఘకాలికంగా వాటితో ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో ఆలోచించాలి. కానీ ఇదే మీ ప్రభుత్వం పట్టించుకున్నట్లు లేదు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న చిన్న వ్యాపారవర్గాలు, జీవనోపాధిగా ఎంచుకొని రిటైల్ రంగంలో ఉన్న కుటుంబాలు, గ్రామీణ పేద రైతులు వందశాతం సబ్సిడీలతో తీవ్రంగా ప్రభావితులవుతారు. ఇది నిజానికి గ్రామీణ, పట్టణ ప్రజాజీవనానికి తీవ్ర ప్రమాదం. కాబట్టి ఎవరూ ఎఫ్‌డీఐలు, చిన్న తరహా వ్యాపా ర వర్గాలతో సంబంధంలేనిదని ఎవరూ అనలేరు.

ఆహార అలవాట్లనే తీసుకుంటే ఇది సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవనంతో ముడిపడి ఉంటుంది. ఆహారపదార్థాల తయారీ, ప్రజలకు అందుబాటులో ఉంచటం మధ్యలో అనేక తంతెలున్నాయి. దీంట్లో ప్రధానంగా ఉత్పత్తిని చెప్పుకోవచ్చు. దీనికి కావలసిన మౌలిక వసతులు, వనరుల, భూమి, నీరు లాంటివి ప్రధానమైనవి. వీటితో ఆహార పదార్థాలు తయారై ప్రజలకు అందుబాటులోకి రావటమనేది ఉన్నది. ఆ తర్వాత తయారైన ఆహార పదార్థాలను రవాణా చేయటం, అమ్మకం చేయటం ఉంటుంది. అలాగే పంపకం, వినియోగం లాంటి ప్రధాన అంచెల్లో అనేక శ్రమలు, అవరోధాలు ఇమిడి ఉన్నాయి.

అయితే ప్రస్తుత వంద శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి విధానం కారణంగా పట్టణ, గ్రామీణ చిన్నతరహా వ్యాపార రంగమే తీవ్రంగా ప్రభావితం కాబోతున్నది. ఈ క్రమలో అనేక సామాజిక మార్పులకు, ఆహారపు అలవాట్లలో మార్పునకు హేతువుగా మారబోతున్నది. ఈ నేపథ్యంలోనే సంప్రదాయ ఆహార పదార్థాల స్థానంలో జంక్‌ఫుడ్స్, చిన్న బడ్డీకొట్టు స్థానంలో ల్యాండ్‌స్కేప్‌లు, ఫుడ్ కోర్టులు, మాల్‌లు వచ్చి సంప్రదాయ ఆహారపదార్థాల తయారీదారులను మార్కెట్ నుంచి తరిమేస్తున్నాయి, లేదా మింగేస్తున్నాయి. అయితే ఇప్పటికే పెద్దపెద్ద బహుళజాతి కంపెనీలు ఆహార రంగంలోకి, రిటైల్ రంగంలోకి వచ్చి తమదైన ఆధిపత్యంతో దూసుకుపోతున్నాయి. ప్రజల జీవన, ఆహార అలవాట్లను నిర్దేశిస్తున్నా యి. ఈ పరిస్థితుల్లో ఈ వందశాతం ఎఫ్‌డీఐలు కూడా ప్రజా జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేయటమే కాదు, అల్లకల్లోలం చేయనున్నాయి. దీన్నుంచి ప్రజలు, రైతుల ప్రయోజనాలను పరిరక్షించుకోవాల్సిన అవస రం ఎంతైనా ఉన్నది.

(వ్యాసకర్త: వేములవాడ శాసనసభ్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కాలువలో పడిన బస్సు.. 36 మంది మృతి

- ❑ పశ్చిమబెంగాల్‌లో దుర్ఘటన
- ❑ పొగమంచు, ఎదురుగా లారీ రావడంతో ప్రమాదం
- ❑ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం

కోల్‌కతా, జనవరి 29: పశ్చిమబెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న పశ్చిమబెంగాల్ రాష్ట్ర రోడ్డు రవాణా బస్సు కాలువలో పడిపోవడంతో 36 మంది మృతిచెందారు. మృతుల్లో 10 మంది మహిళలు ఉన్నారు. పలువురు గల్లంతయ్యారు. ఈ సంఘటన ముర్షిదాబాద్ జిల్లాలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రయాణికులతో శికర్‌పూర్ నుంచి మాల్దాకు బస్సు బయలుదేరింది. అయితే బస్సు గోగ్రా కాలువ వంతెనపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు ఉండటం, ఎదురుగా వస్తున్న లారీని తప్పించడానికి ప్రయత్నించే క్రమంలో బస్సు అదుపుతప్పింది. దీంతో బస్సు వంతెనపైనుంచి కాలువలో పడిపోవడంతో 36 మంది మృతిచెందారు. ప్రత్యక్షసాక్షులు మాట్లాడుతూ డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సును నడిపాడని చెప్పారు. సెల్‌ఫోన్ మాట్లాడవద్దంటూ పలుసార్లు సూచించినా పట్టించుకోలేదని తెలిపారు. ఎదురుగా ఒక్కసారిగా లారీ రావడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడని, దానిని తప్పించే క్రమంలో బస్సు కాలువలో పడిపోయిందని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన 40 నిమిషాల తర్వాత పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారని, దీనిని నిరసిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారని తెలిపారు. ఆందోళనకారులు పోలీసుల వాహనానికి నిప్పుపెట్టారని, వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జి చేశారని వివరించారు. పోలీసులు మాట్లాడుతూ 34 మృతదేహాలను బస్సు నుంచి వెలికితీశామని, దవాఖానలో చికిత్సపొందుతూ ఇద్దరు మరణించారని చెప్పారు. స్థానికులు ఐదుగురు ప్రయాణికులను కాపాడారని, మిగతా వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. సహాయక చర్యల్లో జాతీయ విపత్తు దళం కూడా పాల్గొన్నదని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో బస్సులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారన్న విషయం ఇంకా స్పష్టంగా తెలియదని వివరించారు. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడ్డవారికి రూ.లక్ష, సాధారణ గాయాలైన వారికి రూ.50వేల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.



కాలువలో పడిన బస్సును క్రేన్ సాయంతో వెలికి తీస్తున్న సహాయక సిబ్బంది

బెంగళూరులో 'గౌరి డే'

గౌరీలంకేశ్‌కు సినీ ప్రముఖులు, సామాజిక కార్యకర్తల నివాళి



రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న జిగ్నేశ్ మేవాని, కన్హయ్యకుమార్, ఉమర్ ఖాలిద్ తదితరులు

బెంగళూరు: గతేడాది సెప్టెంబర్ ఐదో తేదీ హత్యకు గురైన జర్నలిస్టు గౌరీ లంకేశ్ 56వ జయంతిని సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు 'గౌరి డే' నిర్వహించారు. సోమవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ 'గౌరి వాణి మూగబోలేదు. మరింత గట్టిగా వినిపిస్తుంది' అని చెప్పారు. 'గౌరి మనలోనే ఉన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన వారు మరణిస్తే వారి వాణి మూగబోదు. చెట్ల మాదిరిగా విస్తరిస్తుంది' అని అన్నారు. ఫాసిస్టు శక్తులు ఎంతోకాలం మనుగడ సాగించలేవన్నారు. ఆయనతోపాటు గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ, జేఎన్‌యూ విద్యార్థి నేత కన్హయ్య కుమార్, షెహ్లా రషీద్, ఉమర్ ఖాలిద్, సామాజిక కార్యకర్తలు ఇరోమ్ షర్మిల, కవితా కృష్ణన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గో రక్షణ పేరుతో జరిగే దాడులపై మూడు రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: గో రక్షణ పేరుతో జరుగుతున్న దాడులను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై రాజస్థాన్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలకు సోమవారం నోటీసులు జారీచేసింది. గోరక్షణ పేరుతో దాడులు చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గత ఏడాది జారీచేసిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదో ఏప్రిల్ 3 లోగా సమాధానం ఇవ్వాలని చీఫ్ జస్టిస్ దీపక్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. దాడులపై రాష్ట్రాలు తీసుకున్న చర్యలు, ప్రస్తుత పరిస్థితిని తెలుపుతూ నివేదిక అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను కోరింది. గతేడాది సెప్టెంబర్ 6న జారీచేసిన ఆదేశాలను పాటించడం లేదన్న తుషార్‌గాంధీ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం పై విధంగా వ్యాఖ్యానించింది.

నిత్యానందకు హైకోర్టు హెచ్చరిక



చెన్నై: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు నిత్యానందకు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. అడ్డగోలుగా మాట్లాడుతూ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. నిత్యానందపై అరెస్టు వారెంట్ జారీచేస్తామని జస్టిస్ ఆర్ మహదేవన్ హెచ్చరించారు. నిత్యానంద బారి నుంచి మధురై మఠాన్ని రక్షించాలని, ఆయనపై చర్యలు తీసుకొనేలా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలని జలతాలప్రధానపన్ అనేవ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం వాదనలు జరిగాయి. సెల్‌ఫోన్ ద్వారా వాదనల సమాచారం తెలియజేస్తున్న నిత్యానంద అనుచరుడ్ని అరెస్ట్ చేయాలని ఆదేశించారు. నిత్యానంద ఆశ్రమంపై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయని తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేశారు.


కాస్‌గంజ్ ఘటన సిగ్గుచేటు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి మాయని మచ్చ: గవర్నర్
ఎస్పీని బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



లక్నో: యూపీ ప్రభుత్వ పనితీరును గవర్నర్ రాంనాయక్ తీవ్రంగా తప్పుబట్టారు. కాస్‌గంజ్ మత ఘర్షణలు రాష్ట్రానికి మాయని మచ్చ అని.. ఇటువంటి ఘటనలు జరుగడం సిగ్గుచేటన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గత పది నెలల్లో ఇలాంటి ఘర్షణలు జరుగడం ఇదే ప్రథమమన్నారు. కాస్‌గంజ్ ఎస్పీ సునీల్‌కుమార్ సింగ్‌ను యూపీ ప్రభుత్వం ఓ అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేసింది. నూతన ఎస్పీగా పీయూష్ శ్రీవాస్తవను నియమించింది. మృతి చెందిన చందన్ గుప్తా కుటుంబానికి అధికారులు రూ.20 లక్షల పరిహారం అందజేశారు.

విదేశాంగ శాఖ కార్యదర్శిగా విజయ్ బాధ్యతలు స్వీకరణ



న్యూఢిల్లీ: విదేశాంగ శాఖ కార్యదర్శిగా సీనియర్ దౌత్యాధికారి విజయ్ కేశవ్ గోఖలే సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఏ జయశంకర్ కొనసాగారు. 1981బ్యాచ్‌కు చెందిన విజయ్ నూతన బాధ్యతలు చేపట్టకముందు విదేశంగ శాఖ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా పనిచేశారు. ఆయనపై చైనా దూకుడుకు అడ్డుకట్టవేయడంతోపాటు పొరుగు దేశాలైన నేపాల్, మాల్దీవులు, శ్రీలంక, మయన్మార్‌లతో భారత్ సంబంధాలను మరింత పటిష్ఠపర్చాల్సిన బాధ్యతలు ఉన్నాయి.

పశ్చిమబెంగాల్, రాజస్థాన్‌లో ఉప ఎన్నికలు ప్రశాంతం


కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని ఉలూబేరియా లోక్‌సభ, నౌపారా అసెంబ్లీ స్థానం, రాజస్థాన్‌లోని ఆల్వార్, అజ్మీర్ లోక్‌సభస్థానాలు, మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానానికి సోమవారం ఉప ఎన్నికలు జరిగాయి. ఉలూబేరియాలో 76%, నౌపారాలో 75.3%, అజ్మీర్‌లో 65.33%, ఆల్వార్‌లో 62%, మండల్‌గఢ్‌లో 45.08% పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, ఓట్ల లెక్కింపు వచ్చేనెల 1న చేపడుతామని ఎన్నికల అధికారులు చెప్పారు.

పోలీసు దుస్తుల్లో వచ్చి యువతి కిడ్నాప్

భోపాల్: సినీఫక్కీలో దుండగులు ఓ యువతిని కిడ్నాప్ చేసిన ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. ఖాకీ దుస్తుల్లో, పోలీస్‌వాహనంలో వచ్చిన ఐదుగురు దుండగులు యువతి(18)ని కిడ్నాప్ చేశారు. బామూరాహ్‌లో శనివారం రాత్రి ఓ వ్యక్తి నుంచి 100 నంబర్‌కు వచ్చిన ఫోన్ కాల్‌తో ఓ ఏఎస్సై, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి చేరుకున్నారు. వారిని ఐదుగురు దుండగులు బెదిరించి వారి దుస్తులను, వాహనాన్ని తీసుకెళ్లారు. బామురాహ్‌లోని ఓ యువతి ఇంటికెళ్లి ఆమన్‌గంజ్‌స్టేషన్‌లో ఓ కేసు విచారణకు రావాలని యువతి కుటుంబసభ్యులను బెదిరించారు. ఆ కుటుంబం తాము ఎవరికీ ఫిర్యాదు చేయలేదని చెప్పినా వినకుండా దుండగులు యువతిని.. ఆమె తండ్రిని, సోదరుడిని తీసుకెళ్లారు. కొంత దూరం వెళ్లాక యువతి తండ్రిని, సోదరుడిని పోలీస్ వాహనాన్ని వదిలి మరో వాహనంలో యువతిని తీసుకెళ్లారు.

చిన్న అవాంతరాలు తప్ప అచ్ఛేదిన్ సూపర్

ఆర్థిక సర్వేపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ ఎద్దేవా



న్యూఢిల్లీ: చిన్న చిన్న అవాంతరాలు తప్ప 'అచ్చేదిన్ (మంచిరోజులు)' బాగున్నాయని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఆర్థిక సర్వేపై రాహుల్ గాంధీ స్పందిస్తూ 'చిన్న అవాంతరాలు తప్ప అచ్చేదిన్ బాగున్నాయి. ఆ అవాంతరాలేమిటంటే పారిశ్రామిక వృద్ధిరేటు పతనం. వ్యవసాయ వృద్ధిరేటు పతనం. జీడీపీ వృద్ధి పతనం. ఉద్యోగిత వృద్ధి పతనం. ఆందోళనొద్దు. సంతోషంగా ఉండండి!' అని ట్వీట్ చేశారు. 'డోంట్ వర్రీ బీ హ్యాపీ' అనే వీడియోను ట్యాగ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పీ చిదంబరం మాట్లాడుతూ ఆర్థిక సర్వే నివేదిక నిరుత్సాహ పరిచిందన్నారు. 2017 – 18లో జీడీపీ వృద్ధిరేటు 6 –6.5 శాతం ఊహించిందేనన్నారు.

మహిళలు, రైతులపైనే ప్రధాన దృష్టి

బడ్జెట్ కీలకాంశాలపై సంకేతాలిచ్చిన రాష్ట్రపతి ప్రసంగం
తలాక్ బిల్లు ఆమోదానికి సహకరించండి: విపక్షాలను కోరిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జనవరి 29:

ఈసారి బడ్జెట్‌లో మహిళలు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయవచ్చన్న ప్రచారం సాగుతున్నది. ఫిబ్రవరి 1న కేంద్రం ప్రవేశ పెట్టనున్న సాధారణ బడ్జెట్–2018పై సర్వత్రా ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో సోమవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగం పలు అంశాలను స్పృశిస్తూ సాగింది. సామాజిక రంగంపైనే ప్రధానంగా సాగిన ప్రారంభోపన్యాసంలో మైనార్టీలను, పేదలను బుజ్జగించడం కోసం కాకుండా, వారి సాధికారత కోసం ప్రభుత్వం శ్రమిస్తున్నదని కోవింద్ పేర్కొన్నారు. మహిళలు, రైతుల అభ్యున్నతి విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్న సంకేతాలను రాష్ట్రపతి తన ప్రసంగం ద్వారా ఇచ్చారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న ఎన్డీయే ప్రభుత్వ చివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడంతో దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మరోవైపు స్వచ్ఛభారత్‌ను ప్రవేశపెట్టి మూడేండ్లు పూర్తయినందున, మరుగుదొడ్ల నిర్మాణంపై కేంద్రం ఎక్కువ దృష్టిపెట్టే అవకాశముందని తెలుస్తున్నది. సోమవారం కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ పారిశుద్ధ్య కార్యక్రమం ఐదేండ్ల నివేదికను ట్విట్టర్‌లో విడుదల చేసింది. అలాగే ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన ద్వారా మహిళల వంటకష్టాలు తీరుస్తున్నదని, ఇప్పటివరకు ఈ స్కీం కింద 3.3కోట్ల ఉచిత ఎల్పీజీ కనెక్షన్లను పేదలకు అందించిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. అలాగే రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. దీన్నిబట్టి రైతులకు సబ్సిడీ, ఇతరత్ర ప్రయోజనాలను అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ద్వారా అందించే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ట్రిపుల్ తలాక్ సహా 11 కీలక బిల్లుల ఎదురుచూపు

పార్లమెంట్ ఆమోదం కోసం ట్రిపుల్ తలాక్, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) (రాష్ట్రాలకు నష్ట పరిహారం) సవరణ బిల్లు 2017తోపాటు మొత్తం 11 కీలక బిల్లులు ఎదురుచూస్తున్నాయి. ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంట్ ఆమోదించగలదని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ ముస్లిం మహిళలు స్వేచ్ఛగా, గౌరవంతో జీవనం సాగించేందుకు వీలు కల్పించే ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంట్ త్వరలో ఆమోదించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంట్ బయట ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడుతూ ముస్లిం మహిళలు గౌరవంగా, స్వేచ్ఛా జీవనం సాగించే అంశానికి సంబంధించిన ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించే విషయంలో రాజకీయాలకు తావివ్వవద్దన్నారు. బిల్లు ఆమోదానికి సహకరించాలని విపక్షాలకు సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టాన్ని ముస్లిం మహిళలకు నూతన సంవత్సర బహుమతిగా అందజేస్తామని కోరారు. ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకిస్తూ 'ముస్లిం మహిళల (వివాహ రక్షణ హక్కుల పరిరక్షణ) బిల్లు, 2017'ను గత నెల 28న లోక్‌సభ ఆమోదించింది. కానీ దీనిపై రాజ్యసభలో తీవ్ర ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని రాజ్యసభలో విపక్షాలు పట్టుబట్టడంతో ప్రతిష్ఠంభన ఏర్పడింది. జీఎస్టీ అమలులోకి రావడంతో రాష్ట్రాలకు వాటిల్లే రెవెన్యూ నష్టాన్ని పూడ్చేందుకు ప్రతిపాదించిన జీఎస్టీ కాంపన్సేషన్ సెస్‌ను 15 నుంచి 20 శాతానికి పెంచుతూ ప్రతిపాదించిన జీఎస్టీ (రాష్ట్రాలకు నష్ట పరిహారం) సవరణ బిల్లు – 2017కు గత నెల 22న లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదించిన మోటారు వాహనాల (సవరణ) బిల్లు – 2017, వినియోగదారుల పరిరక్షణ బిల్లు.. రాజ్యసభ ఆమోదం కోసం వేచి చూస్తున్నాయి. ఇక ఎన్నారైలకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రతిపాదించిన 'ప్రజాప్రాతినిధ్య (సవరణ) బిల్లు – 2017, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (సవరణ) బిల్లు – 2017, న్యూఢిల్లీ అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం బిల్లు – 2018, గ్రాట్యుటీ చెల్లింపు (సవరణ) బిల్లు – 2017, రాజ్యాంగ (123వ సవరణ) బిల్లు – 2017, నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ సవరణ బిల్లు – 2017, మహిళలకు రుతుస్రావం సమయంలో పని ప్రదేశాల్లో మెరుగైన వసతుల కల్పనకు అరుణాచల్ ప్రదేశ్ సభ్యుడు ప్రతిపాదించిన 'రుతుస్రావ ప్రయోజన బిల్లు – 2017', వేజ్ కోడ్ బిల్లు తదితరాలు పార్లమెంట్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను పార్లమెంట్‌కు తోడ్కొని వస్తున్న రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అనంత్‌కుమార్

నలుగురు నూతన రాజ్యసభ సభ్యుల ప్రమాణం

❑ ఉత్తమ పార్లమెంటేరియన్లుగా ఆజాద్, దినేశ్ త్రివేది, మహతాబ్

రాజ్యసభకు ఎన్నికైన నలుగురు సభ్యులు ప్రమాణం చేశారు. సోమవారం పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించిన తర్వాత సమావేశమైన రాజ్యసభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017 – 18 సంవత్సరానికి ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. అటుపై రాజ్యసభ సెక్రటరీ జనరల్ దేశ్ దీపక్ వర్మ.. రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన కేంద్ర మంత్రి హర్దీప్ పూరీ, ముగ్గురు ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) సభ్యుల పత్రాలు సమర్పించారు. వారితో రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడు ప్రమాణం చేయించారు. ఇటీవలి కాలంలో మరణించిన మాజీ ఎంపీలు మోహిందర్ సింగ్ కల్యాణ్, ఖాగెన్ దాస్‌కు సంతాపం తెలుపుతూ తీర్మానాలను వెంకయ్య నాయుడు ప్రవేశపెట్టారు. సోమవారం ఉదయం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాకముందే రాజ్యసభకు వచ్చిన ప్రధాని మోదీ.. వివిధ పక్షాల నేతలతో కరచాలనం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తదితరులతో కరచాలనం చేశారు. అధికార పక్ష సభ్యులకు ముకుళిత హస్తాలతో నమస్కరించారు. వివిధ కీలక పత్రాలను సభలో ప్రవేశపెట్టిన తర్వాత రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడు సభను గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు వాయిదా వేశారు. ఇదిలా ఉంటే 2015 సంవత్సరానికి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్, 2016లో తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు దినేశ్ త్రివేది, 2017 సంవత్సరానికి బీజేడీ లోక్‌సభ సభ్యుడు భర్తృహరి మహతాబ్‌ను ఎంపిక చేసినట్లు ఇండియన్ పార్లమెంటరీ గ్రూప్ (ఐపీజీ) సోమవారం తెలిపింది.

'జమిలి' ఎన్నికలకు అనుకూల వాతావరణం ఏర్పరచండి

❑ ఎన్డీయే పక్షాలను కోరిన ప్రధాని నరేంద్రమోదీ



లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో జమిలి ఎన్నికల నిర్వహణకు అనుకూల వాతావరణం సృష్టించేలా పని చేయాలని ఎన్డీయే పక్షాలను ప్రధాని నరేంద్రమోదీ కోరారు. సోమవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం ఏకాభిప్రాయం తేవడానికి సుస్థిర చర్చ జరుగాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలకు ప్రాధన్యం ఏర్పడింది. ఎన్డీయే పక్షాల సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ నిరంతరాయంగా ఎన్నికల నిర్వహణతో ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడటంతోపాటు ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతుందని చెప్పారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగం, 69వ గణతంత్ర దినోత్సవానికి 10 ఆసియాన్ దేశాధినేతలు ముఖ్య అతిథులుగా హాజరు కావడాన్ని అభినందిస్తూ ఎన్డీయే సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అంతకుముందు బీజేపీ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి హాజరైన ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్, ఓబీసీ తదితర కీలక బిల్లులు ఆమోదం పొందాల్సిన అవసరం ఉన్నందున సభ్యులంతా సభకు హాజరు కావాల్సిన అవసరం ఉన్నదని అమిత్ షా నొక్కి చెప్పారు.

మొదటిపేజీ తరువాయి...

జమిలి ఎన్నికలే మేలు

బయటపెట్టిన మోదీ సోమవారం జరిగిన ఎన్డీయే పక్షాల సమావేశంలోనూ జమిలి ఎన్నికల ప్రస్తావన తెచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు అనువైన వాతావరణాన్ని తీసుకురావాలని ప్రధాని మిత్రపక్షాలను కోరినట్లు ఎన్డీయే వర్గాలు పేర్కొన్నాయి. ఎన్నికల ప్రధానాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఓపీ రావత్ జమిలి ఎన్నికల అంశంపై స్పందిస్తూ.. 'ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు న్యాయపరమైన ప్రక్రియను పూర్తిచేసుకోవాల్సి ఉంటుంది. అందుకు చాలా సమయం పడుతుంది' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి తాజాగా తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పదే పదే ఎన్నికలు నిర్వహించడం వల్ల దేశాభివృద్ధికి విఘాతం కలుగుతున్నదనే అభిప్రాయాన్ని కోవింద్ వ్యక్తంచేశారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాల్సిన అవసముందని, దీనిపై చర్చ జరుగాలని ఆయన అన్నారు.

బుజ్జగింపు కాదు.. సాధికారతే సర్కార్ మంత్రం

మైనార్టీలు, పేదలు, బలహీనవర్గాలను బుజ్జగించేందుకు ప్రభుత్వం పనిచేయడం లేదని, వారి సాధికారతే సర్కార్ మంత్రమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చెప్పారు. 'ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరపడలేదని అంబేద్కర్ చెప్పేవారు. నవభారత కలల్ని సాకారం చేసుకునేందుకు ఇది కీలకమైన సంవత్సరం. యువత కోసం స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రైతుల సంక్షేమం కోసం, బలహీనవర్గాల అభ్యున్నతికోసం ఈ ప్రభుత్వం శ్రమిస్తున్నది. ప్రతీ ఒక్కరికి అభివృద్ధిని చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం' అని అన్నారు. దేశంలో అవినీతిని నిర్మూలించేందుకు కేంద్రప్రభుత్వం పోరాటం చేస్తున్నదని, గడిచిన ఏడాదికాలంలో 3.5లక్షలకు పైగా డొల్ల కంపెనీల రిజిస్ట్రేషన్లను రద్దు చేసిందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆధార్ గురించి కూడా రాష్ట్రపతి ప్రస్తావించారు. ఆధార్ వల్ల రూ.57వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఆపగలిగినట్లు చెప్పారు. సులభవాణిజ్య విధానంలో భారత్ తన ర్యాంకును మెరుగుపరచుకుని 100వ స్థానంలో నిలిచిందన్నారు. 2019లో గాంధీ 150వ జయంతి ఉత్సవాలను జరుపుకోబోతున్నామని చెప్పిన రామ్‌నాథ్.. స్వచ్ఛభారత్‌గా దేశాన్ని తీర్చిదిద్దడం ద్వారా గాంధీజీకి ఘన నివాళులర్పించాలని సూచించారు. దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరజవాన్ల త్యాగాలను రాష్ట్రపతి కొనియాడారు. కశ్మీర్ ఉగ్రవాద చర్యలకు సైన్యం దీటుగా జవాబిస్తున్నదని పేర్కొన్నారు. హింసామార్గాన్ని వీడితే.. ఎవరితోనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తమ ప్రభుత్వ చర్యలతో అంతర్జాతీయంగా భారత ఖ్యాతి ఇనుమడిస్తుందని కోవింద్ చెప్పారు. ఐసీజేలో ప్రాతినిధ్యం, ఆస్ట్రేలియా అణ్వస్త్ర గ్రూపులో సభ్యత్వం వంటివాటిని, ఇస్రో విజయాలను ప్రస్తావించారు.

ట్రిపుల్ తలాక్ చట్టంగా మారుతుందని ఆశిస్తున్నా..

ముస్లిం మహిళల కోసం తీసుకొచ్చిన ట్రిపుల్ తలాక్ బిల్లు గురించి కూడా కోవింద్ మాట్లాడారు. తరతరాలనాటి ఆవేదన నుంచి ముస్లిం మహిళల విముక్తి కోసం ప్రభుత్వం బిల్లును తీసుకువచ్చిందన్నారు. బిల్లుపై ముస్లిం మహిళలు హర్షం వ్యక్తంచేస్తున్నారని చెప్పారు.త్వరలోనే ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ బిల్లుకు సహకరిస్తే నాయకులను ముస్లిం మహిళలు సన్మానిస్తారని చెప్పారు. వారి హక్కుల పరిరక్షణకు కేంద్రం కృషి చేస్తున్నదని రాష్ట్రపతి అన్నారు. సంరక్షకుడి (మహ్రమ్) అవసరం లేకుండా 45 ఏండ్ల పైబడిన మహిళలు హజ్ యాత్రకు వెళ్లగలిగేలా సంస్కరణలు చేపట్టిందని, ఫలితంగా 1300మంది ఈ ఏడాది మహ్రమ్ లేకుండానే హజ్‌కు వెళ్లగలుగుతారని చెప్పారు. ఆడపిల్లలపై వివక్షను రూపుమాపేందుకు ప్రభుత్వం 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమాన్ని చేపట్టిందని, 161 జిల్లాల నుంచి 640 జిల్లాలకు పథకం విస్తరించిందని ఆయన వివరించారు. ప్రధానమంత్రి ఉజ్వల్‌యోజనతో మహిళల కష్టాలు తొలిగిపోయాయని, ఈ పథకం మహిళల్లో సామాజిక, ఆర్థిక సమానత్వం తీసుకొచ్చిందన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రసవసమయంలో 26వారాల సెలవు బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిందని ఆయన గుర్తుచేశారు.

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కృషి



రామగుండం సహా దేశంలోని పలు ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్రపతి తెలిపారు. రామగుండం, గోరఖ్‌పూర్, బరౌని, సింద్రి, తలచేరి ఎరువుల ఫ్యాక్టరీలు త్వరలోనే పునఃప్రారంభమవుతాయని చెప్పారు. రైతుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఎరువుల ఉత్పత్తిని పెంచేదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. 100శాతం వేపపూతతో కూడిన ఎరువుల తయారీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు కోవింద్ వెల్లడించారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రపతి పునరుద్ఘాటించారు. వ్యవసాయంలో ఖర్చును తగ్గించి, దిగుబడి పెంచడం ద్వారా అది సాధ్యమవుతుందని అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. వ్యవసాయ మార్కెట్లను ఆన్‌లైన్‌తో అనుసంధానించడం ద్వారా అన్నదాతలకు సరైన ధర దక్కేందుకు వీలైందన్నారు. కూలీల కనీస వేతనాన్ని తమ ప్రభుత్వం 40శాతం పెంచిందని కోవింద్ పేర్కొన్నారు.

తీవ్రనిరుత్సాహపూరితం: కాంగ్రెస్

పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగం తీవ్రంగా నిరుత్సాహ పరిచిందని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఆనంద్ శర్మ వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగం క్షేత్రస్థాయి పరిస్థితులకు విరుద్ధంగా ఉన్నదన్నారు. ప్రభుత్వ హామీలకు ద్రోహం, వైఫల్యాలపై రాష్ట్రపతి ప్రసంగంలో ఊసే లేదన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి కృషి చేయాలన్న రాష్ట్రపతి రామ్‌నాథ్, ప్రధాని మోదీ అభ్యర్థనలకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమేనన్నారు. ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్తపై చట్టపరంగా చర్యలు తీసుకుంటే.. అతడి భార్యకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం నిబంధన చేర్చాలని డిమాండ్ చేశారు.

ఎఫ్‌డీఐలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం

ప్రతిపక్షాల నిర్ణయం

న్యూఢిల్లీ: పలు రంగాల్లో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)ను నిరసిస్తూ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షపార్టీలు నిర్ణయించాయి. పలు ప్రతిపక్షపార్టీల నేతలు సోమవారం ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా అధికార బీజేపీని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు ఏకంకావాలని, 2019లో జరిగే సాధారణ ఎన్నికల్లో ఐక్యత పాటించాలన్న లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తున్నది. అంతేగాక పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా చర్చినట్లు సమాచారం. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గులాం నబీ ఆజాద్, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫారుఖ్ అబ్దుల్లా, సీపీఐ నుంచి డీ రాజా, సీపీఎం నేత టీకే తంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

నాగాలాండ్ ఎన్నికల్లో పోటీ చేయొద్దని 11 పార్టీల నిర్ణయం

కోహిమా: వచ్చే నెల 27న జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నాగాలాండ్‌కు చెందిన 11 రాజకీయ పార్టీలు నిర్ణయించాయి. అందులో అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్, కాంగ్రెస్, బీజేపీ కూడా ఉన్నాయి. సోమవారం నాగాలాండ్ ట్రైబల్ హోస్, సివిల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 11 పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. నాగా శాంతి ఒప్పందాన్ని అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఎన్నికలను బహిష్కరిస్తున్నామని వాళ్లు చెప్పారు.

సీఎం ముఫ్తీ వర్సెస్ బీజేపీ

జమ్ములో రాజకీయ దుమారం రేపిన షోపియాన్ ఘటన
ఆర్మీ మేజర్, సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదుపై బీజేపీ ఆందోళన

శ్రీనగర్, జనవరి 29: జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో శనివారం భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు పౌరులు మరణించడం, దీనికి బాధ్యులుగా ఆర్మీ మేజర్, మరికొందరు సిబ్బందిపై హత్య కేసు నమోదు చేయడం.. రాజకీయ దుమారానికి దారితీసింది. అధికార పీడీపీ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలోని విభేదాలను వెలుగులోకి తెచ్చింది. షోపియాన్ మృతుల అంశం సోమవారం రాష్ట్ర అసెంబ్లీని కుదిపేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్మీ మేజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. ఎఫ్ఐఆర్‌లో మేజర్ పేరు తొలిగించాలని, పేర్లు లేకుండా కేసు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను సంప్రదించిన తర్వాతే తన ప్రభుత్వం ఆర్మీపై చర్యలకు దిగిందని సీఎం మొహబూబా ముఫ్తీ చెప్పారు. ఆర్మీ ఔన్నత్యాన్ని దెబ్బతీసే ఉద్దేశం తమకు లేదని, ఈ వివాదానికి ముగింపు పలుకాలని ఆమె విజ్ఞప్తిచేశారు. షోపియాన్ జిల్లాలోని గనోవ్‌పొర గ్రామంలో శనివారం భద్రతా బలగాల వాహనాలపై కొందరు ఆందోళనకారులు రాళ్లు రువ్వడం, గుంపును చెదురగొట్టే క్రమంలో సైన్యం కాల్పులు జరుపడం వల్ల ఇద్దరు పౌరులు మృతిచెందిన సంగతి తెలిసిందే. 200–250 మంది ఆందోళనకారులు ఆర్మీ కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకొని రాళ్లు రువ్వారని, ఆయుధాలు గుంజుకొనేందుకు ప్రయత్నించారని రక్షణశాఖ ప్రతినిధి కర్నల్ రాజేశ్ కాలియా తెలిపారు. దీంతో భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయని, ఈ క్రమంలో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరుపాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఘనస్వాగతం



విదేశీ పర్యటనను ముగించుకొని సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావుకు ఘనస్వాగతం లభించింది. గ్రేటర్ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్సీ, టీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, ప్రకాశ్‌గౌడ్, పార్టీ కార్యకర్తలు శంషాబాద్‌లోని విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు.

- దుండిగల్, నమస్తేతెలంగాణ

ముగ్గురి దారుణ హత్య



జయలక్ష్మి, అపర్ణ, కార్తికేయిని (ఫైల్).. పోలీసుల అదుపులో ఉన్న అపర్ణ భర్త మధు

- అత్త, భార్య, కూతురును చంపిన ఉన్మాది
- హైదరాబాద్ చందానగర్‌లో దారుణం
- కుటుంబ కలహాలే కారణం
- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు?

హైదరాబాద్ సిటీబ్యూరో/చందానగర్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు హత్యకు గురయ్యారు. కుటుంబ కలహాల కారణంగా ఈ హత్య జరిగినట్టు తెలుస్తున్నది. ఈ కేసులో ప్రధాన నిందితుడు పోలీసు ఎదుట లొంగిపోయినట్టు సమాచారం. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఉల్లంపర్రుకు చెందిన రావడ మధు, అదే జిల్లా భీమవరం పట్టణానికి చెందిన గూడురి అపర్ణాదేవి(30) కుటుంబాలు హైదరాబాద్‌లోని చందానగర్‌కు వలస వచ్చాయి. అపర్ణ స్థానిక బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో పనిచేస్తున్నది. ఎనిమిదేండ్ల కిందట వారిద్దరూ ప్రేమ పెండ్లి చేసుకున్నారు. వారికి నాలుగేండ్ల కూతురు కార్తికేయిని(4) ఉన్నది. అయితే మధుకు అంతకు ముందే పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన యామినితో పెండ్లి జరిగింది. రెండో పెండ్లి విషయం తెలియడంతో యామిని పోలీసులను, కోర్టును ఆశ్రయించింది. దీంతో మధు రెండో భార్య అపర్ణను విడిచిపెట్టి యామినితో కలిసి కేపీహెచ్‌బీలో ఉంటున్నాడు. అపర్ణ తన తల్లి జయలక్ష్మి(48), కూతురు కార్తికేయినితో కలిసి చందానగర్ వేముకుంటలో ఉంటున్నది. మధు అప్పుడప్పుడు అపర్ణ ఇంటికి వచ్చేవాడు. రెండుమూడు రోజులుగా తాళం వేసి ఉన్న అపర్ణ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటాన్ని సోమవారం ఉదయం పాలుపోసే వ్యక్తి గమనించి ఇంటి యజమాని నారాయణరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి తలుపులను పగులగొట్టి చూడగా ముగ్గురూ విగతజీవులై కనిపించారు. బెడ్‌రూంలోని మంచంపై జయలక్ష్మి, చిన్నారి కార్తికేయిని మృతదేహాలు, వంటగదిలో అపర్ణ మృతదేహం కనిపించింది.

మూడురోజుల కిందటే హత్యలు

జయలక్ష్మి, కార్తికేయిని మృతదేహాలను పరిశీలించిన పోలీసులు ఊపిరాడకుండా చేసి చంపినట్టు అనుమానిస్తున్నారు. వంటగదిలో అపర్ణ తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో ఉండటం, మృతదేహం పక్కనే చిన్న రుబ్బురోలు ఉండటంతో రాయితో తలపై మోది హత్య చేసినట్టు అనుమానిస్తున్నారు. అపర్ణ చివరగా శనివారం విధులకు హాజరైందని బజాజ్ ఎలక్ట్రానిక్స్ యాజమాన్యం సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు సీసీటీవీ పుటేజీలను పరిశీలించగా ఆమె శనివారం మధ్యాహ్నం 2.48 గంటలకు షోరూం నుంచి బయటికి వెళ్లినట్టు రికార్డైంది. దీనిని బట్టి శనివారం రాత్రి హత్యలు జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మధుకు ఏపీలోని సొంతూరులో విలువైన ఇల్లు, వ్యవసాయ భూమి ఉన్నదని, అపర్ణకు, కూతురు కార్తికేయినికి ఆస్తిలో వాటా పంచివ్వాల్సి వస్తుందనే హత్య చేసినట్టు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ షా నవాజ్ ఖాసీం, మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్, కుకట్‌పల్లి ఏసీపీ భుజంగరావు, చందానగర్, మియాపూర్ ఇన్‌స్పెక్టర్లు తిరుపతిరావు, హరిశ్చంద్రారెడ్డి సందర్శించారు.

ఆస్తిగొడవ.. వివాహేతర సంబంధమే కారణం?

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న అపర్ణ భర్త మధు సోమవారం సాయంత్రం చందానగర్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు తెలిసింది. అపర్ణ డబ్బులు అడుగుతుండటం, ఇటీవల మరో వ్యక్తితో సన్నిహితంగా మెలుగడంతో కోపంతో హత్య చేశానని నిందితుడు ఒప్పుకున్నట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. మొదటి భార్య విషయం తెలిసినప్పటి నుంచి అపర్ణ, మధు మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. నమ్మించి మోసం చేశావని, తనకు, తన కూతురుకు బతుకుదెరువు చూపించాలని అపర్ణ ఇటీవల మధును డిమాండ్ చేస్తున్నది. దీనికి తోడు అపర్ణ తనను పెండ్లికి ముందు ప్రేమించిన బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ప్రాంతానికి చెందిన రూప్‌లాల్ అనే వ్యక్తితో కొంతకాలంగా సన్నిహితంగా మెలుగుతున్నది. ఈ విషయం మధుకు తెలియడంతో పలుమార్లు భార్యతో వాదనలు జరిగాయి. ఇటీవలే రూప్‌లాల్ తోనూ గొడవ జరిగింది. డబ్బు అడుగుతుండటం, మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండటంతో అపర్ణను హత్య చేయాలని మధు నిర్ణయించుకున్నాడు. శనివారం మధ్యాహ్నం పీకలదాకా మద్యం తాగి వేముకుంటలోని అపర్ణ ఇంటికి వెళ్లాడు. బెడ్‌రూంలో ఉన్న జయలక్ష్మిని, కార్తికేయినిని మెత్తతో ఊపిరి ఆడకుండా చేసి చంపేశాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన అపర్ణ వారిద్దరూ నిద్రపోతున్నారని భావించి అన్నం తినేందుకు వంటింట్లోకి వెళ్లింది. ఆ సమయంలో మధు ఆమెతో ఘర్షణకు దిగాడు. ఆమెను గోడకేసి కొట్టి ఆ తర్వాత చిన్న రుబ్బురోలుతో తలపై మోది హత్యచేశాడు. తర్వాత కేపీహెచ్‌బీకి వెళ్లి మొదటి భార్యకు విషయం వివరించాడు. ఆ తర్వాత చందానగర్‌లోని ఓ లాడ్జీకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేశాడు. అయితే ధైర్యం చాలలేదు. సోమవారం ఈ ఘటన వెలుగులోకి రావడంతో నేరుగా చందానగర్ పీఎస్‌కు వచ్చి లొంగిపోయినట్టు తెలిసింది. మధు మొదటి భార్య యామిని పరారీలో ఉన్నది.



హైటెక్ కిచెన్‌లో అన్నంను కలుపుతున్న మేయర్ బొంతు రామ్మోహన్

'హరేకృష్ణ' సేవలు అభినందనీయం

అక్షయపాత్ర ద్వితీయ వార్షికోత్సవంలో మేయర్ బొంతు రామ్మోహన్

మణికొండ, నమస్తే తెలంగాణ: బంగారు తెలంగాణలో భాగంగా హైదరాబాద్‌ను ఆకలిలేని నగరంగా తీర్చిదిద్దడంలో తన వంతుగా కృషిచేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మేయర్ బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. నగర శివారులోని నార్సింగి కోకాపేటలో ఏర్పాటైన అక్షయపాత్ర (భోజనామృత) హైటెక్ వంటశాల ద్వితీయ వార్షికోత్సవానికి సోమవారం మేయర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హైదరాబాద్ మహానగరంలో బడుగు, బలహీనవర్గాల వారు ఆకలితో అలమటించకూడదన్న మనో సంకల్పానికి దన్నుగా, జీహెచ్‌యంసీ సహకారంతో అన్నపూర్ణ రూ.5 భోజనానికి శ్రీకారం చుట్టారన్నారు. రోజూ 150 ప్రాంతాల్లో 45 వేల మందికి భోజనం సమకూర్చుతూ హరేకృష్ణ మూవ్‌మెంట్ కృషిచేస్తున్నదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని పలుచోట్ల సర్కారు దవాఖానల్లోని రోగి సహాయకులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. హైటెక్ భోజనామృత వంటశాల దేశంలోనే మొదటిదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్, ఎంపీపీ టీ మల్లేశ్ ముదిరాజ్, అరబిందో ఫార్మ కంపెనీ లిమిటెడ్ వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డి, కోకాపేట సర్పంచ్ మంజుల, ఎంపీటీసీలు అరికె అండాలు, క్యాతం అశోక్‌యాదవ్, సాయికుమార్, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, గోసేవ మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.



'బతుకమ్మ' చిత్రాలకు బహుమతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ టుడే ఇంగ్లిష్ దినపత్రిక నిర్వహించిన బతుకమ్మ పండుగ ఫొటో కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. శేరిలింగంపల్లికి చెందిన పీ శ్రావణ్ కుమార్‌కు ప్రథమ బహుమతి కింద రూ.20 వేలను తెలంగాణ పబ్లికేషన్స్ ఎండీ దీవకొండ దామోదర్‌రావు బహూకరించారు. వరంగల్‌కు చెందిన వనం శరత్‌కు నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, కరీంనగర్‌కు చెందిన నాగరాజు గోవిందుకు టీపీపీఎల్ వైస్ ప్రెసిడెంట్ వీఎస్ రామారావు మూడో బహుమతిగా రూ. 10 వేలు అందజేశారు. వీ అవని భరద్వాజ్ (కరీంనగర్), ముత్యాల ప్రభాకర్‌రెడ్డి (రాజన్న సిరిసిల్ల), రాధారపు కుమారస్వామి(కరీంనగర్), వానమామలై శ్రీనివాసాచారి(కరీంనగర్), వంశీకృష్ణ (మణికొండ)కు కన్సోలేషన్ బహుమతి కింద ఒక్కొక్కరికీ రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ టుడే ఎడిటర్ కే శ్రీనివాస్‌రెడ్డి, టెక్నికల్ ఆపరేషన్స్ జీఎం సీహెచ్ శ్రీనివాస్, తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ సెక్రటరీ కొమ్మిడి విశ్వేందర్‌రెడ్డి, నమస్తే తెలంగాణ చీఫ్ ఫొటోగ్రాఫర్ అనుమల్ల గంగాధర్ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నమస్తే తెలంగాణ దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలో గెలుపొందిన రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. బంజారాహిల్స్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, నెట్‌వర్క్ ఇంచార్జి ఎస్‌జీవీ శ్రీనివాస్‌రావు, అడ్వర్టయిజ్‌మెంట్ జీఎం రవీంద్రనాథ్, టెక్నికల్ ఆపరేషన్స్ జీఎం సీహెచ్ శ్రీనివాస్, హైదరాబాద్ ఎడిషన్ ఇంచార్జి చిరంజీవి ప్రసాద్, హెచ్‌ఆర్ మేనేజర్ మధుసూదన్ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి విజేత జోగు దుర్గాభవాని(జగిత్యాల)కి సామ్‌సంగ్ వాషింగ్ మెషీన్, ద్వితీయ బహుమతి విజేత ఏ వినోద(హైదరాబాద్ ఉప్పుగూడ)కు ఏవో స్మిత్ జాగ్వార్ వాటర్ హీటర్, తృతీయ బహుమతుల విజేతలు పెద్ది కుసుమ (జనగామ), జీ సంధ్యారాణి(కామారెడ్డి)కి గంగా మిక్సీలు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

మెట్రో రెండోదశకు డీపీఆర్

- కసరత్తు ప్రారంభించిన అధికారులు
- ఐదు నెలల్లో సిద్ధంచేసేలా ప్రణాళిక
- రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు విస్తరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెట్రోరైలు మొదటి దశ విజయవంతం కావడంతో రెండో దశను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. మెట్రోరైలు నిర్మాణం ప్రారంభమైననాటికే నగర శివారు ప్రాంతాలు అభివృద్ధి చెందినా గత పాలకులు పట్టించుకోలేదు. కేవలం మూడు మార్గాల్లోనే మెట్రోరైలు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించి మిగతా ప్రాంతాలను పూర్తిగా విస్మరించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెట్రో సౌకర్యాన్ని శివారు ప్రాంతవాసులకూ అందించాలని భావించి రెండో దశ చేపట్టాలని నిర్ణయించింది. రెండో దశలో శివారు ప్రాంతాలను కలుపడంతోపాటు మాదాపూర్ నుంచి రాయదుర్గం, గచ్చిబౌలి మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకూ మెట్రో మార్గాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తున్నది. కేంద్రం ఇటీవల ఆవిష్కరించిన నూతన మెట్రోరైలు పాలసీకి అనుగుణంగా రెండోదశ డీపీఆర్ రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని, మరో ఐదు నెలల్లో డీపీఆర్ పూర్తవుతుందని చెప్తున్నారు.

మొదలైన కసరత్తు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్త మెట్రో పాలసీని ఆవిష్కరించింది. దానికి అనుగుణంగా రెండో దశ డీపీఆర్‌లను రూపొందించాల్సి ఉంటుందని, ఇందుకు కనీసం ఐదు నెలలైనా పడుతుందని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రెండో దశ డీపీఆర్ రూపొందించే పనులను ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్‌కు (డీఎంఆర్‌సీ) అప్పగించారు. ప్రస్తుతం డీఎంఆర్‌సీ, హైదరాబాద్ మెట్రోరైల్ అధికారులు డీపీఆర్‌ల తయారీకి కసరత్తు చేస్తున్నారు. రెండో దశను ఎక్కడి నుంచి ఎక్కడికి విస్తరించాలి? ఆయా చోట్ల అవసరం ఉన్నదా? జన సాంద్రత ఎలా ఉన్నది? ట్రాఫిక్ స్థితిగతులు ఎలా ఉన్నాయి? మెట్రో నిర్మాణానికి ఎలాంటి పరిజ్ఞానాన్ని వినియోగించాలి? ఎంత బడ్జెట్ అవుతుంది? నిధులను ఎలా సమీకరించాలి? వంటి విషయాలపై అధ్యయనం చేసి డీపీఆర్‌లో పొందుపరుచనున్నారు. ప్రస్తుతం ఉన్న మెట్రో స్టేషన్ల నుంచి కొత్త ప్రాంతాలకు రైలు మార్గాన్ని ఎలా అనుసంధానం చేయాలి? అలైన్‌మెంట్ ఎలా ఉండాలి? మెట్రోకోచ్‌లు భిన్నంగా ఉండాలా? ఏ తరహా సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేవాలి? వంటి అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. మెట్రోరైలు రాకతో ఆయా ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి మార్పులొస్తాయో వివరణాత్మకంగా పొందుపరుస్తారు. ఇలా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి డీపీఆర్‌లో పొందుపరిచేందుకు మెట్రో అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. సివిల్ ఇంజినీరింగ్, ఆర్థిక, రైల్వే ట్రాక్ ఏర్పాటు, నిర్వహణ, ఎలక్ట్రికల్, కోచ్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రాఫిక్ వంటి రంగాల్లో నిపుణులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు.



విమానాశ్రయం వరకు మెట్రోకూత

మొదటి దశలో మెట్రోరైలు 72 కి.మీల మేర రాకపోకలు సాగించనున్నది. అయితే నగరానికి దక్షిణ ప్రాంతంలోని శంషాబాద్, పశ్చిమంలో ఉన్న గచ్చిబౌలి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా మెట్రో సేవలు అందుబాటులోకి రావడంలేదు. నగర పశ్చిమ ప్రాంతంలో శిల్పారామం వరకే మెట్రో పరిమితం కానున్నది. దీంతో నగరాభివృద్ధిలో కీలకమైన ఐటీ ప్రాంతాలకు మెట్రో మార్గాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమీప భవిష్యత్తులో కొండాపూర్-రాయదుర్గం-గచ్చిబౌలి మార్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ల్లో ఐటీ రంగం గణనీయంగా అభివృద్ధి చెందనున్నది. ఈ నేపథ్యంలో రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం దాకా మెట్రో రైలు సౌకర్యాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు దృఢనిశ్చయంతో ఉన్నారు. దీంతో రెండో దశలో ఈ మార్గానికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు నగరంలోని దక్షిణ ప్రాంతాన్ని, పశ్చిమ ప్రాంతాన్ని అనుసంధానించేలా డీపీఆర్‌లు రూపొందిస్తున్నారు.

సీఐ డ్రంకెన్ డ్రైవ్

- పలు వాహనాలను ఢీకొనడంతో నలుగురికి గాయాలు
- ఇన్‌స్పెక్టర్ బ్రీత్ ఎనలైజర్ రీడింగ్ 239 పాయింట్లు.. చితకబాదిన స్థానికులు
- శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం: సీపీ మహేశ్ భగవత్



ప్రమాదానికి కారణమైన కారు. (ఇన్‌సెట్) సీఐ గిరీశ్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో/జవహర్‌నగర్ నమస్తే తెలంగాణ: మద్యం మత్తులో ఓ సీఐ అతివేగంగా కారు నడిపి బీభత్సం సృష్టించాడు. సోమవారం రాత్రి రాచకొండ పోలీస్ కమిషనరేట్ జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జీ గిరీశ్‌కుమార్ కౌకుర్ నుంచి యాప్రాల్ శైలిగార్డెన్‌లోని తన ఇంటికి ఇన్నోవా కారు(ఏపీ 10 ఏఎస్ 6678)లో అతి వేగంగా దూసుకొచ్చాడు. అదే సమయంలో జవహర్‌నగర్ నుంచి యాప్రాల్ హనుమాన్ టెంపుల్ వైపు బైక్‌పై వస్తున్న భిక్షపతి, లక్ష్మి దంపతులను ఢీకొట్టాడు. ఆ తర్వాత ఓ ఆటో, మరో బైక్‌ను కూడా గిరీశ్‌కుమార్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భిక్షపతి, లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో కోపోద్రిక్తులైన స్థానికులు ఇన్‌స్పెక్టర్ గిరీశ్‌కుమార్‌ను చితకబాదారు. అనంతరం జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతనికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా రీడింగ్ చూడగా 239 పాయింట్లు ఉన్నట్టు తేలింది. ఇది పరిమితికి మించి ఉండటంతో జవహర్‌నగర్ పోలీసులు గిరీశ్‌కుమార్‌పై డ్రంకెన్ డ్రైవింగ్, రోడ్డు ప్రమాదం సెక్షన్‌తోపాటు క్రిమినల్ కేసు నమోదు చేశారు. గిరిశ్‌కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ స్పష్టంచేశారు. గిరీశ్‌కుమార్ గతంలో మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాడు.

9 నుంచి ఓయూ శతాబ్ది రాష్ట్రస్థాయి పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 9వ తేదీ నుంచి ఓయూ శతాబ్ది రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ పాటలు, పెయింటింగ్, వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, తెలంగాణ డ్యాన్స్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 7వ తేదీలోగా దరఖాస్తులు పంపించాలని సూచించారు. ఇతర వివరాలను www.osmania.ac.inలో చూసుకోవచ్చని చెప్పారు.

అక్రమ హోర్డింగులు తొలిగించాలి!


పురపాలకశాఖ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తక్షణమే తొలిగించాలని పురపాలకశాఖ కార్యదర్శి అరవింద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సచివాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తే ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోర్డింగులను అక్రమంగా ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చిన స్థల యజమానులు, ఏజెన్సీలకు జరిమానాలను విధించడమే కాకుండా కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అక్రమ హోర్డింగులు ట్రాఫిక్ సిగ్నళ్లకు అడ్డంకిగా మారాయని, ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నదన్నారు. గతంలో పలుమార్లు హోర్డింగులు కూలిపోవడం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. 2011 నుంచి కొత్త హోర్డింగులు, యూనిపోళ్ల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ అనుమతి ఇవ్వలేదని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ అద్వైత్‌కుమార్ సింగ్ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. అంతకంటే ముందు అనుమతి ఇచ్చిన వాటికే ఏటా రెన్యువల్ చేస్తున్నామన్నారు. ఇందుకోసం స్ట్రక్చర్ నాణ్యత సర్టిఫికెట్, స్థలయజమాని నుంచి ఎన్‌వోసీ వంటివి తీసుకుంటున్నామని తెలిపారు. వ్యాపార ప్రకటన ఫీజును కూడా వసూలు చేస్తున్నామన్నారు. నగర అందాన్ని ద్విగుణీకృతం చేయడానికి అక్రమ హోర్డింగులను క్రమం తప్పకుండా తొలిగిస్తున్నామని చెప్పారు.

పాస్‌పోర్ట్ సేవలు మరింత సరళతరం

తత్కాల్ సేవలకు గ్రూప్‌వన్ అధికారి ధృవీకరణ పత్రం నుంచి మినహాయింపు

రాష్ట్రంలో మరో ఐదు పోస్టాఫీసుల్లో పాస్‌పోర్ట్‌సేవా కేంద్రాలు: పాస్‌పోర్ట్ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి



కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: పాస్‌పోర్ట్ సేవలను మరింత సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ పాస్‌పోర్ట్ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. తత్కాల్ పాస్‌పోర్ట్‌లకు సంబంధించి ఇకపై గ్రూప్‌వన్ అధికారి ధృవీకరణ పత్రం లేకుండానే జారీ చేసే వెసులుబాటు కల్పించిందన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తత్కాల్ పద్ధతిలో దరఖాస్తు చేసుకునేవారు ఆధార్ కార్డు లేదా ఎన్‌రోల్ చేసిన పత్రం, సెల్ఫ్ డిక్లరేషన్ అనెక్సరీ-ఈతోపాటు నిర్దేశించిన 12 డాక్యుమెంట్ల (ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆయుధ లైసెన్స్, ఎస్సీ, ఎస్టీ కులం సర్టిఫికెట్, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల గుర్తింపు కార్డు, బ్యాంక్, కిసాన్, పోస్టాఫీస్ పాస్‌బుక్, స్టూడెంట్ గుర్తింపు కార్డు, పుట్టినతేదీ, పెన్షన్‌పత్రం, సెల్ఫ్ పాస్‌పోర్ట్, రేషన్‌కార్డు)ల్లో ఏవైనా రెండింటితో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ విధానంలో దరఖాస్తు చేస్తే ముందస్తు పోలీస్ వెరిఫికేషన్ లేకుండానే మూడు రోజుల్లో పాస్‌పోర్ట్ జారీ చేస్తామన్నారు. ఔట్ ఆఫ్ టర్న్ ఇష్యూ ఆఫ్ ప్రెస్ పాస్‌పోర్ట్ అండర్ నార్మర్ స్కీం ద్వారా అదనంగా తత్కాల్ ఫీజు చెల్లించకుండానే పాస్‌పోర్ట్‌లను జారీ చేస్తామన్నారు. ఈ విధానం ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రెస్ పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు ముందస్తు పోలీస్ వెరిఫికేషన్ లేకుండానే మూడు నుంచి వారం రోజుల్లో జారీ చేస్తామన్నారు. ఈ దరఖాస్తుదారులు తత్కాల్ స్కీంకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు.

పాస్‌పోర్ట్‌ల జారీలో హైదరాబాద్ టాప్

దేశంలో పాస్‌పోర్ట్‌ల జారీలో హైదరాబాద్ కార్యాలయం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మూడేండ్లుగా అగ్రస్థానంలో కొనసాగుతున్నామన్నారు. 2017లో దేశవ్యాప్తంగా 1.17 కోట్ల పాస్‌పోర్ట్‌లు జారీ అవగా హైదరాబాద్ నుంచి 5.87 లక్షల పాస్‌పోర్ట్‌లు జారీ చేశామన్నారు. వరంగల్, మహబూబ్‌నగర్‌లోని పోస్టల్ పాస్‌పోర్ట్ సేవాకేంద్రాల ద్వారా 15,476 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో మెదక్, నల్లగొండ, ఖమ్మం, సిద్దిపేట, ఆదిలాబాద్ జిల్లాల్లో పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లో విదేశీభవన్‌ను నిర్మించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకున్నదని, రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్వేషణలో ఉన్నదన్నారు. గతేడాది మాదిరిగానే త్వరలో పాస్‌పోర్ట్ మేళాలు, అదాలత్‌లు నిర్వహిస్తామని వివరించారు.

ఫేస్‌బుక్‌లో పరిచయం

వివాహితతో కానిస్టేబుల్ ప్రేమాయణం

పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేసిన అధికారులు



కానిస్టేబుల్ సందీప్

చార్మినార్: ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళతో పరిచయం పెంచుకున్న ఓ కానిస్టేబుల్ ప్రేమాయాణం సాగించాడు. భాదితులు తెలిపిన వివరాల ప్రకారం. హైదరాబాద్ మొఘల్‌పుర పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సందీప్‌కు ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఫేస్‌బుక్‌లో పరిచయం అయిన మహిళకు అప్పటికే వివాహమైనా సందీప్ ఆమెతో ప్రేమాయణం సాగించాడు. విషయం తెలుసుకున్న మహిళ భర్త సందీప్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా పోలీస్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఈ ఘటనపై ఇన్‌స్పెక్టర్ దేవేందర్ వివరణ ఇచ్చారు. గతంలో సందీప్‌పై ఆరోపణలు వచ్చిన విషయం వాస్తవమేనని, సందీప్‌పై ఫిర్యాదు రావడంతో అతన్ని పోలీస్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశామని తెలిపారు. సందీప్‌కు అప్పటికే వివాహమైనట్టు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

షార్ట్‌ఫిల్మ్‌ల్లో అవకాశాల పేరుతో మోసాలు

నటులు కావాలంటూ ప్రకటనలు.. డబ్బు వసూలు చేసి బిచాణా ఎత్తేస్తున్న ముఠా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: టీవీ సీరియళ్లు.. షార్ట్‌ఫిల్మ్‌లు.. మోడలింగ్‌లో అవకాశాల పేరుతో యువతను మాయచేసే ముఠాలు పెరిగిపోతున్నాయి. షార్ట్‌ఫిల్మ్‌ల సంస్కృతి పెరుగడంతో పలువురు సులభంగా మోసగాళ్ల వలలో పడిపోతున్నారు. ముందువెనుకా ఆలోచించకుండా డబ్బులు ముట్టజెప్తున్నారు. ఇటీవల బంజారాహిల్స్‌లో వెలుగు చూసిన ఘటనతో ఈ ముఠాల భాగోతం వెలుగులోకి వచ్చింది. పిల్లలకు మోడలింగ్, యాడ్ ఫిలిమ్స్‌లలో అవకాశం ఇస్తానంటూ ఓ ముఠా బంజారాహిల్స్‌లోని లినార్ప్ స్టూడియోలో ఫొటోషూట్ నిర్వహించింది. తల్లిదండ్రుల నుంచి డబ్బు వసూలు చేసి బిచాణా ఎత్తివేసింది. ఈ ముఠా ముంబైలోనూ అపూర్వకృతి ప్రొడక్షన్ పేరుతో మోసాలకు పాల్పడినట్టు తెలిసింది. పలువురు బాధితులు సోషల్‌మీడియాలో తమ అనుభవాలను పంచుకుంటున్నారు.

షార్ట్ ఫిలిమ్స్ పేరుతోనూ!

షార్ట్‌ఫిల్మ్‌లు తీసి, యూట్యూబ్, సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేసి అందులో వచ్చే ప్రకటనలతో డబ్బు సంపాదించే వారు చాలామంది ఉన్నారు. అందులో నటించేవారికి సైతం క్రేజ్ పెరుగుతున్నది. ఇదే అదనుగా మోసగాళ్లు షార్ట్‌ఫిల్మ్‌లకు నటులు కావాలంటూ సోషల్‌మీడియాలో, వివిధ వెబ్‌సైట్లలో ప్రకటనలు ఇస్తున్నారు. ఫోన్ ద్వారా సంప్రదిస్తూ బాధితులను నిండా ముంచుతున్నారు. ప్రకటనలు చూసి తొందరపడొద్దని, పూర్వాపరాలు పరిశీలించాలని పోలీసులు సూచిస్తున్నారు. అనుమానం వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

వడ్డీరేట్లు తగ్గకపోవచ్చు

ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్



రాబోయే ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ అన్నారు. వచ్చే నెల 7న ఆర్బీఐ ద్రవ్యవిధాన పరపతి సమీక్ష జరుగనున్న క్రమంలో కీలక వడ్డీరేట్లు యథాతథంగానే ఉండవచ్చన్న అభిప్రాయాన్ని పీటీఐ వద్ద ఆయన వ్యక్తం చేశారు. వృద్ధిరేటు పెరిగి, ద్రవ్యోల్బణం కూడా పెరిగితే వడ్డీరేట్ల జోలికి ఆర్బీఐ వెళ్లకపోవచ్చన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్బీఐ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని మించిపోయి 5.21 శాతం వద్ద ఉన్నదన్న విషయాన్ని గుర్తుచేశారు. కాగా, గతేడాది ఆగస్టు2న జరిపిన ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ చివరిసారిగా పావు శాతం వడ్డీరేట్లను తగ్గించింది.

'కొడుకులే కావాలనుకుంటున్నారు'


కొడుకు, కూతురు ఒక్కటేనని, అమ్మాయిల పట్ల చిన్నచూపు తగదంటూ ఏండ్ల తరబడి ప్రచారం చేస్తున్నా.. దేశంలో తల్లిదండ్రులు ఇంకా కొడుకులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆర్థిక సర్వే వెల్లడించింది. కొడుకు కోసం పిల్లల్ని కంటూపోతున్న తల్లిదండ్రులు ఇప్పటికీ ఉన్నారని తెలిపింది. కొడుకు పుడితే సంతానాన్ని పరిమితం చేసుకుంటున్న తల్లిదండ్రులు.. కూతురు పుడితే మాత్రం కొడుకు కోసం అదే సంతానాన్ని పెంచుకునేందుకు వెనుకాడటం లేదన్నది. దేశవ్యాప్తంగా 2.1 కోట్ల మంది అమ్మాయిలను వారి తల్లిదండ్రులు అయిష్టంగానే కన్నారని, వీరంతా నిజానికి కొడుకులను కోరుకున్నవారేనని ఆర్థిక సర్వే ప్రకటించడం గమనార్హం.

ఆర్థిక సర్వే 2017-18 ముఖ్యాంశాలు



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం పార్లమెంట్‌కు నివేదించిన ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలు ఇవీ..

- వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో జీడీపీ 7 నుంచి 7.5 శాతం
- ప్రపంచంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మళ్లీ ఖ్యాతిని దక్కించుకుంటుందని ఆశాభావం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 6.75 శాతంగా నమోదవుతుందని అంచనా
- చమురు ధరలు మరింత పెరిగినా, స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనైనా వచ్చే ఆర్థిక సంవత్సరంలో విధానపరమైన నిఘా అవసరం
- వ్యవసాయ రంగానికి ఊతమివ్వడంతో పాటు ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు పెట్టుబడులను సమకూర్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో విధాన అజెండా
- పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య 50 శాతం పెరిగినట్లు జీఎస్టీ గణాంకాలు వెల్లడి
- సమాఖ్య తరహా ప్రభుత్వాలున్న ఇతర దేశాల్లోని రాష్ర్టాలతో పోలిస్తే మన దేశంలోని రాష్ర్టాలు, స్థానిక ప్రభుత్వాలు వసూలు చేస్తున్న పన్నులు చాలా తక్కువ
- పెద్ద నోట్ల రద్దుతో పొదుపునకు ప్రోత్సాహం
- నిరర్థక ఆస్తుల సమస్యను పరిష్కరించుకునేందుకు దివాలా చట్టాన్ని ఉపయోగించడం చాలా ముఖ్యం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 3.3 శాతం. గత ఆరేండ్ల కంటే తక్కువ
- న్యాయ వ్యవస్థలో పెండింగ్ కేసులను, విచారణలో జాప్యాన్ని తగ్గించడం అవసరం
- పట్టణ ప్రాంతాలకు వలసలతో వ్యవసాయ రంగంలో పెరుగుతున్న మహిళ పాత్ర
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైతులకు వడ్డీ రాయితీ కోసం రూ.20,339 కోట్ల నిధులకు ఆమోదం
- 2017-18లో సంస్కరణల వలన సేవల రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 15 శాతం వృద్ధి
- కార్మిక చట్టాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు టెక్నాలజీ వినియోగం
- 2014 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 39 శాతంగా ఉన్న పారిశుద్ధ్య కార్యక్రమాలు 'స్వచ్ఛభారత్'తో 2018 జనవరి నాటికి 76 శాతానికి విస్తరణ
- సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించేందుకు విద్య, వైద్యం లాంటి సామాజిక మౌలిక వసతుల రంగాలకు మరింత ప్రాధాన్యత
- వాయు కాలుష్య సమస్యను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకారం పెంపు
- లింగ వివక్షకు సంబంధించిన సమస్యలను ఎత్తిచూపేందుకు గులాబీ రంగులో 2017-18 ఆర్థిక సర్వే నివేదిక



పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీతో లాభాలెన్నో

నల్లధనం, నకిలీ కరెన్సీల నిర్మూలనే లక్ష్యంగా 2016 నవంబర్ 8వ తేదీన ప్రకటించిన పాత పెద్ద నోట్ల రద్దుతో లాభాలెన్నో కలిగాయని ఆర్థిక సర్వే తెలియజేసింది. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగిందని, గృహస్తుల పొదుపు కూడా పుంజుకున్నదని ఆర్థిక సర్వే చెప్పింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీతో అదనంగా దాదాపు 18 లక్షల పన్ను చెల్లింపుదారులు పెరిగారని వివరించింది. నోట్ల రద్దు, జీఎస్టీల లక్ష్యం మరింత మందిని పన్ను పరిధిలోకి తేవడమేనని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ చెప్పారు. జీఎస్టీతో పరోక్ష పన్ను చెల్లింపుదారులు 50 శాతం పెరిగారని, జీఎస్టీ వసూళ్లు మళ్లీ గాడిలోపడ్డట్లేనన్నారు.

మౌలిక రంగానికి 4.5 లక్షల కోట్ల డాలర్లు



దేశ ఆర్థికరంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మౌలిక రంగానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉన్నదని ఆర్థిక సర్వే పేర్కొన్నది. ఇందుకోసం వచ్చే 25 ఏండ్లకాలంలో మౌలిక రంగ అభివృద్ధికి 4.5 లక్షల కోట్ల డాలర్ల నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనావేస్తున్నది. మౌలిక రంగంలో అంతర్జాతీయ స్థాయి పనితీరు కనబరుచాలంటే భారీ స్థాయిలో నిధులు అవసరమవుతాయని పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమర్పించిన ఆర్థిక సర్వేలో వెల్లడించారు. ప్రస్తుత ధోరణి చూస్తుంటే 3.9 లక్షల కోట్ల డాలర్ల నిధులను సమకూర్చే సత్తా భారత్‌కు ఉన్నదని పేర్కొంది. 2040 నాటికి భారత్‌లో మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడుల మధ్య అంతరం 526 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని అంచనావేస్తున్నది. పెరుగుతున్న ఈ అంతరాన్ని తగ్గించాలంటే ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఎన్ఐఐబీ), ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (గతంలో బ్రిక్స్) భారీ స్థాయిలో నిధులను వెచ్చించాల్సిన అవసరం ఉన్నదని సూచించింది. అలాగే పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) పద్ధతిలో భారీ ఎత్తున ప్రాజెక్టులను చేపట్టాలని, తద్వారా మౌలిక రంగంలో పెట్టుబడులు పుంజుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. దీంట్లోభాగంగా దేశవ్యాప్తంగా 2001లో 33.73 కోట్ల కిలోమీటర్లుగా ఉన్న రోడ్డు ప్రస్తుతం 57.17 కోట్ల కిలోమీటర్లకు చేరుకున్నది. ఇదే సమయంలో వాహన వినిమయం నాలుగు రెట్లు పెరిగి 22.90 కోట్లకు చేరుకున్నాయి. భారత్‌లో రోడ్డు సాంద్రత 1.66 కిలోమీటర్లుగా ఉన్నది. జపాన్, అమెరికా, చైనా, బ్రెజిల్, రష్యాల కంటే అధికంగా కలిగివుండటం విశేషం. సెప్టెంబర్ 2017 నాటికి భారత్‌లో 1,263 ప్రాజెక్టుల నిర్మాణాలు జరుగుతుండగా, వీటి విలువ రూ.3,17,373.9 కోట్లుగా ఉన్నాయి. మెట్రోరైల్ విషయానికి వస్తే హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, నోయిడా, కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు, జైపూర్, లక్నో, కొచిలలో 425 కిలోమీటర్ల మేర అందుబాటులోకి వచ్చిందని సర్వే వెల్లడించింది. దీంతోపాటు 684 కిలోమీటర్లకు సంబంధించి మెట్రో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అలాగే షిప్పింగ్ రంగ విషయానికి వస్తే 2017-18లో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో రేవుల సామర్థ్యం మరో 80 ఎంఎంటీపీఏలు పెరిగాయి. మరో రూ.3,159 కోట్లతో 15 ప్రాజెక్టుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అలాగే జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భారత్‌మాల, సాగరమాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయని..సాగరమాలలో భాగంగా 131 రేవుల సామర్థ్యాన్ని పెంచడానికి వచ్చే 20 ఏండ్లలో రూ.85,346 కోట్ల నిధులు అవసరమవుతాయని సర్వే అంచనావేస్తున్నది. నవంబర్ 30, 2017 నాటికి దేశంలో విద్యుత్ ఉత్పత్తి 3,30,860.6 మెగావాట్లకు చేరుకున్నది.

వచ్చే ఏడాది ఎయిర్ ఇండియా విక్రయం పూర్తి

అప్పులతో సతమతమవుతున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను కేంద్రం పూర్తిగా వదిలించుకోవాలని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా ఈ పనిని పూర్తి చేయాలని సూచించింది. దేశీయ ఆర్థిక పరిస్థితులు కుదుటపడుతుండటం, మరోవైపు జీఎస్టీ అమలులో ఎలాంటి అవాంతరాలు లేకపోవడంతో ఎయిర్ ఇండియాను విక్రయించడానికి ఇదే సరైన సమయమని ఆర్థిక సర్వే సూచించింది. ప్రస్తుతం సంస్థకు రూ.50 వేల కోట్లకు పైగా అప్పు ఉన్నది. డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.46,247 కోట్ల మేర నిధులను సేకరించింది.

వాతావరణం.. పెనుశాపం!

వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం ■ రైతుల ఆదాయం 25 శాతం మేరకు తగ్గుతుందని ఆర్థిక సర్వే హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 29:




వ్యవసాయ రంగంపై వాతావరణ మార్పులు తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయని, సమీప భవిష్యత్తులో దీని వలన మన దేశంలోని రైతుల ఆదాయం 20 శాతం నుంచి 25 శాతం మేరకు తగ్గే అవకాశం ఉందని ఆర్థిక సర్వే హెచ్చరించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో పాటు ఆధునిక సాంకేతి పరిజ్ఞానాన్ని విస్తృత స్థాయిలో వినియోగించుకోవడం, విద్యుత్ వినిమయం, ఎరువుల సబ్సిడీల విషయంలో మరింత ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకోవడం ఎంతో అవసరమని ఈ సర్వే ఉద్ఘాటించింది. వ్యవసాయ రంగంలో నష్టాలను తగ్గించి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాలను సాధించేందుకు విస్తృతమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఈ సర్వే కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. వ్యవసాయ రంగంలో మరిన్ని సంస్కరణలను చేపట్టి, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు జీఎస్టీ కౌన్సిల్ (వస్తు, సేవల పన్ను మండలి) తరహాలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈ సర్వే స్పష్టం చేసింది. వాతావరణ మార్పులు ఇప్పటికే దేశ వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని, దీనికి తోడుగా దేశంలో భూగర్భ జలాలు నానాటికీ అడుగంటుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని, ఈ సవాళ్లను అధిగమించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ టెక్నాలజీలను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుని నీటిపారుదల వ్యవస్థలను గణనీయంగా విస్తరించుకోవడంతో పాటు తృణ ధాన్యాల సాగుకు సంబంధించిన విధానంపై సమీక్ష జరపాల్సిన అవసరం ఉందని ఈ సర్వే పేర్కొన్నది. దేశంలో ప్రస్తుతం 45 శాతం వ్యవసాయ భూములకు మాత్రమే నీటిపారుదల వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయని, గంగా నదీ పరివాహక ప్రాంతంతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో నీటిపారుదల వసతులు మెరుగ్గా ఉన్నప్పటికీ.. కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర రాష్ర్టాల్లోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన నీటిపారుదల వ్యవస్థలు లేవని, దీనికితోడు వాతావరణ మార్పుల వలన ఆయా ప్రాంతాల్లో తీవ్ర నష్టాలు సంభవించేందుకు ఆస్కారముందని ఈ సర్వే హెచ్చరించింది.

సాగుబడిలో మహిళలకు తోడ్పాటు

ఇదిలావుంటే, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్రజల వలసలు, ప్రత్యేకించి పురుషుల వలసలు పెరుగుతుండటంతో వ్యవసాయ రంగంతో పాటు దాని అనుబంధ రంగాల్లో మహిళల పాత్ర నానాటికీ పెరుగుతున్నదని, కనుక ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగంలో మహిళలకు తోడ్పాటును అందించేందుకు విధానపరమైన చొరవలను చేపట్టాల్సిన అవసరమున్నదని ఆర్థిక సర్వే ఉద్ఘాటించింది. 'వ్యవసాయంలో రైతులు, పెట్టుబడిదారులు, కార్మికులుగా మహిళలు బహుముఖ పాత్ర పోషిస్తున్నారు. దేశంలో వ్యవసాయ, గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో వారు పోషిస్తున్న పాత్రను విస్మరించలేము. కనుక వ్యవసాయ, అనుబంధ రంగాల్లో మహిళలకు విస్తృతమైన తోడ్పాటును అందజేసి ఉత్పాదకతను పెంపొందించుకునేందుకు విధానపరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉన్నది' అని ఈ సర్వే పేర్కొన్నది.

ధరాఘాతం నుంచి ఉపశమనం

ఆరేండ్ల కనిష్ఠానికి జారుకోనున్న ద్రవ్యోల్బణం



ధరాఘాతం నుంచి సామాన్యుడికి ఊరట లభించే అవకాశం ఉన్నదని ఆర్థిక సర్వే అంచనావేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను సరాసరి రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేండ్ల కనిష్ఠ స్థాయి 3.3 శాతానికి తగ్గనున్నదని వెల్లడించింది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వంతోపాటు రిజర్వు బ్యాంక్‌లు అధిక ప్రాధాన్యత నివ్వడం ఇందుకు కలిసిరానున్నదని తెలిపింది. గృహాలు, ఇంధనం ధరలు మినహాయించి మిగతా కమోడిటీ ఉత్పత్తుల ధరలు తగ్గుతుండటం ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గడానికి ప్రతిక అని సర్వే పేర్కొన్నది. గడిచిన నాలుగేండ్లుగా టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం ఆధీనంలో కొనసాగుతున్నదని సర్వే ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో ఆహార పదార్థాలకు సంబంధించిన గణాంకాలు 1.5 శాతం లోపు ఉండటంతో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడానికి కారణమని విశ్లేషించింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరుగడంతోపాటు ధరల విషయంపై కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం తనవంతు పాత్రను పోషించింది. రాష్ర్టాల వారిగా ద్రవ్యోల్బణ గణాంకాల విషయానికి వస్తే 17 రాష్ర్టాల్లో నాలుగు శాతం దిగువకు పడిపోయింది.

14 లక్షల కోట్లకు లాజిస్టిక్ రంగం

2020 నాటికి చేరుకోనుందంటున్న ఆర్థిక సర్వే



భారత్‌లో లాజిస్టిక్ రంగం శరవేగంగా దూసుకుపోతున్నది. ప్రస్తుతం 160బిలియన్ డాలర్లుగా ఉన్న లాజిస్టిక్ రంగం 2020 నాటికి 215 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని ఆర్థిక సర్వే అంచనావేస్తున్నది. మన కరెన్సీలో రూ.14 లక్షల కోట్లకు పైమాటే. జీఎస్టీ అమలులోకి రావడం లాజిస్టిక్ విభాగం మరింత బలోపేతం అవడానికి పరోక్షంగా దోహదం చేస్తున్నదని పార్లమెంట్‌కు సమర్పించిన ఆర్థిక సర్వేలో పేర్కొంది. గడిచిన ఐదేండ్లుగా ప్రతియేటా 7.8 శాతం వృద్ధితో లాజిస్టిక్ విభాగం 2.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది. లాజిస్టిక్ పనితీరు ఇండెక్స్‌లో 2014లో 54వ స్థానంలో ఉన్నా భారత్.. 2016 ఏడాదికిగాను 35వ స్థానానికి ఎగబాకిందని వరల్డ్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం, రెగ్యులేటరీ అనుమతులు సులభంగా లభించడం, పెట్టుబడులు ఆకట్టుకోవడం మెరుగైన వృద్ధికి దోహదచేసే అంశాలని సర్వే పేర్కొన్నది. అయినప్పటికీ లాజిస్టిక్ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని, ముఖ్యంగా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఈ తీవ్రత ఎక్కువగా ఉన్నదని, ఉత్పత్తి సరఫరా విషయంలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో విఫలంకావడం, గోదాంల ఏర్పాటుకు సంబంధించి ఎక్కువ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదే క్రమంలో నూతన టెక్నాలజీ, పెట్టుబడుల పరిమితి పెంచడం, నైపుణ్యత, ఆటోమేషన్, సింగిల్ విండో సిస్టమ్, ప్రాసెసింగ్ మరింత సరళతరం కావాల్సిన అవసరం ఉన్నదని సర్వే అభిప్రాయపడింది. ఈ రంగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది.

ఎవరేమన్నారు

"వచ్చే ఏడాదిలో ప్రభావవంతమైన, వేగవంతమైన వృద్ధిరేటు కోసం నిర్మాణాత్మకమైన నూతన సలహాలను సర్వే అందించింది. మహిళా సాధికారత, విద్య, ఉపాధి, కార్మిక రంగాల అభివృద్ధి, వ్యవసాయోత్పత్తిపై సర్వే దృష్టిసారించడం ఆహ్వానించదగ్గ పరిణామం. తాజా సర్వేను రాబోయే బడ్జెట్ ప్రతిబింబించగలదని భావిస్తున్నాం

- చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ డైరెక్టర్ జనరల్

ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనలకు ఆర్థిక సర్వే అద్దం పట్టింది. నిరర్థక ఆస్తులు ప్రమాదకర స్థాయికి పెరిగిన వేళ.. బ్యాంకులకు ఆర్థిక సాయం త్వరితగతిన అందాలి. కొత్త ఉద్యోగాల సృష్టి, వ్యవసాయానికి, విద్య రంగాలకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి

- సందీప్ జజోడియా, అసోచామ్ అధ్యక్షుడు

ఆర్థిక సంస్కరణలు ముందుకు సాగాలి. ఇప్పటివరకు ప్రభుత్వం తెచ్చిన సంస్కరణల ప్రభావం వచ్చే ఆర్థిక సంవత్సరం దేశ ఆర్థిక వ్యవస్థపై కనిపించవచ్చు. జీఎస్టీ నిర్మాణాన్ని మరింత మెరుగుపరచాలి. పన్ను ప్రయోజనాలు పెరుగాలి

- రాజేశ్ షా, ఫిక్కీ అధ్యక్షుడు

నిలకడైన వృద్ధిరేటు కోసం ఉపాధి, విద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణులు, ముఖ్యంగా రైతుల ఆదాయ వనరులను పెంచినట్లవుతుంది"

- అనిల్ ఖైతాన్, పీహెచ్‌డీ చాంబర్ అధ్యక్షుడు

ప్రగతికి పది చోదక శక్తులు

ఉత్పాదక రంగంలో వృద్ధిరేటు పురోగతికి, ఉద్యోగ కల్పన అవకాశాలు పెరుగడానికి పది కీలక రంగాలను ప్రభుత్వం గుర్తించిందని ఆర్థిక సర్వే తెలియజేసింది. వీటి అభివృద్ధిపైనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ప్రాధాన్యం, తయారీ రంగంలో రెండంకెల వృద్ధిరేటు సాధ్యమవుతుందని సర్కారు విశ్వసిస్తున్నట్లు వివరించింది. రసాయనాలు, లెదర్, టెక్స్‌టైల్స్, ఆహార తయారీ, రత్నాలు, ఆభరణాలు, షిప్పింగ్, రైల్వేలు తదితర రంగాలపైనా మేక్ ఇన్ ఇండియా వెర్షన్ 2.0 దృష్టి పెట్టిందని తెలిపింది. 2014 సెప్టెంబర్ 25న 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని మోదీ సర్కారు మొదలు పెట్టిన విషయం తెలిసిందే.

ప్రభుత్వం గుర్తించిన ప్రాధాన్యతా రంగాలు

1.తయారీ 2.క్యాపిటల్ గూడ్స్
3.ఆటో 4.రక్షణ
5.ఔషధ 6.పునరుత్పాదక ఇంధనం
7.బయోటెక్నాలజీ 8.రవాణా
9.ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ 10.నిర్మాణం

రియల్టీలకు బ్యాంకుల మొండిచెయ్యి

రుణం ఇవ్వడానికి జంకుతున్న వైనం



దేశీయ రియల్టీ సంస్థలకు బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి జంకుతున్నాయి. సోమవారం పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం అందచేసిన ఆర్థిక సర్వే ఈ విషయం బహిర్గతమైనది. పెరుగుతున్న నిరర్థక ఆస్తుల నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగ సంస్థలకు రుణ వితరణ గతేడాది 17 శాతానికి తగ్గినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. 2013లో ఇది 68 శాతంగా ఉన్నది. ఒకవైపు నిరర్థక ఆస్తులు పెరుగుతుండటం, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లాభాలు అంతకంతకు పడిపోతుండటం ఇందుకు కారణమని సర్వే విశ్లేషించింది. అలాగే ప్రభుత్వరంగ బ్యాంకులు, గృహ రుణాలు అందించే సంస్థల మొండి బకాయిలు పెరుగుతుండటంపై ఆర్థిక సర్వే ఆందోళనను వ్యక్తంచేసింది. దీంతో రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాయని, ముఖ్యంగా ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు, ఆర్థిక సేవల విభాగాలకు చెందిన పెన్షన్ ఫండ్లు, సావరిన్ వెల్త్ ఫండ్ల నుంచి నిధులను సేకరిస్తున్నాయని తెలిపింది. 2013లో 14 శాతంగా ఉన్న ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ల వాటా గతేడాది చివరి నాటికి 82 శాతానికి చేరుకున్నాయి. కానీ వ్యక్తిగతంగా గృహ రుణాలు తీసుకునేవారికి పీఎస్‌బీలు, హెచ్‌ఎఫ్‌సీలు పెద్దపీట వేస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఇటీవల చోటు చేసుకున్న సంస్కరణలు అమ్మకాలపై స్వల్పకాలంపాటు ప్రభావం చూపినప్పటికీ దీర్ఘకాలికంగా మాత్రం లాభం చేకూరనున్నదని పేర్కొన్నది. ఏప్రిల్ 2016 నాటికి 8.88 లక్షలుగా ఉన్న అమ్మకం కాని యూనిట్లు గతేడాది అక్టోబర్ నాటికి 8.07 లక్షలకు తగ్గాయి. 2013-16 మధ్యకాలంలో రియల్టీ రంగంలోకి ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు ఆరు రెట్లు పెరిగి 0.9 బిలియన్ డాలర్ల నుంచి 5.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, దేశీయ రియల్ ఎస్టేట్ రంగం మాత్రం సంస్థాగత పెట్టుబడిదారులను ఆకట్టుకుంటున్నదని, గడిచిన రెండేండ్లకాలంలో 10.7 బిలియన్ డాలర్ల మేర నిధులు చొప్పించినట్లు సర్వే తెలిపింది. అలాగే ఈ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 107 మిలియన్ డాలర్ల మేర వచ్చాయి.

ఐదేండ్లలో రియల్టీలో కోటిన్నర ఉద్యోగాలు

దేశీయ రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో ఉద్యోగ కల్పన ఊపందుకుంటున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో ఈ రెండు రంగాల్లో కోటిన్నర మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉన్నదని ఆర్థిక సర్వే వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దు, రెరా చట్టం అమలులోకి రావడంతో గడిచిన కొన్ని త్రైమాసికాలుగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో మాత్రం దూసుకుపోతున్నదని సర్వే అభిప్రాయపడింది. ఉద్యోగ కల్పనలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు రెండో స్థానంలో ఉన్నాయి. మొదటి స్థానంలో వ్యవసాయ రంగం ఉన్నది. 2013 నాటికి నాలుగు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగం..2017 నాటికి 5.2 కోట్లకు చేరుకుగా, ఇదే క్రమంలో 2022 నాటికి 6.7 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని సర్వే వెల్లడించింది. అంటే ప్రతియేటా 30 లక్షల మందికి ఉపాధి లభించనున్నదన్న మాట.

దివాలా ప్రక్రియలో రూ.3.13 లక్షల కోట్ల రుణాలు

దివాలా ప్రక్రియ కింద రూ.3.13 లక్షల కోట్ల విలువైన క్లెయిములున్నాయని ఆర్థిక సర్వే తెలియజేసింది. రిజర్వ్ బ్యాంక్ సూచించిన 11 డిఫాల్టర్లకు చెందిన మొత్తం రుణాల విలువ ఇదని స్పష్టం చేసింది. బ్యాంకింగ్ నిరర్థక ఆస్తుల్లో 25 శాతానికి సమానమైన 12 ఖాతాలను గతేడాది జూన్‌లో ఆర్బీఐ గుర్తించగా, ఇందులో ఎరా ఇన్‌ఫ్రా మినహా మిగతా ఖాతాలను ఇన్సాల్వెన్సీ ప్రొసిడింగ్స్‌కు సెంట్రల్ బ్యాంక్ సిఫార్సు చేసింది. భూషణ్ స్టీల్ (రూ.55,989 కోట్లు), ఎస్సార్ స్టీల్ (రూ.50,778 కోట్లు), ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ (రూ.51,505 కోట్లు) కంపెనీలు రుణాల ఎగవేత జాబితాలో ప్రముఖంగా ఉన్నాయి.



రాష్ట్రంలో క్యాష్-ఎట్-పీవోఎస్ సేవలను ప్రారంభిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీజీ చైతన్య

ఏసీబీకి చిక్కిన విద్యాశాఖ ఉద్యోగి

కొత్తగూడెం ఎడ్యుకేషన్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యాశాఖ ఉద్యోగి ఏసీబీ వలకు చిక్కాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ కట్టగూరు సైదులు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ బీవీ సత్యనారాయణ కథనం ప్రకారం.. పాల్వంచకు చెందిన 'శ్రీలక్ష్మి విద్యాలయం' రెన్యువల్ కోసం రూ.25 వేలు లంచం ఇవ్వాలని సదరు స్కూల్ నిర్వాహకుడు బత్తుల ఆంథోనీ డిసౌజాను సైదులు డిమాండ్ చేశాడు. ఏడాది నుంచి రెన్యువల్ చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకొని వేధింపులకు గురిచేయడంతో విసుగుచెందిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సోమవారం విద్యాశాఖ కార్యాలయానికి వచ్చి సీనియర్ అసిస్టెంట్ సైదులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.


ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఉద్యోగి సైదులు

చీకటి జీవితాల్లో వెలుగులు

- గుడుంబా రహిత రాష్ట్రమే లక్ష్యం
- వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి
- ఉద్యోగాల కల్పనకు ధూల్‌పేటలో పరిశ్రమ
- ఆటోల పంపిణీ కార్యక్రమంలో మహమూద్‌అలీ, నాయిని నర్సింహారెడ్డి, పద్మారావు


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దశాబ్దాల తరబడి చీకట్లో బతుకుతున్న వారి జీవితాల్లో వెలుగులు నింపి, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ పేర్కొన్నారు. దొంగ వ్యాపారం చేసుకునే దశ నుంచి దర్జాగా వ్యాపారం చేసుకునే స్థితికి గుడుంబా వ్యాపారులు చేరుకున్నారని తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గుడుంబా వ్యాపారం మానేసిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఆటోలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సోమవారం నెక్లెస్‌రోడ్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో భాగంగా గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు గుడుంబా తాగి మరణించినవారి కుటుంబాల బాధలు విని చలించిపోయారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గుడుంబాను నిషేధించాలనే కేసీఆర్ ఆనాడే తమతో చర్చించారని చెప్పారు. ధూల్‌పేటలో గుడుంబా తయారీని పూర్తిగా మాన్పించాలనే సీఎం కేసీఆర్ ఆశయం నెరవేరిందని అన్నారు. గుడుంబా రహిత రాష్ట్ర సాధనలో ఎక్సైజ్‌తోపాటు రెవెన్యూ, పోలీసుల భాగస్వామ్యం కూడా ఉన్నదని హోం, కార్మికశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి కోసం దాదాపు రూ.15 కోట్ల విలువైన పరికరాలు అందించడం దేశ చరిత్రలో ప్రథమమని చెప్పారు.


గుండుంబా వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధిగా అందజేసిన వాహనాలను సోమవారం నెక్లెస్‌రోడ్డులో జెండాఊపి ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు పద్మారావు, నాయిని నర్సింహారెడ్డి

అందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి: ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు


గుడుంబా వృత్తిని మానేసిన వారందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్రం నుంచి గుడుంబాను తరిమి కొట్టే ప్రణాళికను 2015 సెప్టెంబర్‌లో ఎక్సైజ్‌శాఖ కార్యరూపంలోకి తెచ్చిందన్నారు. కేవలం మూడునెలల కాలంలోనే ఎనిమిది ఉమ్మడి జిల్లాలను గుడుంబా రహిత జిల్లాలుగా ప్రకటించామని చెప్పారు. 2016 అక్టోబర్‌లో హైదరాబాద్ జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా ప్రకటించి చరిత్ర సృష్టించామని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మంది గుడుంబా వ్యాపారులను గుర్తించామని, వారిలో మొదటి విడుతగా 6,066 మందికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా 100 శాతం సబ్సిడీతో వాహనాలను అందజేస్తున్నామని చెప్పారు. ధూల్‌పేటలో మినీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో గుడుంబా వృత్తిని మానేసిన 114 మంది లబ్ధిదారులకు వివిధ రకాల వాహనాలను మంత్రులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితా రాణా, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ రాజశేఖరరావు, జాయింట్ కమిషనర్ అజయ్‌రావు, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ప్రజాసేవలో మమేకం కావాలి



టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపు

నూతనంగా విధుల్లోకి 935 మంది కానిస్టేబుళ్లు


కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి కానిస్టేబుల్ క్రమశిక్షణ, సేవాభావంతో ప్రజాసేవలో మమేకం కావాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలను రక్షించేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని ప్రతి కానిస్టేబుల్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొమ్మిది నెలల శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన 935 మంది టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ ఔట్ పరేడ్)ను సోమవారం ఇబ్రహీంపట్నం ఆక్టోపస్ శిక్షణ కేంద్రం ఆవరణలో నిర్వహించారు. కానిస్టేబుళ్ల నుంచి డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. కానిస్టేబుళ్లను, వారి కుటుంబాలను డీజీపీ అభినందించారు. ప్రతి కానిస్టేబుల్ తమ ఆలోచనలో, విధి నిర్వహణలో ప్రజలపై సేవాభావం కలిగి ఉండాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టే అధికారులు చట్టాన్ని గౌరవించి నడుచుకోవాలని, శాఖలో ఆదర్శంగా నిలువాలని డీజీపీ సూచించారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టే మొదటిరోజు ఉన్న ఉత్సాహం, ఫిజికల్ ఫిట్‌నెస్ పదవీ విరమణ రోజు వరకు ఉండాలని అన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ నైతికమార్గంలో నడిచేందుకు కుటుంబసభ్యులు తోడుగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాచకొండ సీపీ మహేశ్‌భగవత్, బెటాలియన్స్ ఐజీ అభిలాషబిష్త్, ఆపరేషన్స్ ఐజీ కే శ్రీనివాస్‌రెడ్డి, సీఐడీ ఐజీ జీ శిఖాగోయల్, ఏఐజీ ఎం రమేశ్‌రెడ్డి, సీటీసీ ప్రిన్సిపాల్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. పరేడ్ అనంతరం కానిస్టేబుళ్ల సైలెంట్ డ్రిల్స్, మార్షల్‌ఆర్ట్స్ అండ్ కోర్‌మగ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తొలిసారిగా భారీసంఖ్యలో కానిస్టేబుళ్ల పరేడ్

గతంలో ఎప్పుడూ లేనివిధంగా 935 మంది టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు ఒకేసారి శిక్షణ పూర్తి చేసుకున్నారు. సోమవారం నాటి దీక్షాంత్ పరేడ్‌లో మొత్తం 12 కంటింజెంట్లు పాల్గొన్నాయి. పరేడ్‌కు కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్ కమాండర్‌గా వ్యవహరించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి ఈ పరేడ్‌ను పర్యవేక్షించారు. శిక్షణ కాలంలో పరేడ్, ఫైరింగ్, ఇన్‌డోర్, ఔట్‌డోర్ శిక్షణల్లో ప్రతిభచాటిన వారికి డీజీపీ బహుమతులు ప్రదానం చేశారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థుల్లో 248 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 587 గ్రాడ్యుయేట్లు, 102 మంది పోస్టుగ్రాడ్యుయేట్లు ఉన్నారు.

పోలీసు బడ్జెట్ ప్రతిపాదనలు రూ.6000 కోట్లు..

- ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన డీజీపీ!
- అర్బన్ పోలీసుస్టేషన్ల నిర్మాణానికి నిధులు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటుకు ప్రాధాన్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2018-19 బడ్జెట్‌లో రూ.6000 కోట్లు కేటాయించాలని పోలీస్‌శాఖ కోరుతున్నది. ఈ మేరకు తయారుచేసిన బడ్జెట్ ప్రతిపాదనలను డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. గత బడ్జెట్‌లో కొత్త వాహనాల కొనుగోలు, హైదరాబాద్‌లో భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఈసారి హైదరాబాద్ తరహాలో జిల్లాల్లో పోలీసు అధికారుల భవనాలు, అర్బన్ పోలీస్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసినట్టు సమాచారం. గత బడ్జెట్‌కు 25 శాతం అధికంగా సుమారు 6,000ల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిసింది. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం పోలీస్‌శాఖకు ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయిస్తున్నది. పోలీసుశాఖకు ప్రాధాన్యమిస్తున్న కారణంగా ప్రజలకు భద్రతపై భరోసా పెరుగడంతోపాటు, రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ అంశం దోహదపడుతున్నదని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది కేటాయించిన రూ. 4,828 కోట్లను పోలీసు శాఖ ఆధునీకరణకు, సిబ్బంది జీవనప్రమాణాలను పెంచడానికి, వారికి సరైన శిక్షణ, ఆధునిక సాంకేతికపరిజ్ఞానాన్ని అందివ్వడానికి, ఆధునిక వాహనాల కొనుగోలుకు వెచ్చించారు. ఇదిలాఉండగా, కొత్త జిల్లాల్లో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ పోలీసుస్టేషన్లను హైదరాబాద్ తరహాలో ఆధునిక హంగులు, పూర్తి సాంకేతికపరిజ్ఞానంతో నిర్మించాలని డీజీపీ నిర్ణయించారు. ఇందుకు ప్రభుత్వం నుంచి కూడా గ్రీన్‌సిగ్నల్ వచ్చిన విషయం తెలిసిందే. టెక్నాలజీ, వసతులపరంగా హైదరాబాద్ తరహాలో వీటిని నిర్మించాలని, అప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చునని పోలీసు అధికారులు చెప్తున్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తరహాలో.. బీసీ కళాశాలలు

- బీసీ విద్య, ఉద్యోగ శిక్షణలపై చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల విద్యా ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బీసీ సంక్షేమశాఖ నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగానే సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ తరహాలో బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో విద్యాబోధనను కొనసాగించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందుకుగాను మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ పరిధిలో 19 జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులను వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. 19 బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 12 బాలుర, 7 బాలికల కళాశాలలున్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. ప్రతి కళాశాలలో 320 మంది విద్యార్థులకు చేర్చుకుని వారిని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అర్హత పరీక్ష ద్వారా బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్చుకుని, అందులో ఉత్తమ ప్రతిభను కనబరిచే విద్యార్థులను ఎంపికచేసి ప్రత్యేకశిక్షణ నిర్వహిస్తున్నారు. ఐఐటీ, నీట్, ఎంసెట్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 386 మందిని ఎంపిక చేశారు. ఇందులో బాలికలు 181, బాలురు 205 మందిని గుర్తించారు. విద్యార్థులకు ఆయా అంశాల్లో ప్రాక్టీస్ కొరకు ట్యాబ్‌లను అందజేస్తారు. పాఠ్యాంశాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకునేందుకు అసైన్‌మెంట్లు నిర్వహిస్తారు. అధునాతన పుస్తకాలతో లైబ్రరీ ఏర్పాటు చేశారు. ప్రతివారం పరీక్షల నిర్వహణ, విద్యార్థుల నైపుణ్యాలను అంచనా వేసి విద్యార్థులస్థాయిని అంచనా వేసి సబ్జెక్టుల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తారు. అంతేకాకుండా బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని స్టడీ సర్కిళ్లలో నిరుద్యోగులకు ఆయా ఉద్యోగార్హత పరీక్షలకోసం శిక్షణ ఇస్తున్నారు. వీటితోపాటు వృత్తినైపుణ్య శిక్షణలు ఇచ్చి ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారు.

విద్యతోనే బీసీల ప్రగతి

రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి సాధించేందుకు విద్యకు ప్రాధాన్యమిస్తున్నట్టు బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న తెలిపారు. అందులో భాగంగానే సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ విధానంతో బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం మరిన్ని గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



■ 1 నుంచి 21వరకు నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్ ద్వితీయసంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి నిర్వహించనున్న ప్రాక్టికల్స్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. ఫిబ్రవరి 21 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం డౌన్‌లోడ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్షకు 30 నిమిషాల ముందు ఎగ్జామినర్ మొబైల్‌కు వచ్చే పాస్‌వర్డ్ ఆధారంగా ప్రాక్టికల్స్ ప్రశ్నాపత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. రోజువారీగా పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్‌లైన్ విధానం ద్వారా ఇంటర్‌బోర్డు సైట్‌లో విద్యార్థుల మార్కులను అప్‌లోడ్ చేయాలి. గత ఏడాది నుంచి ఈ విధానం అమలుచేస్తున్నామని, దీనివల్ల ప్రాక్టికల్స్‌లో మాల్ ప్రాక్టీస్, ఇతర అక్రమాలకు ఆస్కారం ఉండదని బోర్డు సెక్రటరీ తెలిపారు. మొత్తం నాలుగు దశల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. 3,33,480 మంది ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవుతారని, 6,410మంది ఎగ్జామినర్లను నియమించినట్టు చెప్పారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 40,365 మంది మొదటి సంవత్సరం, 34,584 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్ష హాజరవుతున్నారని అశోక్ తెలిపారు. ప్రాక్టికల్స్ హాల్‌టికెట్స్‌ను పంపిణీ చేశామన్నారు. ఇంటర్‌ఫస్టియర్ విద్యార్థులకు పర్యావరణవిద్య పరీక్షను సోమవారం నిర్వహించామని తెలిపారు.



సోమవారం జూబ్లీహిల్స్ వెంకటగిరిలోని తాహెర్ సినీ సర్వీసెస్ 40వ వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, సినీనటులు మోహన్‌బాబు, నాగార్జున, ఎమ్మెల్యే గోపీనాథ్, సంస్థ అధినేత తలు తాహెర్, జావీద్

ఇంజినీరింగ్ కాలేజీ దరఖాస్తులకు గడువు 31

■ వచ్చేనెల నోటిఫికేషన్ విడుదల చేయనున్న జేఎన్‌టీయూహెచ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు 2018-19 విద్యాసంవత్సరం కోసం ఏఐసీటీఈ నుంచి అనుమతులు పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 31తో ముగియనున్నది. గడువు తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులను స్వీకరించే అవకాశం లేకపోవడంతో కాలేజీలన్నీ ఆ పనిలో నిమగ్నమయ్యాయి. గతంలో మాదిరిగా కాకుండా 2018-19 సంవత్సరం బుక్‌లెట్‌లో పొందుపరిచిన నిబంధనలను పాటించిన కాలేజీలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఇప్పటికే ఏఐసీటీఈ నిర్ణయించింది. ఏఐసీటీఈ నుంచి అనుమతులు పొందిన ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు తిరిగి అఫిలియేషన్ పొందడానికి ఫిబ్రవరి 10 లోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని జేఎన్‌టీయూహెచ్ అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల సంఖ్య తగ్గుముఖం పట్టింది. నాణ్యమైన విద్య కోసం తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే కేంద్ర ప్రభుత్వం కూడా అమలు పరుస్తున్నదని, దానివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారులు అంటున్నారు. దేశవ్యాప్తంగా 11 లక్షల ఇంజినీరింగ్ సీట్లు ఉండాలని, అంతకంటే ఎక్కువ సీట్లు అవసరం లేదని కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖ తీర్మానించింది. అందుకు అనుగుణంగానే గత మూడేండ్లుగా 30 శాతం కంటే తక్కువ సంఖ్యలో సీట్లు నిండిన కాలేజీలలో 2018-19 విద్యాసంవత్సరాన్ని అనుమతించే ప్రసక్తే లేదని ఏఐసీటీఈ స్పష్టం చేసింది.

విత్తన భాండాగారంగా తీర్చిదిద్దాలి

■ వ్యవసాయ కార్యదర్శి పార్థసారథి



సోమవారం సచివాలయంలో పంటల బీమాపై సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ పనిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల కార్యదర్శి సీ పార్థసారథి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ ఆధునీకరించిన నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సాగు లాభసాటిగా, రైతు నష్టపోకుండా ఉండాలంటే ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనమే పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు, వ్యవసాయశాఖ కమిషనర్ ఎం జగన్మోహన్ పాల్గొన్నారు.

గత ఏడాది మాదిరిగానే పంటల బీమా..: గత ఏడాది మాదిరిగానే 2018-వానకాలం సీజన్ పంటలకు కూడా పంటల బీమా పథకం అమలుచేయాలని రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ నిర్ణయించింది. సోమవారం సచివాలయంలో వ్యవసాయ కార్యదర్శి సీ పార్థసారథి అధ్యక్షతన పంటల బీమాపై కమిటీ సమావేశమైంది. 2018 వానకాలం సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, సవరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా రెండింటికి ఉమ్మడిగానే నోటిఫికేషన్ జారీచేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో వ్యవసాయ,ఉద్యానశాఖ కమిషనర్లు ఎం జగన్‌మోహన్, ఎల్ వెంకట్రామ్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ షుగర్స్ భద్రు మాలోత్, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కోటాను 1.50 లక్షల టన్నులకు పెంచండి

కనీస మద్దతు పథకం కింద కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ ద్వారా కందుల కొనుగోలు కోటాను పెంచి, వేరుశనగ కొనుగోలుకు నోడల్ ఏజెన్సీని ఎంపిక చేయాలని వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి కేంద్ర వ్యవసాయశాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం మంగళవారం ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయశాఖ సెక్రటరీని కలువనున్నట్టు పార్థసారథి వెల్లడించారు.

బెజవాడ భూ కుంభకోణంపై
ఏపీ సీఎం బాబు సీరియస్

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: బెజవాడలో వెలుగుచూసిన భారీ భూ కుంభకోణంపై ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సీరియస్ అయ్యారు. అమరావతిలో సోమవారం ఆయన పోలీసు ఉన్నతాధికారులతో ఈ అంశంపై చర్చించారు. భూ కుంభకోణంపై సీఐడీ ప్రాథమిక నివేదిక, డాక్యుమెంట్లు, ఎఫ్ఐఆర్ కాపీలు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ కుంభకోణంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు పాత్రను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి కార్యకలాపాలవల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని, అంతకు ముందు జరిగిన ముఖ్యనేతల సమావేశంలో చంద్రబాబు పేర్కొనడం గమనార్హం.

గిరిజన విచారణ కమిషన్ పదవీకాలం పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజనుల సమస్యల విచారణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్ పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎస్టీ విచారణ కమిషన్ పదవీకాలం జనవరి 31న ముగియనుండటంతో ఫిబ్రవరి 1 నుంచి మరో ఏడాది పొడిగించారు. ఎస్టీ విచారణ కమిషన్ చైర్మన్‌గా చెల్లప్ప, సభ్యులుగా కే జగన్నాథ్‌రావు, హెచ్‌కే నాగు ఉన్నారు. దీంతో విచారణ కమిషన్ 2019 జనవరి 31 వరకు కొనసాగుతుంది.

ఏపీ ఏసీబీకి చిక్కిన వుడా అదనపు చీఫ్ ప్లానర్

■ ఏపీతోపాటు హైదరాబాద్‌లోనూ సోదాలు

■ బయటపడ్డ దాదాపు రూ.20 కోట్ల అక్రమాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో విశాఖపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వుడా)లో అదనపు చీఫ్ ప్లానర్‌గా పనిచేస్తున్న పీ ప్రదీప్‌కుమార్ ఆస్తులపై ఏపీకి చెందిన ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ప్రదీప్‌కుమార్‌పై కేసు నమోదు చేసిన ఏపీ ఏసీబీ అధికారులు సోమవారం ఏకకాలంలో ఏపీతోపాటు తెలంగాణలోని 12 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. డాక్యుమెంట్ల ప్రకారం ప్రదీప్‌కుమార్ వద్ద రూ.నాలుగు కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని, ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ దాదాపు రూ.20 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రదీప్‌కుమార్ భార్య, తండ్రి, బావమరిది, మామ పేర్లతో కూడా ఆస్తులు బయటపడ్డాయి. దీంతో ప్రదీప్‌కుమార్‌ను అరెస్టు చేసిన అధికారులు విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

95 కోట్లతో గుడుంబా వ్యాపారులకు ఉపాధి

■ పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక: అకున్ సబర్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గుడుంబా వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఇప్పటివరకు రూ.95.9 కోట్లు ఖర్చు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి, హైదరాబాద్ మినహా మిగతా 8 పాత జిల్లాల్లో 5,768 మంది గుడుంబా వ్యాపారులను గుర్తించి, 4,695 మందికి వివిధ పథకాల కింద రూ. 95.9 కోట్ల మేరకు లబ్ధి చేకూర్చామని తెలిపారు.

కోడిపందేల నిర్వహణపై చర్యలేవి?

● నేతల వివరాలు ఇవ్వాలని ఏపీ పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కోడిపందేల నిర్వహణపై తమ ఆదేశాలను ఉల్లంఘించిన ప్రజాప్రతినిధుల వివరాలు అందించాలని ఏపీ పోలీసులకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. పందేలు నిర్వహించి తీరుతామని టీవీ చానెళ్ల ఎదుట సవాల్‌చేసిన ప్రజాప్రతినిధుల వివరాలు ఇవ్వకుంటే టీవీ ఫుటేజీ తెప్పించుకొని, కోడిపందేల నిర్వహణపై దాఖలైన వ్యాజ్యంలో వారిని ప్రతివాదులుగా చేసి విచారణ చేపడుతామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎమ్మెస్కే జైశ్వాల్‌తో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో 809 మైదానాల్లో కోడిపందేలు నిర్వహించిన వారి పేర్లు, చిరునామాలను కూడా సమర్పించాలని ఆదేశించింది. ఏపీ పోలీసులకు, ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదావేసింది.

పాత నేరస్థుల సమగ్రసర్వే పేరుతో వేధిస్తున్నారని పిటిషన్

తెలంగాణ రాష్ట్రంలో పోలీసులు చేపడుతున్న పాత నేరస్థుల సమగ్రసర్వేను సవాల్‌చేస్తూ ఉమ్మడి హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. నేరస్థుల సమగ్ర సర్వే పేరుతో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పోలీసులు వేధిస్తున్నారని అబ్దుల్ హఫీజ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లలోనూ
తప్పనిసరిగా తెలుగు

అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి: డిప్యూటీ సీఎం కడియం

ఆసక్తికర, మార్కుల స్కోరింగ్ సబ్జెక్టుగా తెలుగులో మార్పులు.. 'తెలుగు తప్పనిసరి అమలు' సబ్ కమిటీ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో కూడా 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే అన్నిపాఠశాలల్లో తెలుగు సబ్జెక్టును అమలుచేయాలని కోరారు. ఆసక్తికరంగా, మార్కుల స్కోరింగ్ సబ్జెక్టుగా తెలుగును తీర్చిదిద్దేలా పాఠ్య ప్రణాళికలను రూపొందించాలని తెలుగుభాష తప్పనిసరి అమలుపై ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ, విద్యాశాఖ అధికారులతో జరిగిన సోమవారం సమీక్షలో కడియం శ్రీహరి సూచించారు. వివిధరాష్ట్రాల్లో మాతృభాషను అమలుచేస్తున్న విధానాలను కడియంకు సబ్‌కమిటీ వివరించింది. 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలుగు సబ్జెక్టును సులభమైన పద్ధతుల్లో నేర్చుకునేలా పాఠ్యప్రణాళికలను రూపొందిస్తున్నట్టు సబ్ కమిటీ తెలిపింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలలు కూడా తెలుగు సబ్జెక్ట్‌ను అమలు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయని కమిటీ పేర్కొన్నది. తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరి నేపథ్యంలో భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేసే అంశంపై అధికారులతో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి చర్చించారు. భాషా పండితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు కడియం తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు జీ కిషన్, తెలుగుభాషా అమలు సబ్‌కమిటీ చైర్మన్, తెలుగు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఇంటర్‌బోర్డు సెక్రటరీ, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి, తెలుగు అకాడమీ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి. చిత్రంలో తెలుగు వర్సిటీ వీసీ సత్యనారాయణ, ఇంటర్‌బోర్డు సెక్రటరీ అశోక్, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ తదితరులు

'జనగామ' ఆరోగ్యసర్వే సక్సెస్!

■ పెద్దపల్లిలోనూ మొదలు

■ ప్రభుత్వం మదిలో రాష్ట్రవ్యాప్త సర్వే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జనగామ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన ఆరోగ్యసర్వే విజయవంతమైంది. జనగామ జిల్లాలో కలెక్టర్‌గా ఉండి సర్వేచేయించిన ఐఏఎస్ అధికారిణి దేవసేన, తాజాగా పెద్దపల్లి జిల్లాలో కూడా ఈ సర్వే చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్త ఆరోగ్యసర్వే చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది.

జనగామతో మొదలు..

అనారోగ్యంతో బాధపడుతున్నామని ప్రజావాణిలో జనగామ జిల్లా కలెక్టర్‌కు పెద్ద సంఖ్యలో వినతిపత్రాలు వచ్చాయి. ఈ విషయాన్ని అప్పటి కలెక్టర్ దేవసేన కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చారు. దీంతో సమగ్ర ఆరోగ్య సర్వే చేయించాలని సీఎం ఆదేశించారు. ఆ మేరకు వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ దేవసేనకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. 2017లో మే నుంచి నవంబర్ వరకు జనగామ జిల్లాలోని 13 మండలాల్లోఉన్న 193 గ్రామాల్లో ఇంటింటి సర్వే జరిగింది. సర్వేలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జనగామ జిల్లాలో 2.50 లక్ష మందిని సర్వే చేసి వారిలో షుగర్, బీపీ, రక్తహీనత,కంటిశుక్లాలు, గుండె జబ్బులు తదితర రోగాలున్న వారు వేల మంది ఉన్నట్లు గుర్తించారు. గర్భాశయంలో పుండ్లు, ఛాతిలో గడ్డలున్న మహిళలు 15 వేల మంది ఉన్నారని తెలిసింది. దాదాపు 8 వేల మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానకు పంపించారు. అక్కడ 150 మందికి క్యాన్సర్ సోకినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇంకా ఎలాంటి ప్రజారోగ్య కార్యక్రమాలు రూపొందించాలన్నదానిపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. రాష్ట్రమంతటా సర్వే చేయించే విషయం ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

సమస్య తీవ్రతను సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చాను..



జనగామ జిల్లా'ప్రజావాణి'లో పెద్దసంఖ్యలో ప్రజలు తమ అనారోగ్యం తెలుపుతూ సాయం కోరారు. సమస్యను సీఎం కేసీఆర్‌కు వివరించగా వెంటనే సర్వే చేయమని చెప్పారు. పెద్దపల్లికి బదిలీ అయ్యాక ఇక్కడ కూడ సర్వే చేయిస్తున్నా..

- పెద్దపల్లి కలెక్టర్ దేవసేన

అన్ని గ్రామాల్లో సర్వే చేశాం..



పైలట్ ప్రాజెక్టు కింద జనగామ జిల్లాలో అన్ని గ్రామాల్లో తిరిగి 2.50 లక్షల మందికి పరీక్షలు చేయించాం. చాలామందికి ఉన్న రోగాలను గుర్తించి వైద్య అందిస్తున్నాం. స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తీసుకుంటున్నాం

- అన్న ప్రసన్న, జనగామ జిల్లా డీఎంహెచ్‌ఓ

పెరిగిన పెద్దపులుల సంచారం

■ తెలంగాణలో తొలిసారి జరిగిన సర్వేలో సిబ్బందికి ప్రత్యక్షంగా కనిపించిన పులులు

■ వందకుపైగా పులుల పాదముద్రలు లభ్యం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: పెద్దపులుల మనుగడపై దేశవ్యాప్తంగా అన్నిప్రాంతాల్లో ఒకేసారి చేపట్టిన సమగ్ర శాస్త్రీయ సర్వే సోమవారం పూర్తయింది. రాష్ట్రంలో పెద్దపులుల సంచారం పెరిగినట్టు ప్రాథమిక పరిశీలనలో తేలింది. ఐదుచోట్ల పెద్దపులులు ప్రత్యక్షంగా కనిపించగా, దాదాపు వందకుపైగా పులుల పాదముద్రలు (పగ్‌మార్క్స్) లభించాయి. గత సర్వే కంటే ఈ సారి లభించిన పాదముద్రలు ఎక్కువని అటవీశాఖ అధికారులు వెల్లడించారు. 'ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్' రాష్ట్రంలో ఈ నెల 22 నుంచి 29 వరకు జరిగింది. సోమవారం నల్లమల పుల్లాయిపల్లి బేస్‌క్యాంప్ వద్ద వాలంటీర్లకు ప్రత్యక్షంగా పెద్దపులి కనిపించిందని పీసీసీఎఫ్ పీకే



ఝా 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. వారంరోజుల పులుల గణనలో నల్లమల అటవీప్రాంతం ఫర్హాబాద్ తూర్పు బీట్ మల్లాపూర్, పుల్లాయిపల్లి కడపరాయి, కాగజ్‌నగర్ ప్రాంతాల్లో పెద్దపులులు కనిపించాయి. ఎలుగుబంట్లు, అడవి కుక్కలు, జింకలు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నట్లు తమ సర్వేలో తేలింది.

ఫిబ్రవరిలో శాస్త్రీయ విశ్లేషణ మొదలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006, 2010, 2014లో సమగ్ర జంతుగణన జరిగింది. అప్పుడు ఒకట్రెండు పెద్దపులులు ప్రత్యక్షంగా కనిపించాయని, ఇంత పెద్ద సంఖ్యలో పాదముద్రలు లభించలేదని వైల్డ్‌లైఫ్ నిపుణులు శంకరన్ తెలిపారు. 2014 జంతుగణనలో కవ్వాల్, నల్లమల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో 18 పెద్దపులులు ఉన్నట్లు కేంద్రం లెక్క తేల్చింది. ప్రస్తుత సర్వేలో గుర్తించిన పులుల పాదముద్రలను డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియాలో శాస్త్రీయంగా పోల్చాక అసలు సంఖ్య తేలనున్నది. వచ్చేనెలలో ఈ విశ్లేషణ మొదలవుతుంది. ఏ ఒక్క పులి పాదాలు మరో పులితో సరిపోలవు. పాదాల గుర్తుల ద్వారా సంఖ్యను కచ్చితంగా తేల్చడానికి ఆస్కారముంది. పులుల గణనలో పాల్గొనడానికి ముందుకొచ్చిన 300 మందికి మంగళవారం అటవీశాఖ అధికారులు సర్టిఫికెట్లు అందజేయనున్నారు. అటవీశాఖ సిబ్బందితోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆరు వేల మంది వరకు పులుల గణనలో పాలుపంచుకున్నారు.



సోమవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్‌కేవీ ఆధ్వర్యంలో వాటర్‌వర్క్స్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, కార్మికవిభాగం అధ్యక్షుడు రాంబాబుయాదవ్

నేడు ఢిల్లీలో పంచాయతీరాజ్ మంత్రుల సమావేశం

■ హాజరుకానున్న మంత్రి జూపల్లి, ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 15వ ఆర్థికసంఘం విధివిధానాల రూపకల్పనపై రాష్ట్రాల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు కేంద్రప్రభుత్వం మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో వర్క్‌షాపును నిర్వహిస్తున్నది. ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రులు, ముఖ్యకార్యదర్శులు పాల్గొంటారు. రాష్ట్రం తరపున హాజరయ్యేందుకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, రాష్ట్ర ఆర్థికసంఘం చైర్మన్ రాజేశంగౌడ్ ఢిల్లీ వెళ్లారు. ప్రస్తుతం ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు విడుదల చేస్తున్నది. దీంతో మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులకు నిధులు లేక నిర్వీర్యంగా మారాయనే అభిప్రాయాన్ని వివిధ రాష్ట్రాలు కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అదేవిధంగా ఆర్థికసంఘం నిధుల వినియోగంపై కేంద్రం విధించిన నిబంధనలతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థికసంఘం నిధుల కేటాయింపులో అనుసరించాల్సిన ప్రాధాన్యతలపై రాష్ట్రం తరపున మంత్రి జూపల్లి పలు సూచనలు చేయనున్నట్టు సమాచారం.

కేశవాపూర్ రిజర్వాయర్ టెండర్లు పూర్తి

■ రూ.4396.16 కోట్లకు పనులను దక్కించుకున్న మెగా సంస్థ

■ హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతిలో తొలిసారిగా భారీ ప్రాజెక్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కేశవాపురం భారీ రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో ముందడుగు పడింది. హైదరాబాద్ మహానగర ప్రజల తాగునీటి అవసరాలకు శాశ్వత వనరుగా మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని కేశవాపురం వద్ద రూ.4396.16 కోట్ల అంచనా వ్యయంతో అతిపెద్ద స్టోరేజ్ రిజర్వాయర్ పనులకు టెండర్ ప్రక్రియ ముగిసింది. కేశవాపూర్‌కు 18 కి.మీ దూరంలో ఉన్న కొండపోచమ్మ సాగర్ (పాములపర్తిసాగర్) నుంచి 10 టీఎంసీల గోదావరి జలాలను ఈ రిజర్వాయర్‌కు తరలించనున్నారు. తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టనున్న భారీ రిజర్వాయర్ పనులకు ఇటీవల జలమండలి టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులకు మూడు ఏజెన్సీలు బిడ్లు దాఖలు చేయగా సాంకేతిక మూల్యాంకనం (టెక్నికల్ క్వాలిఫై)లో మెగా, హైడ్రో ఇంజినీరింగ్ సిండికేట్ సంస్థలు అర్హత సాధించాయి. టెండర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు సోమవారం టెండర్ కమిటీ ఆర్థికబిడ్లు తెరిచింది. ఇందులో 3.45 ఎక్కువ మొత్తంతో కోడ్ చేసి ఎల్-1గా అర్హత సాధించిన మెగా ఇంజినీరింగ్ సంస్థకు ఈ రిజర్వాయర్ నిర్మాణ పనులను కేటాయిస్తూ టెండర్ కమిటీ ఆమోద ముద్రవేసింది.

ఈఆర్వోనెట్‌పై కేంద్ర ఎన్నికల సంఘం శిక్షణ

■ రాష్ట్రం నుంచి 60 మంది అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా ఓటర్లజాబితా మార్పులు, చేర్పులకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం తీసుకురానున్న ఈఆర్వోనెట్‌పై రాష్ట్రాల ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ శిక్షణ తరగతులకు తెలంగాణ నుంచి దాదాపు 60 మంది అధికారులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలిగింపునకు సంబంధించి ఒకే విధానాన్ని తీసుకువచ్చే దిశగా కేంద్ర ఎన్నికల సంఘం ఈఆర్వోనెట్‌ను అమలులోకి తీసుకురానున్నది. శిక్షణ తరగతుల అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా డీఆర్వో శ్యామ్ ప్రసాద్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి చివరి నాటికి ఈఆర్వోనెట్ విధానం అమలు కానున్నదని తెలిపారు. ఈ విధానంతో డూప్లికేట్ కార్డులను అరికట్టమే కాకుండా, దేశంలో పలు రాష్ట్రాలకు ఉపాధి, వలస వెళ్లే వారి ఓటర్ కార్డులో మార్పు చేయవచ్చని శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకే ఓటర్ కార్డు కోసం ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు
ఉమ్మడి సీనియారిటీ వర్తించదు

■ తెలంగాణ గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్స్ అసోసియేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఉమ్మడి సర్వీస్ రూల్స్ ఆధారంగా సీనియారిటీ జాబితాను ఖరారు చేయాలన్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ ప్రతినిధుల వాదనలో వాస్తవం లేదని తెలంగాణ గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్స్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఎస్) అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ అన్నారు. సోమవారం ఎర్రమంజిల్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల మధ్య తలెత్తిన సీనియారిటీ జాబితా వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలని కోరారు.

ఆర్నెల్లు అత్యంత కీలకం

మిషన్ కాకతీయ నాలుగోదశపై నీటిపారుదలశాఖ ప్రత్యేక దృష్టి.. ఇప్పటికే సగానికిపైగా చెరువుల పునరుద్ధరణ పనులకు టెండర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ కాకతీయ నాలుగోదశ పనుల్ని వేగవంతం చేసేందుకు నీటిపారుదలశాఖ ప్రత్యేక కసరత్తు మొదలుపెట్టింది. వర్షాకాలంలోగా సాధ్యమైనంత ఎక్కువ పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించింది. ఆర్నెల్లపాటు అత్యంత కీలకమైన సమయాన్ని (వర్కింగ్ సీజన్) సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో నాలుగోదశ కింద ఎంపిక చేసిన వాటిలో ఇప్పటికే సగానికి పైగా చెరువుల పనులకు అధికారులు టెండర్లు కూడా పిలిచారు. మిషన్ కాకతీయ నాలుగోదశ కింద రాష్ట్రంలోని 30 జిల్లాల పరిధిలో 5401 చెరువుల పునరుద్ధరణ పనుల్ని చేపట్టేందుకు నీటిపారుదలశాఖ నిర్ణయించింది. ఈ చెరువుల పునరుద్ధరణ పనుల వల్ల 3,38,633 ఎకరాల మేర ఆయకట్టుకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలుగనున్నది. జిల్లాలవారీగా ప్రతిపాదనలు, అంచనాలు దాదాపుగా పూర్తయ్యాయి. గత నెలన్నరగా ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వం పాలనాపరమైన అనుమతుల్ని జారీ చేస్తుంది. ఈ క్రమంలో అధికారులు టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో కాంట్రాక్టర్లతో ఒప్పంద ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. చెరువుల పునరుద్ధరణ పనులు చేయాలంటే నీటినిల్వ తక్కువగా ఉన్న సమయంలోనే సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో వర్షాకాలం వచ్చేలోపు పనుల్ని.. ముఖ్యంగా పూడికతీతను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు జిల్లాల అధికారులకు సూచిస్తున్నారు. వర్కింగ్ సీజన్‌ను సద్వినియోగం చేసుకునేందుకుగాను త్వరితగతిన టెండర్లు పూర్తిచేసి, ఒప్పంద ప్రక్రియను ముగించి.. వెంటనే పనుల్ని మొదలుపెట్టాలని ఇప్పటికే మంత్రి హరీశ్‌రావు పలుసార్లు సమీక్షా సమావేశాల్లో అధికారులను ఆదేశించారు. దీంతోపాటు జిల్లాలవారీగా నాలుగోదశ కింద ఎంపికైన చెరువులు, పాలనా అనుమతులు, టెండర్ల ప్రక్రియ, ఒప్పందాలు.. ఇలా అన్ని అంశాలను మంత్రి ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గత కొన్నిరోజులుగా టెండర్ల ప్రక్రియ వేగం అందుకున్నదని, నాలుగో విడుత కింద 5401 చెరువులను ఎంపిక చేయగా సోమవారం నాటికి 2342 చెరువుల పునరుద్ధరణ పనులకు టెండర్లు పిలిచారని వివరించారు. వీటిలో అత్యధికం పూర్తయి, కాంట్రాక్టర్లతో ఒప్పందాలు కూడా జరుగుతున్నాయని చెప్పారు.

మిషన్ కాకతీయ నాలుగో విడుత పురోగతి

బేసిన్	ఎంపిక చేసిన చెరువుల సంఖ్య	ఆయకట్టు	పాలనా అనుమతి పూర్తి	టెండర్లు పిలిచినవి
కృష్ణా	3284	1,63,173.98	1365	1309
గోదావరి	2117	1,75,459.69	1444	1033
మొత్తం	5401	3,38,633.67	2809	2342



19వ హైదరాబాద్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2018లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు.

టాటా స్టీల్ చాలెంజర్ చెస్ విజేత విదిత్



ముంబై: భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీ.. టాటా స్టీల్ చాలెంజర్స్ టోర్నీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫలితంగా వచ్చే ఏడాది జరుగనున్న టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీకి అర్హత సాధించాడు. హోరాహోరీగా సాగిన 13 రౌండ్ల ఈ టోర్నీలో అతను 9 పాయింట్లు సాధించి టాప్‌లో నిలిచాడు. టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన విదిత్ ఐదు విజయాలు, ఎనిమిది డ్రాలు నమోదు చేశాడు. 11వ రౌండ్ వరకు విదిత్‌కు గట్టిపోటి ఇచ్చిన కోర్బోవ్ (ఉక్రెయిన్) చివరి రెండు రౌండ్లలో కేవలం అర పాయింట్‌తో సరిపెట్టుకోగా, విదిత్ ఒకటిన్నర పాయింట్‌తో టైటిల్‌ను సాధించాడు. ఓవరాల్‌గా 5.3 ఎలో పాయింట్లను సాధించిన భారత గ్రాండ్ మాస్టర్.. ఎలో రేటింగ్‌ను 2723కి పెంచుకున్నాడు. దీంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 30వ స్థానానికి చేరుకున్నాడు. 'ఈ విజయం నాకు చాలా ఇచ్చింది. మాస్టర్స్ టోర్నీకి అర్హత సాధించాను. చెస్‌లో మరింత రాణించి రెండేండ్లలో ప్రపంచ చాంపియన్‌షిప్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రపంచంలోని మెరుగైన ప్లేయర్లతో ఆడాల్సిన అవసరం చాలా ఉంది' అని విదిత్ పేర్కొన్నాడు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడలు

దోమకొండ: విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తాచాటాలని సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జ్యోతిబుద్ధ ప్రకాశ్ అన్నారు. జిల్లాలోని దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకుల మైదానంలో సోమవారం మహిళా డిగ్రీ కళాశాలల ద్వితీయ రాష్ట్ర స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జ్యోతిబుద్ధ ప్రకాశ్‌తో పాటు ఎస్సీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతారెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. పోటీల ప్రారంభం సందర్భంగా పాత 10 జిల్లాల పరిధిలోని మహిళా కళాశాలల క్రీడారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఎవరెస్టు శిఖరం అధిరోహించిన మాలావత్‌పూర్ణ జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించింది. కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖోఖో, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహిస్తున్నారు.



సెమీతుమీ

నేడు పాకిస్థాన్‌తో భారత్ సెమీఫైనల్

సూపర్ ఫామ్‌లో పృథ్వీ సేన.. అఫ్రీదితోనే అసలు తంటా

అండర్-19 ప్రపంచకప్



తెల్లవారు జామున 3.00 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో..

దక్షిణాఫ్రికా భారత్ టెస్టు సిరీస్ ముగిసిపోయింది..క్రికెటర్లను కుబేరులుగా మార్చిన ఐపీఎల్ వేలం కూడా అయిపోయింది..ఇప్పుడు మరో క్రికెట్ పండుగ మన ముందుకు రాబోతున్నది..అదే భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్.. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు సరిగా లేకపోవడం వల్ల భారత్‌కు కేవలం ఐసీసీ టోర్నీల్లోనే ఆ జట్టుతో ఆడే అవకాశం వస్తున్నది. ఇప్పుడా చాన్స్ మన అండర్-19 కుర్రాళ్లకు వచ్చింది. అది కూడా కీలకమైన సెమీస్‌లో తలపడాల్సి రావడం..అభిమానుల్లో ఆసక్తిరేపుతున్నది. రెండుసార్లు విజేతగా నిలిచిన పాక్, మూడుసార్లు ట్రోఫీని దక్కించుకున్న భారత్..అమీతుమీ తేల్చుకోనున్నాయి. వరుస విజయాలతో ఊపు మీద ఉన్న యువ భారత్..పాక్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకెళ్లేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకున్నది.

క్రైస్ట్‌చర్చ్:



పృథ్వీషా

అండర్-19 ప్రపంచకప్‌లో అసలుసిసలు పోరుకు తెరలేచింది. నేడు భారత్-పాకిస్థాన్ జట్లు సెమీఫైనల్లో తలపడనున్నాయి. పృథ్వీషా నాయకత్వంలోని యువభారత్ వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నది..మరోవైపు తొలి లీగ్ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్ చేతిలో ఓడిన పాకిస్థాన్ ఆ తర్వాత హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసి సెమీస్‌కు వచ్చింది. ఐపీఎల్ వేలంలో కోట్లు కొల్లగొట్టిన భారత అండర్-19 ఆటగాళ్లపైనే అందరూ దృష్టి పెట్టారు. కెప్టెన్ పృథ్వీషా , మన్‌జ్యోత్, గిల్, నాగర్‌కోటి, మావి, అనుకూల్‌రాయ్, అభిషేక్‌శర్మ ఐపీఎల్ వేలంలో ఫ్రాంచైజీలను ఆకట్టుకుని అత్యధిక ధర పలికారు. ముఖ్యంగా పేస్ బౌలర్లు నాగర్‌కోటి, మావి ఊహించని ధర దక్కించుకున్నారు. ఇందుకు కారణం, వీరిలో ఉన్న అసమాన ప్రతిభే. గత నాలుగు మ్యాచుల్లోనూ ఆకట్టుకున్న యువ పేసర్లు సెమీఫైనల్లోనూ సత్తా చాటితే భారత్‌కు విజయం నల్లేరుమీద నడకే అవుతుంది.

ఇద్దరూ ఇద్దరే..

భారత బ్యాటింగ్ లైనప్‌లో పృథ్వీషా, శుభ్‌మన్ గిల్ కీలక ఆటగాళ్లని చెప్పొచ్చు . ఈ ఇద్దరూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించడంలో దిట్టలు. రంజీ ట్రోఫీలో ఈ ఇద్దరూ శతకాలు మోగించిన విషయం తెలిసిందే. షా..ఆంధ్ర, ఒడిశాపై సెంచరీలు బాదగా.. గిల్ కూడా ఒక సెంచరీ నమోదు చేశాడు. అండర్-19లోనూ వీరు తమ ఫామ్‌ను కొనసాగిస్తూ.. గత మూడు ఇన్నింగ్సుల్లో పృథ్వీషా 94, 57, 40 పరుగులు,.గిల్ 63, 90, 86 పరుగులు చేసి ప్రత్యర్థి పాకిస్థాన్‌కు సవాల్ విసురుతున్నారు. వీరికి తోడు మన్‌జ్యోత్ కల్రా, దేశాయ్, అర్ష్‌దీప్, అభిషేక్ బ్యాటింగ్‌లో సత్తా చాటగలరు.

బలమైన బౌలింగ్ లైనప్

యువ భారత్ బౌలింగ్ లైనప్ సీనియర్ జట్లను సైతం ఖంగుతినిపించగలదు అనడంలో ఎటువంటి సందేహం లేదు. గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బంతులేసే నాగర్‌కోటి (7 వికెట్లు), పరుగులను కట్టడి చేయగల పరేల్, వికెట్ టేకర్‌గా పేరుతెచ్చుకున్న మావి(8 వికెట్లు)..స్పిన్ సంచలనం అనుకూల్ రాయ్(12 వికెట్లు) భారత విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇక బ్యాటింగ్‌లోనూ రాణించగల అభిషేక్..తన స్లో లెఫ్టార్మ్ ఆర్థొడ్రాక్స్ బౌలింగ్‌తో ఇప్పటి వరకు 5 వికెట్లు సాధించి ఫరవాలేదనిపించాడు.

అఫ్రీదితో జాగ్రత్త

పాకిస్థాన్ అండర్-19 జట్టులో అత్యంత కీలక ఆటగాడు షహీన్ అఫ్రీది.17 ఏండ్ల ఈ లెఫ్టార్మ్ పేస్ బౌలర్ గత నాలుగు మ్యాచుల్లోనూ సత్తా చాటాడు. క్వార్టర్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 2 వికెట్లు పడగొట్టిన ఇతడు..అంతకు ముందు ఐర్లండ్‌పై 6 వికెట్లు తీసి అదుర్స్ అనిపించాడు. శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్‌పై ఒక్కో వికెట్ పడగొట్టి ఈ టోర్నీలో తన వికెట్ల సంఖ్యను 11కు పెంచుకున్నాడు. భారత బ్యాట్స్‌మన్ అఫ్రీది బౌలింగ్‌ను తక్కువ అంచనా వేయొద్దని ఇప్పటికే కోచ్ ద్రవిడ్ కుర్రాళ్లకు హెచ్చరికలు కూడా చేశాడు. పాకిస్థాన్ బ్యాటింగ్ విషయానికొస్తే అలీ జర్యాబ్ ఫామ్‌లో ఉన్నాడు. లంకపై 59 పరుగులు చేసిన ఈ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ కీలకమైన క్వార్టర్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 74 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. నజీర్, అలీఖాన్ కూడా పాకిస్థాన్ జట్టులో కీలక ఆటగాళ్లు. భారత్‌తో పోలిస్తే పాకిస్థాన్ కొంచెం బలహీనంగా కనిపిస్తున్నప్పటికీ..తాము ఏ ఒక్క జట్టునూ, ఏ ఒక్క మ్యాచ్‌నూ తేలికగా తీసుకోబోమని ఇప్పటికే కోచ్ ద్రవిడ్ చెప్పిన సంగతి తెలిసిందే. ఇక క్వార్టర్ ఫైనల్లో హెగ్లీ ఓవల్ వేదికపై దక్షిణాఫ్రికాను ఓడించిన పాక్..ఈ మైదానానికి అలవాటు పడటం కొంత సానుకూలాంశం. ఇదే వేదికపై ఇప్పుడు భారత్‌తో సెమీ ఫైనల్లో తలపడుతుండటం ఆ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నది. అయితే వేదిక ఏదైనా, పిచ్ పరిస్థితులు ఎలా ఉన్నా..భారత కుర్రాళ్లు స్థాయికి తగ్గట్టుగా ఆడితే ఫైనల్‌కు చేరుకోవడం ఖాయమని విశ్లేషకులు సైతం చెబుతున్నారు.

8 భారత్,పాకిస్థాన్ అండర్-19 ప్రపంచకప్‌లో ఎదురుపడిన మ్యాచ్‌ల సంఖ్య. పాకిస్థాన్ 4సార్లు విజయాలు సాధించి ఆధిక్యంలో ఉంది.

జట్లు:(అంచనా)

భారత్ అండర్-19: పృథ్వీషా(కెప్టెన్), మన్‌జాట్, గిల్, దేశాయ్, పరాగ్, అభిషేక్, నాగర్‌కోటి, అనుకూల్, మావి, శివసింగ్, పరేల్.

పాకిస్థాన్ అండర్-19: హసన్ ఖాన్ (కెప్టెన్), జైద్ ఆలం, నజీర్, అహ్మద్, అలీ జర్యాబ్, తహా, సాద్‌ఖాన్, ముసా, అఫ్రీది, షఫ్కత్, అర్షద్.



పాక్‌తో అయితేనేమి..



భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై ఎప్పుడూ భారీ అంచనాలు ఉండటం సాధారణమే.ప్రతీ మ్యాచ్‌లాగే పాక్‌తో సెమీఫైనల్ మ్యాచ్‌నూ ఆస్వాదించాలని కుర్రాళ్లకు చెప్పాను. మా సన్నాహకాల్లో ఎటువంటి మార్పులూ జరుగలేదు. గతంలో సీనియర్ టీమ్ ఎన్నోసార్లు పాక్‌పై ఆధిపత్యం చెలాయించింది. ఆ జట్టుతో ఆడుతుంటే పొందే అనుభూతి వేరు. ఇప్పుడు ఆ అవకాశం కుర్రాళ్లకు దక్కడం ఆనందంగా ఉంది. ఇండో-పాక్ మ్యాచ్ ఎలా ఉంటుందో తెలుసుకుంటారు.అయితే పీఎన్‌జీతో అయినా, పాకిస్థాన్‌తో అయినా సరే నాణ్యమైన క్రికెట్ ఆడటమే మా లక్ష్యం. నెట్స్‌లో ఆటగాళ్లు బాగా ప్రాక్టీస్ చేశారు. మ్యాచ్‌కు పూర్తిగా సన్నద్ధమయ్యాం. ఐపీఎల్ వేలంలో కుర్రాళ్లను ఫ్రాంచైజీలు దక్కించుకోవడం మంచి పరిణామమే.

ఫైనల్లో ఆస్ట్రేలియా

అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ సెమీస్‌లో ఆఫ్ఘన్‌పై విజయం



క్రైస్ట్‌చర్చ్: ఆస్ట్రేలియా యువ జట్టు మరో టైటిల్‌పై కన్నేసింది. సోమవారం ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే సెమీఫైనల్ విజేతతో ఆసీస్ వచ్చే నెల 3న టైటిల్ పోరులో తలపడుతుంది. ఆఫ్ఘన్ నిర్దేశించిన 182 పరుగుల లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన కంగారూలు 37.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకున్నారు. ఓపెనర్ జాక్ ఎడ్వర్డ్స్(65 బంతుల్లో 72, 8ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీతో రాణించాడు. తొలుత జొనాథన్ మెర్లో(4/24), ఇవాన్స్(2/26) ధాటికి ఆఫ్ఘనిస్థాన్ 48 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. వికెట్‌కీపర్, బ్యాట్స్‌మెన్ ఇక్రామ్ అలీ(119 బంతుల్లో 80, 8ఫోర్లు) అర్ధసెంచరీతో రాణించగా, మిగతావారు కనీస సహకారం అందించడంలో విఫలయ్యారు.

త్వరలోనే బీసీసీఐ గుర్తింపు: మహంతేష్

బెంగళూరు: రెండోసారి అంధుల ప్రపంచకప్ గెలిచిన నేపథ్యంలో.. తమకు బీసీసీఐ గుర్తింపు లభిస్తుందని భారత అంధుల క్రికెట్ సంఘం (సీఏబీఐ) అధ్యక్షుడు జీ మహంతేష్ ఆశాభావం వ్యక్తం చేశాడు. 'బోర్డు గుర్తింపు వస్తుందనే అనుకుంటున్నాం. అంధ క్రికెటర్ల కష్టాలను తొలిగించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగితే వారం రోజుల్లోనే కల నెరవేరుతుంది' అని మహంతేష్ పేర్కొన్నాడు.

పేస్ @ 47

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సీనియర్ ఆటగాడు లియాండర్ పేస్.. ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపర్చుకున్నాడు. సోమవారం విడుదల చేసిన తాజా జాబితాలో అతను 14 స్థానాలు ఎగబాకి 47వ ర్యాంక్‌లో నిలిచాడు. జేమ్స్ సెరెటని (అమెరికా)తో కలిసి బరిలోకి దిగిన పేస్..



ఇటీవల చాలెంజర్ టైటిల్ (న్యూపోర్ట్ బీచ్ ఈవెంట్)ను గెలువడం కలిసొచ్చింది. విజేతగా నిలిచిన పేస్ జోడీ 125 పాయింట్లను కూడగట్టుకుంది. భారత్‌కే చెందిన రోహన్ బోపన్న ఒక స్థానం దిగజారి 20వ ర్యాంక్‌లో నిలిచాడు. దివిజ్ శరణ్ మూడుస్థానాలు ఎగబాకి 45వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్‌లో ఓడిన సింగిల్స్ ఆటగాడు యుకీ భాంబ్రీ 8 స్థానాలు మెరుగుపర్చుకుని 118వ ర్యాంక్‌ను సాధించాడు. రామ్ కుమార్ 140వ, సుమిత్ నాగల్ 218వ, ప్రజనీష్ గుణేశ్వరన్ 244వ, శ్రీరామ్ బాలాజీ 391వ ర్యాంక్‌ల్లో కొనసాగుతున్నారు.

ఫేవరెట్లుగా సైనా, సింధు

నేటి నుంచి ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్

శ్రీకాంత్‌పై భారీ అంచనాలు



సైనా



సింధు

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీకి రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఈ టోర్నీలో భారత టాప్ షట్లర్లందరూ బరిలోకి దిగుతున్నారు. సైనా నెహ్వాల్, పీవీ సింధు ఫేవరెట్లుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రియో ఒలింపిక్స్ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బందిపడిన సైనా.. దాన్ని అధిగమించినట్లే కనిపిస్తున్నది. ఇండోనేసియా మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలువడమే ఇందుకు నిదర్శనం. నాలుగోసీడ్‌గా బరిలోకి దిగుతున్న సైనా.. తొలి రౌండ్‌లో సోఫీ డాహ్ (డెన్మార్క్)తో తలపడనుంది. క్వార్టర్స్‌లో ఐదోసీడ్ బీవెన్ జాంగ్‌ను ఎదుర్కోవచ్చు. గతేడాది సంచలన ప్రదర్శనతో చెలరేగిన పీవీ సింధు.. నటాలియా రోడే (డెన్మార్క్)తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. క్వార్టర్‌ఫైనల్ వరకు సులువైన డ్రానే ఉన్నా.. సెమీస్‌లో మాత్రం మాజీ ప్రపంచ చాంపియన్ రచ్చనోక్ ఇంతనోన్‌తో కఠిన పరీక్ష ఎదురుకానుంది. అన్ని అనుకునట్లుగా సాగితే.. ఫైనల్లోనే సింధు, సైనా తలపడే అవకాశాలు కనబడుతున్నాయి.

శ్రీకాంత్‌పైనే దృష్టి

గత సీజన్‌లో నాలుగు టైటిల్స్ నెగ్గి సంచలనం సృష్టించిన కిడాంబి శ్రీకాంత్‌పై ఈసారి భారీ అంచనాలు నెలకొన్నాయి. కాలి గాయంతో చైనా ఓపెన్, హాంకాంగ్ ఓపెన్‌కు దూరంగా ఉన్న అతను దుబాయ్ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో సత్తా చాటలేకపోయాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకునేందుకు ఈనెలలో జరిగిన ఇండోనేసియా మాస్టర్స్‌కూ దూరంగా ఉన్నాడు. 2014లో విజేతగా నిలిచిన శ్రీకాంత్.. శుభారంభంతో సీజన్‌ను మొదలుపెట్టాలని భావిస్తున్నాడు. లీ చియుక్ యూ (హాంకాంగ్)తో జరిగే మ్యాచ్‌తో అతను టోర్నీని మొదలుపెట్టనున్నాడు. ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ శ్రీకాంత్ గెలిస్తే.. ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్‌తో తలపడే అవకాశాలున్నాయి. సాయి ప్రణీత్, హెచ్ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్, అజయ్ జయరామ్, సౌరభ్ వర్మ, సమీర్ వర్మ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు.

డబ్బుకోసం ఆడలేదు

ప్రకాశ్ పదుకోన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



న్యూఢిల్లీ: దేశ బ్యాడ్మింటన్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా దిగ్గజ షట్లర్ ప్రకాశ్ పదుకోన్‌ను భారత బ్యాడ్మింటన్ సమాఖ్య(బాయ్) లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది. పలువురు ప్రముఖులు, కుటుంబసభ్యులు పాల్గొన్న కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు చేతుల మీదుగా ప్రకాశ్ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ స్థాయికి చేరుకోవడానికి సహకరించిన బాయ్, కర్ణాటక బ్యాడ్మింటన్ అసోసియేషన్, కుటుంబసభ్యులు, స్నేహితులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ అవార్డును అందరితో కలిసి పంచుకోవాలనుకుంటున్నాను. ఆటపై ప్రేమతో ఆడాను తప్పా..డబ్బు, అవార్డులు, రివార్డులు ఎప్పుడు ఆలోచించలేదు. దేశంలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధిని చూస్తే చాలా సంతోషంగా ఉంది' అని ప్రకాశ్ అన్నారు.

నలుగురికి పతకాలు ఖాయం

ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీ



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ల పంచ్ అదిరింది. పురుషుల, మహిళల విభాగాల్లో కలిపి నలుగురు బాక్సర్లు పతకాలు ఖాయం చేసుకున్నారు. సోమవారం జరిగిన 91 కేజీల బౌట్‌లో సుమిత్ సాంగ్వాన్ 5-0తో వీరేందర్ కుమార్‌పై గెలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లాడు. వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన నమన్ తన్వర్.. 91 కేజీల బౌట్‌లో ఎసాషిస్ హుస్సేన్ (జోర్డాన్)ను ఓడించి సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు. తన్వర్ సీనియర్ సర్క్యూట్‌లో ఆడటం ఇదే మొదటిసారి అయినా అద్భుతమైన పంచ్‌లతో ఆకట్టుకున్నాడు. 60 కేజీల బౌట్‌లో మూడుసార్లు ఆసియా పతక విజేత శివ తాపా.. డోర్జి వాంగిడి (భూటాన్)పై గెలిచి క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టాడు. ఇదే విభాగంలో జాతీయ చాంపియన్ మనీష్ కౌశిక్.. రాబి ఆర్మాండో మార్టినేజ్ (క్యూబా)ను ఓడించాడు. ఆసియా కాంస్య పతక విజేత అమిత్ పంగల్‌కు.. రామిష్ రాహమని (ఆఫ్ఘనిస్థాన్) వాకోవర్ ఇచ్చాడు. 49 కేజీల విభాగంలో కే శ్యామ్ కుమార్ 5-0తో నీరజ్ స్వామిపై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. మరోవైపు 49 కేజీల బౌట్‌లో ప్రపంచ యూత్ చాంపియన్ సచిన్ సివాచ్.. థాని నార్నిరామ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

జరీన్ ఓటమి

మహిళల విభాగంలో హైదరాబాద్ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీ) ఓటమిపాలైంది. జర్గాలన్ ఓచిర్‌బాట్‌తో జరిగిన ఈ బౌట్‌లో జరీన్ 2-3తో పరాజయం చవిచూసింది. 51 కేజీల బౌట్‌లో టాప్‌సీడ్ సర్జుబాల దేవి 5-0తో క్రిస్టియన్ ఒంగారే (కెన్యా)పై గెలువగా, పింకీ జాంగ్రా 5-0తో అల్ మిహిల్ (జోర్డాన్)ను ఓడించి సెమీస్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నారు. 69 కేజీల కేటగిరీలో పూజ నేరుగా సెమీస్‌లోకి ప్రవేశించి పతకాన్ని ఖాయం చేసుకుంది.

4-2తో గెలిస్తే టాప్‌లోకి భారత్

దుబాయ్: దక్షిణాఫ్రికాతో ఆరు వన్డేల సిరీస్‌ను 4-2తో గెలిస్తే దక్షిణాఫ్రికా(121)ను వెనుకకు నెడుతూ భారత్(119) నంబర్‌వన్ ర్యాంక్‌లోకి చేరుకుంటుంది. ఒక వేళ సిరీస్‌ను దక్షిణాఫ్రికా 5-1 లేదా క్లీన్‌స్వీప్ చేస్తే గెలిస్తే.. ఇంగ్లండ్(116) కంటే స్వల్ప పాయింట్ల తేడాతో నాలుగో ర్యాంక్‌కు పడిపోతుంది. ఐదు వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్‌కు చేజార్చుకున్న ఆస్ట్రేలియా(112) ఐదో ర్యాంక్‌కు పడిపోయింది. పాకిస్థాన్‌పై క్లీన్‌స్వీప్ విజయంతో న్యూజిలాండ్(115) నాలుగో ర్యాంక్‌లో నిలిచింది. వ్యక్తిగత ర్యాంక్‌ల విషయానికొస్తే టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ(876) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, డివిలీయర్స్(872) రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

రష్యాపై సస్పెన్షన్ వేటు

బాన్: డోపింగ్ కళంకంతో తీవ్ర ఇబ్బందులుపడుతున్న రష్యాకు మరో ఎదురుదెబ్బ. మార్చిలో జరుగనున్న పారాలింపిక్స్ వింటర్ గేమ్స్‌లో పాల్గొనకుండా రష్యాపై సస్పెన్షన్ వేటు వేసింది. అయితే వ్యక్తిగతంగా ఈ పోటీల్లో పాల్గొనే అథ్లెట్లకు మినహాయింపు ఇచ్చింది. వీళ్లు తటస్థ పతాకం కింద బరిలోకి దిగేందుకు అనుమతి ఇచ్చింది. డోపింగ్ ఉదంతం బయటకు రావడంతో 2016లోనే రష్యాపై ఐపీసీ సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే. 'రష్యా పారాలింపిక్ కమిటీ (ఆర్‌పీసీ)పై సస్పెన్షన్ కొనసాగుతుంది. కొన్ని కఠినమైన నిబంధనల మేరకు వ్యక్తిగతంగా ఈ పోటీల్లో పాల్గొనాలకునే రష్యన్ అథ్లెట్లకు అవకాశం ఇస్తున్నాం' అని సోమవారం అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ) నిర్ణయించింది.



మహాశివరాత్రి జాతర పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ, నమస్తే తెలంగాణ: ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు జరిగే మహా శివరాత్రి జాతర పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. మహాశివరాత్రి జాతరను వైభవంగా నిర్వహించాలని మంత్రి సూచించారు.



రాజన్న క్షేత్రం.. భక్త జనసంద్రం

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి సన్నిధి సోమవారం జనసంద్రమైంది. ఆలయ పరిసరాలు, పురవీధులు, గర్భాలయంతోపాటు క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. 50 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని, కోడెమొక్కుకు మరో రెండు గంటలు పట్టిందని భక్తులు పేర్కొన్నారు. ఆలయానికి సుమారు రూ.19 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. వేములవాడ రాజన్నకు లక్షకొండు మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అభిషేకపూజలను ఘనంగా నిర్వహించారు.

ఇష్టఝురి.. శబ్ద డోలి

- సమ్మక్కకు ఇదే ఇష్ట నైవేద్యం



డోలి వాయిస్తున్న డోలివాళ్లు

జయశంకర్ జిల్లా ప్రతినిధి/ములుగు, నమస్తే తెలంగాణ: ఇష్టఝురి... శబ్దడోలి. కంకవనంలో మోగుతున్న కడగొట్టు వాయిద్యం. సమ్మక్క తల్లికి ఇదే ఇష్ట నైవేద్యం. బతుకు.. చావు సంబరం ఏదైనా డోలి మోగాల్సిందే. కోయజాతి ప్రజల జీవితంతో మమేకమైన డోలి ఒకప్పుడు వనమంతా మార్మోగించి తుడుం మోతై చైతన్య శంఖారావానికి ప్రతీకగా నిలిచింది. డోలి శబ్దం లేనిదే 'తల్లి'కి పూనకం రాదు. తల్లి ఆదేశించనిదే డోలి మోగదు. నుదురు గులు రావు. మేడారం మహాజాతరలో భక్తులు సమ్మక్క సారలమ్మల ఆగమనం కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తారు. సమ్మక్కసారలమ్మల పూజారులు తల్లులను గద్దెలపైకి తీసుకురావటం మహా అద్భుత ఘట్టాలను ఆవిష్కరిస్తాయి. మొత్తం మేడారం జాతరకు ఈ రెండు ఘట్టాలే ప్రధానం. పూర్వం సమ్మక్క తల్లుల ఆగమనానికి సూచికగా డోలు కొమ్ము వాయిద్యాలను మాత్రమే ఆదివాసీ గిరిజనులు వినియోగించేవారు. ఆధునిక కాలంలో ప్రభుత్వం ప్రస్తుతం అధికారికంగా ఏకే 47 తుపాకీతో తూటాను పేల్చి తల్లి గుట్ట దిగుతున్నట్టు భక్తులకు సంకేతం అందిస్తుంది. కానీ ఒకప్పుడు తుడుం మోగితేనే తల్లి వస్తున్నట్టు సంకేతం. ఇలా ప్రతీ చోట డోలి నిలిచింది. డోలి మొత్తం మానవ జీవన ప్రమాణ క్రమంలో మమేకమై ఉంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, గోదావరి లోయ పరీవాహక ప్రాంతంలో పూర్వం నుంచి అడవి, కొండ గుట్టలు, క్రూర మృగాలు, వాగు వంకలు, పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కోయ తెగలోని ఆఖరి తెగ ఈ డోలివాళ్లు. వీళ్ల లేనిదే కోయల ఇళ్లలో ఏ సంబరం (పండుగ, జాతర) జరుగదు. చావులోనూ డోలోళ్ల డోలి మోగాల్సిందే. మానవ పరిణామ క్రమంలో ఆహార సేకరణ దశ నుంచి ఆహార ఉత్పత్తి దశకు ఎదిగిన తరుణంలో ఇప్పటికీ బాహ్య ప్రపంచంతో సంబంధం లేని గిరిజన గూడెలు ఉన్నాయి. వీటిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం సరిహద్దులో ఉన్న గొల్లగూడెం డోలి వృత్తి కొనసాగుతున్నది.



పట్టువస్త్రాలతో శ్రీశైలం ఆలయంలోకి వెళ్తున్న నిజామాబాద్ ఎంపీ కవిత దంపతులు. చిత్రంలో ఎమ్మెల్యే బాలరాజు దంపతులు కూడా ఉన్నారు

శైవ క్షేత్రాల అభివృద్ధికి 100 కోట్లు

- నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత
- శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ఎంపీ కవిత దంపతులు

అచ్చంపేట, నమస్తే తెలంగాణ: శ్రీశైలం వెళ్లేదారిలో సహజ సిద్ధమైన జలపాతాలతో అలరిస్తూ అందు కుంటున్న అద్భుతమైన క్షేత్రం మల్లెలతీర్థమని.. లింగమయ్య ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఎంపీ కవిత దంపతులు శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు వెళుతున్న సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎంపీ కవితకు డిండి కట్టమైసమ్మ వద్ద స్వాగతం పలికారు. కట్ట మైసమ్మకు ఎంపీ పూజలు చేశారు. అక్కడి నుంచి కార్యకర్తలు బైక్ ర్యాలీ గుండా మన్ననూర్‌కు చేరుకున్నారు. మన్ననూర్ సమీపంలోని శివాలయాన్ని దర్శించుకొని పూజలు చేసి అనంతరం మల్లెల తీర్థాన్ని సందర్శించారు. 350 మెట్ల గుండా లోయలోకి దిగి పైనుంచి జాలువారే జలపాతాన్ని ఆస్వాదించారు. అక్కడే ఉన్న లింగమయ్యను దర్శించుకున్నారు. స్వామివారికి కవిత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఎంపీ కవిత విలేకరులతో మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల క్షేత్రం నుంచి మల్లెలతీర్థం, ఉమామహేశ్వరం వరకు ఉన్న క్షేత్రాల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం ఏపీలోని శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాల అమలు



ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఉప్పెర్లెడ్డిగూడెంలో చెక్‌డ్యాం మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

తిరుమలాయపాలెం: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింప చేస్తున్నట్టు రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం హైదర్‌సాయిపేటలో సోమవారం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, ఉప్పెర్లెడ్డిగూడెంలో మిషన్‌కాకతీయ-4 పథకం కింద రూ.46 లక్షల వ్యయంతో ఆగిన చెక్‌డ్యాం మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి విస్తృతంగా సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. శ్రీభక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపుతామన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత పాల్గొన్నారు.

మేడారానికి పయనమైన పగిడిద్ద రాజు

- గుండాల నుంచి మహాజాతరకు
- పూనుగొండ్ల నుంచి నేడు..



కొత్తగూడెం జిల్లా గుండాల నుంచి గిరిజన సంప్రదాయ నృత్యాలతో పగిడిద్ద రాజును మేడారానికి తీసుకెళ్తున్న భక్తులు

గుండాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడారంలో జరిగే సమ్మక్క-సారక్క జాతరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలానికి అవినాభావ సంబంధం ఉంది. సమ్మక్క భర్త పగిడిద్ద రాజు యాపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయులకు చెందిన వారు కావడంతో ఇక్కడి అరెం వంశీయులు ప్రతి జాతరకు ఇక్కడి నుంచి పగిడిద్ద రాజును మూడు రోజులుగా కాలి నడకన డోలీల చప్పుళ్లతో మేడారం తీసుకెళ్లి గిరిజన సంప్రదాయం ప్రకారం అక్కడ ఎదుర్కోళ్లు నిర్వహించి పగిడిద్దరాజు-సమ్మక్కకు వివాహం జరుపుతారు. అనంతరం నానగవెల్లి జాతరను నిర్వహించి వన దేవతలకు మొక్కులను చెల్లించుకుంటారు. పెళ్లికొడుకు పగిడిద్ద రాజును సమీప బర్లగుట్టపై నుంచి ఉదయం గుడికి తరలించారు. అక్కడి నుంచి మేడారం చేరుకుంటారు.

నేడు పూనుగొండ్ల నుంచి..

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మేడారం సమ్మక్కను చేరుకునేందుకు ఆమె భర్త పగిడిద్ద రాజు మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి బయలుదేరనున్నారు. పూనుగొండ్ల నుంచి 70 కిలోమీటర్ల మేర అటవీ మార్గం గుండా పాదయాత్రగా మేడారానికి తరలివెళ్తారు. ఇందుకోసం పూనుగొండ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తాత ముత్తాతల నుంచి గిరిజనులు వారి సంస్కృతి, సంప్రదాయాలతో పగిడిద్దరాజుకు పూజలు చేసి పడిగె (పగిడిద్దరాజు)ని పడిగె రూపంలో తయారుచేసుకొని గ్రామంలోని పెద్దలు, పూజారులు, వడ్డెలు కలిసి మేడారానికి చేరుకుంటారు.



మేడారానికి పోటెత్తిన భక్తజనం

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: సమ్మక్కసారలమ్మ దర్శనం కోసం సోమవారం మేడారానికి భక్తులు పోటెత్తారు. సుమారు 1.50 లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. కొందరు ప్రముఖులు కూడా అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం సమ్మక్కసారలమ్మ మహాజాతర ప్రారంభం కానున్నది. ముందెన్నడూ లేని రీతిలో ముందస్తు మొక్కుల కోసం భక్తులు భారీ సంఖ్యలో మేడారానికి తరలివస్తున్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ఆర్టీసీ అధికారులు మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ప్రైవేటు వాహనాల ద్వారా మేడారం వచ్చే భక్తులకు అధికారులు వన్‌వే విధానాన్ని అమలు చేస్తున్నారు. హైదరాబాద్-భూపాలపట్నం 163వ నంబర్ జాతీయ రహదారిలో గోవిందరావుపేట మండలం పస్రా నుంచి నార్లాపూర్ రూట్‌లో మేడారం వస్తున్న ప్రైవేటు వాహనాలను తిరుగు ప్రయాణంలో నార్లాపూర్ నుంచి బయ్యక్కపేట, దూదేకులపల్లి మీదుగా సిరిగొండ-ఆత్మకూరు 363వ నంబర్ జాతీయ రహదారి ద్వారా పంపుతున్నారు. రాత్రివేళ కూడా భక్తులు మేడారం వస్తుండటంతో సమ్మక్కసారలమ్మ దర్శనం నిరంతరం కొనసాగుతున్నది. భక్తులు పెద్దసంఖ్యలో విడిది చేయటం వల్ల మేడారం పరిసరాల్లో పోలీసులు బందోబస్తు విస్తృతం చేశారు. రద్దీ పెరగడంతో సోమవారం భక్తులను క్యూలైన్ల ద్వారా అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలోకి పంపారు.

సమ్మక్క సాంతూరులో ఆలయ నిర్మాణం

జగిత్యాల రూరల్: సమ్మక్క సాంతూరైన జగిత్యాల మండలం పొలాస గ్రామంలో నర్సింహస్వామి గుట్టపై సమ్మక్క, సారలమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ చిర్ర నరేశ్‌తోపాటు స్థానికులు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సింహస్వామి గుట్టపై ఆలయ నిర్మాణంతో పాటు సమ్మక్క సారలమ్మ గద్దెలను ఏర్పాటు చేస్తామన్నారు.



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్. ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్. పుదుచ్చేరి మంత్రి మల్లాది కృష్ణారావు. వాగులో భక్తుల పుణ్యస్నానాలు




యాదాద్రిలో ఆలయ విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు

యాదాద్రిలో దసరా తర్వాత దర్శనాలు

ప్రధానాలయం పనులు మే నాటికి పూర్తి: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: యాదాద్రీశుని ప్రధానాలయం దర్శనాలు దసరా తరువాత ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నట్టు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మంత్రి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసి.. కొండపైన జరుగుతున్న ఆలయ విస్తరణ పనులను పరిశీలించారు. ఏప్రిల్, మే నెలలోపు యాదాద్రి ప్రధానాలయం పనులు పూర్తవుతాయని తెలిపారు. అనంతరం హరిత కాటేజీ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈవో గీతతో కలిసి ఆలయ అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షించారు. యాదగిరిగుట్టలో ఇండియన్ బ్యాంక్ యాదాద్రి శాఖను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మర్రి జనార్దన్‌రెడ్డి

ప్రమాణాలు చేద్దాం రా..

నాగంకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సవాల్

నాగర్‌కర్నూల్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: పనికి ఆహారపథకంలో పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించి బియ్యందొంగగా పేరు తెచ్చుకున్న నాగం జనార్దన్‌రెడ్డికి తనను విమర్శించే నైతికహక్కు లేదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. ఫిబ్రవరి ఒకటిన ఉమామహేశ్వరుడి సన్నిధికి వచ్చి వాస్తవాలు చెప్పి ప్రమాణం చేద్దామని, అందుకు తాను సిద్ధమన్నారు. ధైర్యముంటే సవాల్‌కు సిద్ధపడాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని డీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడారు.

గులాబీ పార్టీలో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. సోమవారం కూడా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల నాయకులు భారీగా చేరారు. ఆదిలాబాద్ రిమ్స్ నాన్‌టీచింగ్ స్టాఫ్ సుమారు 200 మంది టీఆర్ఎస్‌లో చేరారు. వీరిని మంత్రి జోగు రామన్న పార్టీలోకి ఆహ్వానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో వివిధపార్టీలకు చెందిన నాయకులు దాదాపు 100 మంది మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీడీపీ, కాంగ్రెస్ నాయకులు 50 మంది గులాబీ గూటికి చేరారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు వంద కుటుంబాల వారు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలానికి చెందిన 300 మంది గిరిజనులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో సుమారు 100 మంది వివిధ పార్టీల కార్యకర్తలు టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్, హుజూర్‌నగర్ పార్టీ ఇంచార్జి కాసోజు శంకరమ్మ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో టీడీపీ, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 100 కార్యకర్తలు ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 50 మంది నియోజకవర్గ ఇంచార్జి కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



ఆదిలాబాద్ రిమ్స్ అవుట్ సోర్సింగ్ కార్మికులను టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జోగు రామన్న



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న ముస్లింలు

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	35.1	6.9
కామారెడ్డి	33.1	9.1
ఆదిలాబాద్	35.2	9.6
నిర్మల్	35.8	10.1
రాజన్న సిరిసిల్ల	34.6	10.7
నిజామాబాద్	35.9	10.8
సంగారెడ్డి	33.3	11.0
జయశంకర్ భూపాలపల్లి	34.9	11.0
సిద్దిపేట	33.3	11.2
మంచిర్యాల	34.6	11.2
జగిత్యాల	34.8	11.5
మహబూబ్‌నగర్	35.8	11.5
రంగారెడ్డి	32.8	11.7
పెద్దపల్లి	35.0	11.8
భద్రాద్రి కొత్తగూడెం	34.7	11.9
మహబూబాబాద్	35.7	12.1
నాగర్‌కర్నూల్	33.4	12.4
మేడ్చల్	34.6	12.4
కరీంనగర్	35.7	12.4
వికారాబాద్	34.6	12.7
మెదక్	34.6	12.8
వరంగల్ రూరల్	34.6	13.3
యాదాద్రి భువనగిరి	34.9	13.7
నల్లగొండ	35.3	14.0
వరంగల్ అర్బన్	33.9	14.2
జనగామ	34.9	14.3
జోగుళాంబ గద్వాల	32.9	15.0
వనపర్తి	32.9	15.0
ఖమ్మం	34.7	15.4
హైదరాబాద్	34.6	15.7
సూర్యాపేట	34.8	16.6

పంట నష్టపరిహారం విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా మోమిన్‌పేటకు చెందిన అంజిరెడ్డి అనే రైతును ప్రభుత్వం ఆదుకున్నది. 2015 ఫిబ్రవరిలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ రైతుకు చెందిన 5 ఎకరాల మక్కజొన్న పంట కాలిపోయింది. నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకోగా పరిశీలించిన ప్రభుత్వం రూ.16,666 మంజూరు చేసింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణశాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొడంగల్ అభివృద్ధికి 7.67 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధి కింద 74 పనులకు రూ.7.67కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నల్లగొండలో దారుణహత్య

వ్యక్తిని హత్యచేసి తల, మొండెం వేరు చేసిన దుండగులు

నల్లగొండ, నమస్తే తెలంగాణ: నల్లగొండలో మరో హత్య జరిగింది. ఓ వ్యక్తిని దుండగులు హత్యచేసి అతడి తల, మొండాన్ని వేరు చేసి వాటిని వేర్వేరు ప్రాంతాల్లో పడేశారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలు.. నల్లగొండ జిల్లా కనగల్‌కు చెందిన పాలకూరి ట్రాక్టర్ డ్రైవర్ రమేశ్(30)ను ఆదివారం రాత్రి దుండగులు హత్యచేసి తలను బొట్టుగూడ కూరగాయల మార్కెట్ వెనుక భాగాన, ఉన్న ఈద్గా జెండా దిమ్మెపై, మొండెంను భారత్ గ్యాస్ ఏజెన్సీ సమీపంలోని రివైవల్ బైబిల్ చర్చి వెనుక చెట్లపొదల్లో పడేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. రమేశ్ భార్య అనిత గతంలో రామకృష్ణ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని అతడితో వెళ్లిపోయింది. ఏడాది క్రితం పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి అనితను భర్త దగ్గరకు తీసుకొచ్చారు. అప్పటి నుంచి రామకృష్ణ కక్ష పెంచుకొని ఈ హత్యచేశాడని అనిత ఆరోపించింది. డీఎస్పీ సుధాకర్ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు.

కలెక్టర్ చాంబర్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

సూర్యాపేట, నమస్తే తెలంగాణ: కలెక్టర్ ఎదుట ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన సూర్యాపేట కలెక్టరేట్‌లో సోమవారం చోటుచేసుకున్నది. ఇమాంపేట ఆదర్శపాఠశాలలో కేర్‌టేకర్‌గా పనిచేస్తున్న రూప్‌సింగ్ తనను ప్రిన్సిపాల్ వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టర్ సురేంద్రమోహన్ తన చాంబర్‌లో సందర్శకులతో మాట్లాడుతున్న సమయంలో రూప్సిరాణి లోపలికి వెళ్లింది. అనంతరం తనతో పాటు తెచ్చుకున్న బంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యా యత్నించింది. అటెండర్, గన్‌మెన్ ఆమెను అడ్డుకున్నారు. రూప్సిరాణిని పోలీసులు అరెస్ట్ చేసి కేసునమోదు చేశారు.

యువతి దారుణహత్య

నాగారం: ఓ యువతిని నిప్పంటించి కాల్చి చంపిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట ఆవాసం విజయనగర్ కాలనీకి చెందిన ఆకారపు ఆడెమయ్య, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె ఆకారపు అన్నపూర్ణ(20) తిరుమలగిరి మండల కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్నది. ఈ నెల 26న ఉదయం ఫోన్ మాట్లాడుతూ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాగా సోమవారం ఉదయం ఎస్సారెస్పీ పిల్ల కాలువ పక్కన చెట్ల పొదల్లో గుర్తు తెలియని మృతదేహం ఉందని గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జే రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతురాలి కుటుంబ సభ్యులను పిలిపించగా మృతదేహం తమ కుమార్తెదేనని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి చంపినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కాల్ డేటా ఆధారంగా నేరస్తులను గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గుడ్డు పగిలిందని..
అంబులెన్స్‌కు ఫోన్‌చేసింది!

బ్రిటన్‌లో ఓ మహిళ వింత చేష్ట.. తిట్టిపోస్తున్న నెటిజన్లు



లండన్: 'సార్.. మా ఇంట్లో కోడిగుడ్డు పగిలిపోయింది. ఏం చేయాలో సలహా ఇస్తారా..' అంటూ ఓ మహిళ అంబులెన్స్ సర్వీస్‌కు ఫోన్ చేసింది. దీంతో బిత్తరపోవడం ఆ సిబ్బంది వంతయింది. ఈ ఘటన ఈ నెల 23వ తేదీన బ్రిటన్‌లో జరిగింది. నాటింగ్‌హామ్‌లోని ద ఈస్ట్ మిడ్లాండస్ అంబులెన్స్ సర్వీస్‌కు ఓ మహిళ ఫోన్ చేసింది. సిబ్బంది ఏం సహాయం కావాలని కోరగా.. 'మా ఇంటి ఫ్రిజ్‌లోని ఓ బాక్స్‌లో గుడ్లు ఉన్నాయి. అందులో ఒకటి పగిలిపోవడంతో మిగతా గుడ్లను బాక్స్ మూతలోకి మార్చి తిరిగి ఫ్రిజ్‌లో పెట్టాను. ఒక రాత్రంతా గుడ్లను మూత లేకుండా ఫ్రిజ్‌లో ఉంచితే ఏం కాదా?' అని ప్రశ్నించింది. దీంతో సిబ్బందికి చిర్రెత్తుకొచ్చి అంబులెన్స్ సేవలను అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగించాలని, ఆటలాడుకోవద్దని హెచ్చరించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆ మహిళ మాట్లాడిన ఆడియో రికార్డింగ్‌ను ఇటీవల విడుదల చేశారు. ప్రస్తుతం ఆ ఆడియో, ఫేస్‌బుక్ పోస్ట్ వైరల్‌గా మారాయి.

కాబూల్ మిలిటరీ అకాడమీపై ఐఎస్ దాడి

11 మంది ఆఫ్ఘన్ సైనికుల మృతి.. మరో 16 మందికి గాయాలు



కాబూల్: ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌లోని మిలిటరీ అకాడమీపై ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడిలో 11మంది సైనికులు మృత్యువాత పడగా, మరో 16 మంది గాయపడ్డారు. కాబూల్‌లో నెలరోజులుగా తాలిబాన్లు, ప్రత్యర్థి ఐఎస్ గ్రూప్ ఉగ్రవాదులు వరుసగా మారణహోమాలు సృష్టిస్తున్నారు. సోమవారం ఉదయం నాలుగుగంటల ప్రాంతంలో తాజా దాడి జరిగిందని ఆఫ్ఘన్ రక్షణ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి దౌలత్ వజీరీ తెలిపారు. మిలిటరీ అకాడమీకి భద్రత కల్పించే విభాగం వద్ద తొలుత ఆత్మాహుతి దాడి జరిగిందని, మరికొందరు ముష్కరులు కాల్పులు జరిపారని వజీరీ వెల్లడించారు. ఈ దాడిలో ఐదుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారని చెప్పారు. ఇద్దరు కాల్పుల్లో హతమవగా, మరో ఇద్దరు ఆత్మాహుతి పాల్పడ్డారని, ఒకరిని బలగాలు అరెస్టు చేశాయని తెలిపారు.

భారత్‌తో చర్చలకు సిద్ధం

వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకుందాం: చైనా

బీజింగ్: సరిహద్దులపై విభేదాలను శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించుకుందామని భారత్‌కు చైనా సోమవారం పిలుపునిచ్చింది. డోక్లాంతోపాటు చైనా ఆర్థిక కారిడార్(సీపెక్)పై చర్చలకు సిద్ధంగా ఉన్నామని చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి హ్యువా చున్యింగ్ తెలిపారు. డోక్లాం ప్రాంతం మాత్రం తమ దేశ భూభాగంలోకే వస్తుందని అన్నారు. భారత రాయబారి గౌతమ్ బంబేవాలా ఇటీవల చైనా ప్రభుత్వ పత్రిక గ్లోబల్ టైమ్స్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ రెండు దేశాల సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేపట్టరాదని, ఆ ప్రాంతాల్లో యథాతథ స్థితిని కొనసాగించాలని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా, హ్యువా చున్యింగ్ స్పందిస్తూ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు అనువైన పరిస్థితులను మనం కల్పించుకోవాలని చెప్పారు. డోక్లాం తమ దేశభూభాగంలోకే వస్తుందని ఆమె పునరుద్ఘాటించారు.

ఘనంగా రిపబ్లిక్ డే ముగింపు వేడుకలు



గణతంత్ర వేడుకల ముగింపు కార్యక్రమం (బీటింగ్ రీట్రీట్) సోమవారం ఢిల్లీలో ఘనంగా జరిగింది. సంప్రదాయ సంగీత వాయిద్యాలు, సైనికుల లయబద్ధమైన కవాతుల మధ్య రిపబ్లిక్‌డే వేడుకలు ముగిశాయి. విజయ్‌చౌక్‌లో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొన్న వివిధరకాల రెజిమెంట్లకు చెందిన సైనికుల బ్యాండ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చలి తక్కువగా ఉండటంతో విజయ్‌చౌక్‌లో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రాకతో వేడుకలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రపతి హోదాలో ఆయన బీటింగ్ రీట్రీట్‌కు రావడం ఇదే తొలిసారి. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రక్షణశాఖ మంత్రి నిర్మలాసీతారామన్, త్రివిధదళాల అధిపతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

బెదిరింపులకు భయపడను

కేరళ మహిళా ఇమామ్ స్పష్టీకరణ

మలప్పురం, జనవరి 29: ఇటీవల కేరళలో ఖురాన్ సున్నత్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జమీదా (34) శుక్రవారం ప్రార్థనలు (జుమువా) నిర్వహించడంపై పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. కొందరు ఆమెను హతమారుస్తామని బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు భయపడబోనని, ప్రతి శుక్రవారం జుమువా నిర్వహిస్తామని జమీదా స్పష్టంచేశారు. మల్లపురం జిల్లాలోని వండూర్‌లోని ఖురాన్ సున్నత్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రార్థనకు 80 మంది హాజరయ్యారు. అయితే మహిళలు ఇమామ్‌గా ప్రార్థనలు చేయించరు, ఎక్కువశాతం పురుషులే ఇమామ్‌లుగా ఉంటారు. దీంతో జమీదాను లక్ష్యంగా చేసుకుని వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో కొందరు బెదిరిస్తున్నారు. వారి 'బెదిరింపులకు భయపడను, ప్రార్థనలు చేయడం కొనసాగిస్తాను, తనపై సామాజిక మాధ్యమాల్లో దాడిచేసేవారు పిరికివారు, దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనని' ఆమె అన్నారు. ఖురాన్‌లో స్త్రీ, పురుషుడు అనే వివక్ష లేదని, మహిళలు ఇమామ్ కావొద్దని ఎక్కడ పేర్కొనలేదని జమీదా తెలిపారు.

అనాథల వివరాలు అందజేయండి

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 29: రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ పరిధిలో ఉన్న అనాథల వివరాలను కేంద్రానికి అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉన్న చిన్న పిల్లల వివరాలను సైతం అందజేయాలని సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశంలోని అనాథల వివరాలు కేంద్రం వద్ద ఉండాలని, అయితే పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ వివరాలను అందజేయడం లేదని గుర్తుచేసింది. ఈ వివరాలను మూడు వారాల్లోగా అందజేసేలా చూడాలని కేంద్ర తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ మనిందర్ సింగ్‌ను ఆదేశించింది.

ప్రభుత్వంపై నమ్మకం ఎక్కువే!

- గ్లోబల్ ట్రస్ట్‌ఇండెక్స్‌లో భారత్‌కు మూడోస్థానం..మొదటి స్థానంలో చైనా
- భారీగా పతనమైన అమెరికా ర్యాంకు

న్యూఢిల్లీ: భారతీయులు ప్రభుత్వాన్ని బలంగా నమ్ముతున్నారని, గతంతో పోలిస్తే నమ్మకం కాస్త సడలిందని గ్లోబల్ ట్రస్ట్ ఇండెక్స్ తేల్చింది. కమ్యూనికేషన్స్ అండ్ మార్కెటింగ్ సంస్థ ఎడెల్‌మన్ 28 దేశాల్లో సర్వే నిర్వహించి గతవారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నివేదికను విడుదల చేసింది. గత ఏడాది అక్టోబర్-నవంబర్ మధ్య ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహించింది. ఈ జాబితాలో చైనా, ఇండోనేషియా తొలి రెండు స్థానాల్లో నిలువగా భారత్‌కు మూడో స్థానం దక్కింది. గత ఏడాది మొదటి స్థానంలో ఉన్న భారత్ ఈసారి రెండు స్థానాలు దిగజారింది. నోట్ల రద్దు, జీఎస్టీ తదితర నిర్ణయాలతో ప్రజల్లో అసంతృప్తి ఏర్పడినా, ఇప్పటికీ ప్రజలు ప్రభుత్వాన్ని నమ్ముతున్నారని సర్వే పేర్కొన్నది. ట్రంప్ ప్రభుత్వంపై అమెరికన్లకు విశ్వాసం సన్నగిల్లిందని స్పష్టమైంది. ఆసియా-పసిఫిక్ భాగస్వామ్యం నుంచి వైదొలుగుతున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అమెరికా ప్రభుత్వం నమ్మకాన్ని కోల్పోగా చైనా లాభపడిందని వెల్లడించింది. ట్రస్ట్ రేటింగ్ పాయింట్లలో భారత ప్రభుత్వం, మీడియా, ఎన్జీవోలు, వ్యాపార సంస్థలు గత ఏడాదితో పోలిస్తే 13 శాతం పాయింట్లు కోల్పోయాయి. మీడియాకు 2017లో 66 పాయింట్లు రాగా ఈసారి ఐదు పాయింట్లు తగ్గాయి.

'24కే మ్యాజిక్'కు ఏడు గ్రామీ అవార్డులు

లాస్ ఏంజిల్స్, జనవరి 29: ఆర్ అండ్ బీ స్టార్ బ్రూనో మార్స్‌కు ఈ ఏడాది గ్రామీ అవార్డుల పంట పండింది. '24కే మ్యాజిక్' ఆల్బమ్‌కు ఈ ఏటి ఉత్తమ ఆల్బమ్, ఈ ఏడాది ఉత్తమ రికార్డ్ అవార్డులతోపాటు ఐదు అత్యున్నత పురస్కారాలు దక్కాయి. లాస్ ఏంజిల్స్ నగరంలో ఆదివారం రాత్రి 60వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఆల్బమ్‌లో పాల్గొన్న కళాకారులు, నిర్మాతలు, సౌండ్ ఇంజినీర్లకు అవార్డును ప్రదానం చేస్తారు. బ్రూనో మార్స్ ఏడు విభాగాలలో నామినేషన్ వేయగా, అన్నింటిలోనూ అవార్డును దక్కించుకోవడం విశేషం. రెండో స్థానంలో నిలిచిన కెండ్రిక్ లామర్ ఐదు అవార్డులను గెలుచుకున్నారు. అతడి 'డామ్న్'కు బెస్ట్ ర్యాప్ ఆల్బమ్ అవార్డు లభించింది. 'హంబుల్' పాటకు ఉత్తమ ర్యాప్ సాంగ్ అవార్డు లభించింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆఫ్రికన్ దేశాల పౌరులను అసభ్యంగా దూషించడాన్ని పలువురు కళాకారులు గ్రామీ అవార్డు వేదికపై నుండి వ్యతిరేకించారు. 'డ్రీమర్ల'కు తమ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డెమోక్రాట్ పార్టీ నాయకురాలు హిల్లరీ క్లింటన్ 'ఫైర్ అండ్ ఫ్యూరీ' పుస్తకంలోని కొన్ని భాగాలను చదువుతూ అధ్యక్షుడు ట్రంప్‌పై విమర్శలు సంధించారు.



గ్రామీ అవార్డులతో బ్రూనో మార్స్

ఐవోసీఎల్‌లో జూనియర్ ఆపరేటర్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సదరన్ రీజియన్ పరిధిలోని మార్కెటింగ్ డివిజన్ (నాన్ ఎగ్జిక్యూటివ్)లో ఖాళీగా ఉన్న జూనియర్ ఆపరేటర్ (గ్రేడ్ 1, ఏవియేషన్) తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనేది ఇండియాలోని ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో అతిపెద్ద వాణిజ్య సంస్థ.

- మొత్తం ఖాళీల సంఖ్య: 98 (జూనియర్ ఆపరేటర్ (గ్రేడ్ 1)-51, జూనియర్ ఆపరేటర్ ఏవియేషన్-46, జూనియర్ చార్జ్‌మ్యాన్-1)
- **ప్రాంతాలవారీగా ఖాళీలు:** తెలంగాణ-11, ఏపీ-12, కర్ణాటక-28, కేరళ-3, తమిళనాడు/పుదుచ్చేరి-44
- **పోస్టు పేరు:** జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)
- **అర్హత:** హయ్యర్ సెకండరీ లేదా ఇంటర్‌లో 45 శాతం (ఎస్సీ, ఎస్టీ 40 శాతం) మార్కులతో ఉత్తీర్ణత. వినియోగంలో ఉన్న హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- **పోస్టు పేరు:** జూనియర్ ఆపరేటర్ (గ్రేడ్ 1)
- **అర్హత:** పదోతరగతితోపాటు రెండేండ్ల వ్యవధిగల ఐటీఐ ట్రేడ్ (ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్)లో ఉత్తీర్ణత . సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- **పోస్టు పేరు:** జూనియర్ చార్జ్‌మ్యాన్
- **అర్హత:** పదోతరగతితోపాటు మూడేండ్ల వ్యవధిగల డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)లో ఉత్తీర్ణత . సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2018 జనవరి 31 నాటికి 18 నుంచి 26 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌లకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్ :** రూ. 10,500-24,500/-
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీ రూ. 150/-
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్(ఎస్‌పీపీటీ) ద్వారా. అభ్యర్థులు రాత పరీక్షలో సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.
- రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. సంబంధిత టెక్నికల్ నాలెడ్జ్-40, జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-20, రీజనింగ్ ఎబిలిటీస్-20, బేసిక్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్-20 అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- ఈ ఆబ్జెక్టివ్ పరీక్షను 90 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు
- ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు ఇస్తారు.
- రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులై వారి మెరిట్ జాబితా నుంచి 1:2 నిష్పత్తిలో ఎస్‌పీపీటీకి ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు :** ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తులను ప్రింట్ తీసి, అవసరమైన సర్టిఫికెట్లను జతచేసి పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా:
Post Box No-3321,
Nungambakkam MDO,
Chennai-600034

- **చివరితేదీ:** ఫిబ్రవరి 10
- **హార్డ్ కాపీలకు చివరితేదీ:** ఫిబ్రవరి 16
- **రాతపరీక్ష తేదీ:** ఫిబ్రవరి 25
- **ఫలితాలు విడుదల:** మార్చి 10
- **వెబ్‌సైట్:** https://www.iocl.com



బీఎస్ రిసెర్చ్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో బీఎస్ రిసెర్చ్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

- **కోర్సు:** బీఎస్ రిసెర్చ్
- **అర్హతలు:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో కనీసం 60 శాతం మార్కులతో 10+2/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **ఎంపిక:** కేవీపీవై ఎస్ఏ, ఎస్‌బీ, ఎస్ఎక్స్‌ల్లో ఏదో ఒకటిలో మెరిట్‌తో లేదా మెయిన్ 2018, ఐఐటీ అడ్వాన్స్‌డ్ 2018, నీట్ యూజీ -2018లో ర్యాంక్ ఆధారంగా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1 నుంచి
- **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.iisc.ac.in/ug

విద్య, ఉద్యోగ సమాచారం

శ్రీహరికోట షార్‌లో 33 పోస్టులు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో ముఖ్య కేంద్రంగా పనిచేస్తున్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ (శ్రీహరికోట) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 33
- ఫైర్‌మ్యాన్ ఏ-7 పోస్టులు
- క్యాటరింగ్ అటెండెంట్-17 పోస్టులు
- కుక్-8 పోస్టులు
- **అర్హత:** పదోతరగతిలో ఉత్తీర్ణత. ఫైర్‌మ్యాన్ పోస్టులకు నిర్దేశించిన శారీరక ప్రమాణాలు ఉండాలి. ఫిజికల్ పిటినెస్ టెస్ట్, ఎండ్యూరెన్స్ టెస్ట్‌లో అర్హతను సాధించాలి. కుక్ పోస్టులకు హోటల్ లేదా క్యాంటీన్‌లో ఐదేండ్లు పనిచేసిన అనుభవం.
- హిందీ టైపిస్ట్-1 పోస్టు
- **అర్హత:** ఏదైనా డిగ్రీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. పదోతరగతి/డిగ్రీస్థాయిలో హిందీ సబ్జెక్టు చదివి ఉండాలి లేదా హిందీ మాధ్యమంలో చదివి ఉండాలి. కంప్యూటర్‌పై హిందీ టైప్ రైటింగ్‌లో నిమిషానికి 25 పదాల వేగాన్ని కలిగి ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి (కుక్‌కు 18 నుంచి 35 ఏండ్లు, హిందీ టైపిస్ట్‌కు 18-26 ఏండ్ల మధ్య)
- **పే స్కేల్:** ఫైర్‌మ్యాన్, కుక్ రూ. 19,900/-, టైపిస్ట్‌కు రూ. 25,500/-, క్యాటరింట్ అటెండెంట్‌కు రూ. 18,000/-,
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 16
- **వెబ్‌సైట్:** http://sdsc.shar.gov.in

ఆర్ఏసీలో జేఆర్ఎఫ్

ఢిల్లీలోని డిఫెన్స్ రిసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లైన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్(ఆర్ఏసీ) ఖాళీగా ఉన్న జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 4
- **అర్హత:** కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ఐటీ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణత, పీజీ (సైకాలజీ)లో ఉత్తీర్ణత. నెట్ పరీక్షలో ఉత్తీర్ణత.సీ, సీ++, జావా, పీహెచ్‌పీ, ఎస్‌క్యూఎల్, డాట్ నెట్‌లో పరిజ్ఞానం ఉండాలి.
- పే స్కేల్: రూ.25000/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ లేదా ఈ మెయిల్ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** www.rac.gov.in

ప్రాజెక్టు టెక్నీషియన్లు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ ఆధ్వర్యంలోని వెక్టార్ కంట్రోల్ రిసెర్చ్ సెంటర్(వీసీఆర్‌సీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య-13. **విభాగాల వారీగా ఖాళీలు:** సైంటిస్ట్-సీ (నాన్ మెడికల్)-1, సైంటిస్ట్-బీ (నాన్ మెడికల్)-2, ఎంటమాలజీ-1, మాలిక్యులార్ బయాలజీ-1, ప్రాజెక్టు అసిస్టెంట్-4, ప్రాజెక్టు అసిస్టెంట్ (గ్రేడ్ 1/గ్రేడ్ 2, గ్రేడ్ 3)-6
- **అర్హత:** లైఫ్ సైన్సెస్‌లో మాస్టర్ డిగ్రీ, ఎమ్మెస్సీ+ పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ (పబ్లిక్ హెల్త్ ఎంటమాలజీ), బయాలజికల్ సైన్స్‌లో డిగ్రీలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. **చివరితేదీ:** ఫిబ్రవరి 5
- **వెబ్‌సైట్:** www.vcrc.res.in

మనూలో 52 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను అహ్వానిస్తున్నది.

వివరాలు:

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ అనేది సెంట్రల్ యూనివర్సిటీ. హైదరాబాద్ గచ్చిబౌలిలో 1998లో ఏర్పాటుచేశారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 52

విభాగాలవారీగా పోస్టులు

- హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం టీచింగ్ పోస్టులు: 26
- ప్రొఫెసర్స్- 10 పోస్టులు (ఇంగ్లిష్-1, వుమెన్ ఎడ్యుకేషన్-1, ఇస్లామిక్ స్టడీస్-1, పొలిటికల్ సైన్స్-1, బాటనీ-1, ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1, సీడబ్ల్యూఎస్-1, డీడీఈ-1, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ చైర్-1)
- అసోసియేట్ ప్రొఫెసర్స్-14 పోస్టులు (ఇంగ్లిష్-2, పర్షియన్-1, హిందీ-1, వుమెన్ ఎడ్యుకేషన్-1, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం-1, సోషల్ వర్క్-1, సోషియాలజీ-1, ఎకనామిక్స్-1, మ్యాథమెటిక్స్-1, హిస్టరీ (డీఈ)-1, సీపీడీయూఎంటీ-1,సీయూసీఎస్-1)
- అసిస్టెంట్ ప్రొఫెసర్స్-2 పోస్టులు (అరబిక్-1, సీడబ్ల్యూఎస్-1)

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్, శ్రీనగర్ టీచింగ్ పోస్టులు - విభాగాల వారీగా పోస్టులు:

- అసోసియేట్ ప్రొఫెసర్స్-8 పోస్టులు (ఉర్దూ-1, అరబిక్-1, ఇంగ్లిష్-1, పర్షియన్-1, ఎకనామిక్స్-1, హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1)
- అసిస్టెంట్ ప్రొఫెసర్స్-3 పోస్టులు (హిస్టరీ-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, కశ్మీరీ-1)
- అకడమిక్ పోస్టులు-5 ఖాళీలు (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్-1, లైబ్రేరియన్-1, డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-1, డిప్యూటీ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-1, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-1)

మోడల్ స్కూల్ టీచర్-10 పోస్టులు

- **విభాగాలు:** పీజీటీ ఇంగ్లిష్-1, టీజీటీ ఇంగ్లిష్-1, టీజీటీ హిందీ-1, టీజీటీ ఫిజికల్ ఎడ్యుకేషన్-1, యోగా టీచర్-3, ఎలక్ట్రానిక్స్-2, ఎంబ్రాయిడరీ-1
- **అర్హత:** యూనివర్సిటీ/సంస్థ నిబంధనల ప్రకారం అర్హతలు ఉండాలి.



- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు
- **ఎంపిక :** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.manuu.ac.in



కోడిగుడ్లు తినొచ్చా?

గర్భవతులు గుడ్లు తినకూడదని కొందరు, ఏం పర్వాలేదని మరికొందరు వాదించుకోవడం తెలిసిన విషయమే. అయితే తాజా పరిశోధనల్లో గర్భవతులు గుడ్లు తినడం గురించి ఏం చెబుతున్నదంటే?

గర్భవతి గుడ్డు తింటే శిశువు తెలివితేటలు రెట్టింపు అవుతాయని ఒక పరిశోధనలో తేలింది. కోడిగుడ్డు సొనలోని కోలెన్ గర్భస్థ శిశువు తెలివితేటలను పెంచుతుందట. కోడిగుడ్డు ద్వారా 115 మి.గ్రా. కోలెన్ లభిస్తుంది. కాబట్టి గర్భిణులు రోజుకు మూడు లేదా నాలుగు గుడ్లు తీసుకుంటే మంచిదని, వీటిద్వారా రోజూ 450 మి.గ్రా. కోలెన్ లభిస్తుంది. అయితే తొమ్మిదో నెలలో కనీసం శరీరానికి 950 మి.గ్రా. కోలెన్ తీసుకుంటే మంచిది. కాకపోతే గుడ్డులో కొలెస్ట్రాల్, ఉప్పు కూడా ఉంటుంది కాబట్టి అంత మొత్తంలో కోడిగుడ్లు తినకపోవడం మేలు. దాదాపు 26 మంది గర్భవతుల మీద ఈ పరిశోధన చేసి గుడ్లు తినడం మంచిదేనని తేల్చారు. కాకపోతే గర్భవతులు వైద్యుల పర్యవేక్షణలోని గుడ్లు తీసుకోవాలని చెబుతున్నారు. కాబట్టి డాక్టరును సంప్రదించి మీ బిడ్డకు ఏది శ్రీరామ రక్షో తెలుసుకొని తినండి.

సొంతలాభం మానుకొని..

ఐఐటీ, ఐఐఎంలలో చదివేవారు.. లక్షల్లో జీతం తీసుకుంటూ, విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడుపుతుంటారు. కానీ వీరు మాత్రం అలా కాదు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం వారేం చేస్తున్నారంటే..?

ఎన్ఐటీ, ఐఐఎం వంటి దేశం గర్వించదగ్గ విద్యాలయాల్లో చదువుకున్న కొందరు ఐఐటీలు.. దేశంలోని పిల్లలకు మంచి చదువు అందించాలనే ఉద్దేశంతో ఓ సంస్థను స్థాపించారు. అదే ఫన్+ఎడ్యుకేట్= ఫన్‌డుకేట్. జూన్ 15, 2017న దీన్ని స్థాపించారు. తాను ఎదుగుతూ తనతోటి వారి ఎదుగుదలకు ఉపయోగపడాలనేదే ఈ ఫన్‌డుకేట్ సూత్రం. ఐఐటీలంతా ఓ సంస్థగా ఏర్పడడానికి కారణం శర్వాని. కాలికట్‌లో ఎన్ఐటీ చేసిన శర్వాని తన మిత్రులైన శివకుమార్, పావని, షామిలి, భగత్ సహకారంతో ఫన్‌డుకేట్‌ను స్థాపించింది. వీరంతా పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు, పలు అంశాలపై వర్క్‌షాపులు, లెక్చర్స్ నిర్వహిస్తుంటారు. పిల్లల్లో ఒత్తిడి తగ్గించే కార్యక్రమాలు, క్రియేటివ్ క్యాంపులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 25 పాఠశాల్లో వీరు ఈ కార్యక్రమాలను చేపట్టారు. దాదాపు 99.8 శాతం పిల్లలకు వీరి ద్వారా మేలు జరిగింది.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



రసాయన శాస్త్రంలో..
తెలంగాణ శిఖరం

గణితం అంటే ఇష్టం.. కాని ఇంటర్‌లో బైపీసీ చేశారు! ఎంబీబీఎస్ చేయాలనుకున్నారు.
కానీ బీడీఎస్‌లో సీటు వచ్చింది!
లెక్చరర్ కావాలనే ఆలోచన. కానీ శాస్త్రవేత్త అయ్యారు!
ఉన్నతంగా ఎదగాలనుకున్నారు. అదే రీతిలో దేశం గర్వించే స్థాయికి ఎదిగారు!
ఆశ్చర్యంగానూ.. అద్భుతంగా అనిపించే లైఫ్‌గ్రాఫ్ ఆయనది.
సీఎస్ఐఆర్-ఐఐసీటీకి డైరెక్టర్‌గా ఉంటూ..
సైన్స్ రంగంలో భారత ఖ్యాతిని చాటుతున్న ఆ తెలంగాణ ఆణిముత్యమే శ్రీవారి చంద్రశేఖర్.

'ప్రపంచ దేశాల్లో రసాయనశాస్త్రంలో అగ్రభాగంలో ఉన్నదేశమే సంపద సృష్టిలో ముందుంటూ, అష్టైశ్వర్యాలతో తులతూగుతుంది' అనే విలియం రామ్సే సిద్ధాంతమే చంద్రశేఖర్ సిద్ధాంతం. ఉన్నత కుటుంబం, నాన్న ప్రభుత్వ ఉన్నతోద్యోగి అయినా విద్యాభ్యాసం తెలుగు మీడియంలో ప్రభుత్వ పాఠశాలల్లో సాగింది.. నేరుగా నాలుగో తరగతి నుంచే చదువు ప్రారంభించి, అత్యున్నత శిఖరాలకు ఎదిగారు. ఇండియన్ కెమిస్ట్రీ సొసైటీలో సచిన్ టెండూల్కర్‌గా ప్రశంసలందుకుంటూ యువ తరానికి మార్గదర్శి అయిన ఐఐసీటీ డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ విజయగాథ.. ఆయన మాటల్లోనే..

అమ్మ సుందరి, నాన్న గుండేరావు ప్రభుత్వ ఉద్యోగి. సొంతూరు మెదక్. జజ్జిఖానా ప్రభుత్వ ఆసుపత్రిలో 1964లో పుట్టాను. నన్ను మూడేళ్లప్పుడే ముషీరాబాద్ జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు పంపారు. డైరెక్ట్ 4వ తరగతి. టెన్త్ గోల్కొండ చౌరస్తాలోని ఎంబీ స్కూళ్లో చదివాను. 13 ఏళ్లలోపే పదో తరగతి పాసయ్యా. నాన్నది డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్నప్పటికీ మమ్మల్ని ప్రైవేటు పాఠశాలలకు పంపలేదు. 'ఏ స్కూలైతే ఏముంది? తెలివి ఉంటే నువ్వే చదువుకుంటావు' అనేవారు నాన్న. అందుకే మేం స్కూళ్ల గురించి కాకుండా చదువు గురించే ఆలోచించేవాళ్లం. టెన్త్ తర్వాత వెస్లీ కాలేజీలో ఇంటర్మీడియెట్ ఎంపీసీలో చేరాను. భాస్కర్‌రావు ప్రిన్సిపాల్. నాన్న ఆస్ట్రాలజీ నమ్మేవారు. నాకు డాక్టర్ అయ్యే యోగం ఉందని ఎవరో చెప్పడంతో నన్ను ఎంపీసీ నుంచి బైపీసీకి మార్పించారు.

డెంటల్ సీటుకు ఖర్చు ఎక్కువని బయోకెమిస్ట్రీ చేస్తే లెక్చరర్ అవవొచ్చని నాన్న సూచించారు. లెక్చరర్ మంచి జాబే అని ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో చేరాను. అలా అనుకోకుండా కెమిస్ట్రీ వైపు అడుగులు పడటంతో జీవిత ప్రయాణం దారి మారింది.

ప్రతిభ గుర్తించిన గురువులు: ఎమ్మెస్సీ కోచింగ్‌కు వెళ్తున్నప్పుడు నాగేశ్‌రెడ్డి సార్ తొలిసారి నాలో ప్రతిభ గుర్తించారు. కెమిస్ట్రీలో మంచి టాలెంట్ ఉందని, మంచి స్థాయికి వెళ్తానని ప్రోత్సహించారు. ఓయూలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో చేరాక సీవీ రత్నంగారు స్ఫూర్తిదాత. ప్రొఫెసర్ సిద్ధాంతి ఫిజికల్ కెమిస్ట్రీ బోధించేవారు. వీరంతా నాలోని టాలెంట్‌ను గుర్తించి స్ఫూర్తిగా నిలిచారు. ఏవీ రామారావు గారి గైడెన్స్‌లో సీఎస్ఐఆర్ పరీక్ష పాస్ అయ్యాను. చిన్న వయసులోనే పీహెచ్‌డీ పూర్తి చేశాను. రిఫాంటిసిన్, సైక్లోస్పోరిన్ అంశాలపై పీహెచ్‌డీ చేశాను. యంగెస్ట్ స్టూడెంట్‌గా ఉండి, ఫాస్టెస్ట్‌గా పీహెచ్‌డీ పూర్తి చేశాను. ప్రొఫెసర్ రామారావు, ప్రొఫెసర్ జేఎస్ యాదవ్ చాలా సహకరించారు.

పిల్లలకు స్వేచ్ఛనివ్వాలి: నా గ్రూప్‌లో 15 మంది పరిశోధన విద్యార్థులు ఉన్నారు. వాళ్లను చూస్తే గర్వంగా అనిపిస్తుంది. కొన్నిసార్లు తిడతాను.. అవసరమైతే మరింత కఠినంగా ఉంటాను. వాళ్లకు తెలుసు నేను ఎందుకు అలా ఉంటానో.. అందుకే అదంతా పాజిటివ్‌గా తీసుకొని పని చేస్తారు. గ్రీన్ కెమిస్ట్రీ, మానవులకు సంబంధిత డ్రగ్స్ ప్రధానంగానే నా 20 ఏళ్ల పరిశోధన జరిగింది. ప్రస్తుతం నా ఆధ్వర్యంలో ఉన్న బృందం ఎరిబ్యూలిన్, హెచ్‌ఈపీ సీ డ్రగ్‌లను తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నాం. పర్యావరణ అనుకూల మందులను రూపొందించే సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నాం. 1, 280 అంతర్జాతీయ పబ్లికేషన్స్, 8 పేటెంట్స్ కలిగి ఉన్నాను. 50 మంది విద్యార్థులు నా గైడెన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేయగా, మరో 20 మంది ప్రస్తుతం చేస్తున్నారు. ఇదంతా తలుచుకుంటే గర్వంగా ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలను నచ్చిన అంశాల్లో ప్రోత్సహించాలి. అలా అని పట్టించుకోకుండా ఉండకూడదు. నా కొడుకు భార్గవకు పూర్తి స్వేచ్ఛనిచ్చాను. ప్రస్తుతం ఎంబీఏ చేస్తున్నాడు. కానీ వాడికి ఫొటోగ్రఫీ అంటే ఇష్టం. వాడి ఇష్టాన్ని నేను కాదనను.

జీవిత ప్రయాణం మారింది: ఇంటర్ తర్వాత మెడికల్ ప్రవేశ పరీక్ష రాద్దామనుకుంటే 17 ఏండ్లు నిండలేదన్నారు. అందుకే రెండు మూడేండ్లు ఆగాల్సి వచ్చింది. ఖాళీగా ఉండడం ఎందుకని అమ్మ సూచనతో బీఎస్సీ మొదటి ఏడాది సర్దార్ పటేల్ కాలేజీలో చేరాను. బీఎస్సీ అయ్యాక ఎంబీబీఎస్ రాయాల్సిందేనని నాన్న చెప్పారు. ఎంట్రెన్స్ కోచింగ్ తీసుకున్నాను. ఎక్కడ ఎంబీబీఎస్ కోచింగ్ అంటే అక్కడికి వెళ్లాను. దీంతో మా నాన్న ఆలోచనలో పడ్డారు. ఇలా అయితే ఎలా అని టైప్, షార్ట్ హ్యాండ్ నేర్చుకో ఉద్యోగం తప్పకుండా దొరకుతుందన్నారు. పొద్దున 6.30కి టైప్, 7 గంటలకు షార్ట్ హ్యాండ్, తర్వాత కోచింగ్ సెంటర్, మరోవైపు ఎమ్మెస్సీ కోచింగ్ ఇలా ఒక ఫ్యాక్టరీలాగా అయిపోయాను. ఆ ఏడాది బాటనీ, జువాలజీ, బయోకెమిస్ట్రీ, జెనెటిక్స్ విభాగాల్లో ఎంఎస్‌సీ సీట్లతో పాటు బీడీఎస్ చేసే అవకాశం వచ్చింది. అయితే

జేఆర్ ఫాల్క్‌తో అనుబంధం : యూఎస్‌లో పోస్ట్ డాక్టర్ ఫెలో కోసం వెళ్లాను. మూడేళ్లపాటు అక్కడే ఉన్నాను. ప్రొఫెసర్ జేఆర్ ఫాల్క్ నుంచి చాలా నేర్చుకున్నాను. ఒకరోజు రాత్రి పది దాటినా ఉండాలని కోరారు. ఇంట్లో భార్య భారతి, బిడ్డ ఉందని చెప్పి అక్కడి నుంచి 10 గంటలకు వెళ్లిపోయాను. మరుసటి రోజు ఫాల్క్ నా వద్దకు వచ్చి మీరు కారు పూలింగ్‌లో రావడం నాకిష్టం లేదు. కారు కొనుక్కో అన్నారు. నా దగ్గర అంత డబ్బు లేదని చెప్పగానే వెంటనే చెక్ మీద 12 వేల డాలర్లు రాసిచ్చారు. వీలైనప్పుడే డబ్బు ఇవ్వమని చెప్పారు. ఆ డబ్బుతో నేను కారు కొన్నాను. తర్వాత ఐఐసీటీ, రెడ్డిస్ ల్యాబ్స్, యూఎస్‌లో ఉండడం ఇవీ నా ముందు ఉన్న అవకాశాలు. యూఎస్‌లో ఉండేందుకు దాదాపుగా సిద్ధమయ్యాను. కానీ ఒకరోజు ప్రొఫెసర్ రామారావు యూఎస్ వచ్చినప్పుడు ఇక్కడే ఉండేందుకు ప్లాన్ చేస్తున్నానని, ఇండియాలో జాబ్ చూపిస్తే హైదరాబాద్ బయల్దేరుతామనే విషయం రామారావు గారికి నా భార్య వివరించింది. ఫాల్క్ నుంచి ఒక రెకమండేషన్ లెటర్ తీసుకువస్తే అవకాశం కల్పిస్తానని ప్రొఫెసర్ రామారావు అన్నారు. ఫాల్క్ ఒక అద్భుతమైన రెకమండేషన్ లెటర్ నాకు ఇచ్చారు. ఇప్పటికీ ఆ కాపీ నా దగ్గర ఉంది. నిజానికి ఫాల్క్ ఎవరినీ రికమండ్ చేయరు. 1994లో హైదరాబాద్ తిరిగివచ్చా.

నిమ్జ్ తెలంగాణ ఐకాన్

కెమిస్ట్రీ అనేది జీవితంతో ముడిపడి ఉన్నది. ఒక్క మాటలో చెప్పాలంటే కెమిస్ట్రీ లేకుంటే లైఫ్ లేదు. ఒకప్పుడు చిన్న రోగాలకు చనిపోయే వారు.
జీవిత కాలం కూడా 40-50 మధ్య ఉండేది. ఇప్పుడు అది పెరిగింది. రోగాలు నయమవుతున్నాయి అంటే కెమిస్ట్రీనే కారణం. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నిమ్జ్ (ఫార్మాసిటీ) తెలంగాణకు ఐకాన్‌గా మారుతుంది. రసాయనాల తయారీలో వ్యర్థాలు వస్తాయి, కానీ ఇక్కడ మాత్రం పూర్తిగా అలాంటివి జరుగకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నది. కెమికల్ ఇండస్ట్రీని అందరం ప్రోత్సహించాలి. లేకుంటే ఇతర దేశాల నుంచి మందులను దిగుమతి చేసుకునే దుస్థితిలోనే ఉంటాం. చైనా మీద అధికంగా డిపెండ్ అయితే భవిష్యత్‌లో అది సరఫరా చేయకుంటే పరిస్థితి ఎలా ఉంటుంది. కామన్ మ్యాన్ ఫార్మా ఇండస్ట్రీ రాకను స్వాగతించకపోతే ఇండియా హెల్త్ కేర్‌లో ముందుకు పోలేదు. ఫార్మాసిటీని సాధ్యం చేయడంలో ఐఐసీటీ తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందిస్తున్నది.



నారాయణమూర్తి కాల్: ఇన్ఫోసిస్ సైన్స్ ప్రైజ్‌కు ఎంపిక కావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. భారత్‌లో పుట్టి ఎక్కడ సేవలందిస్తున్న వారికైనా ఈ అవార్డు ఇస్తారు. పుదుచ్చేరిలో ఉన్నాను. నారాయణమూర్తి ఆఫీస్ నుంచి కాల్ వచ్చింది. ల్యాండ్ ఫోన్ అందుబాటులో ఉందా నారాయణ మూర్తి ఓన్లీ ల్యాండ్ ఫోన్లోనే మాట్లాడతారు అని చెప్పారు. సాధ్యం కాకపోవడంతో మరుసటి రోజు మధురైలో ఉంటానని, అక్కడి నెంబర్ ఇచ్చాను. నారాయణమూర్తి నాతో ఎందుకు మాట్లాడాలనుకుంటున్నారని ఆలోచనలో పడ్డాను. మరుసటిరోజు కాల్ వచ్చింది. మొత్తం ఇన్ఫోసిస్ ట్రస్టీలు కాన్ఫరెన్స్ కాల్‌లో ఉన్నారు. నారాయణ మూర్తితో పాటు, అమర్త్యసేన్, నోబుల్ గ్రహీత జార్, మరో ఇద్దరు ట్రస్టీస్ ఉన్నారు. 'యూ ప్లీజ్ రియాక్ట్ నాచురల్లీ' అనగానే ఆశ్చర్యపోయా. ఇంతలో నారాయణ మూర్తి లైన్లోకి వచ్చి ఇన్ఫోసిస్ సైన్స్ అవార్డుకు ఏకగ్రీవంగా నామినేట్ అయిన విషయం చెప్పారు. రూ. 65 లక్షల క్యాష్, 100 గ్రాముల గోల్డ్ మెడల్ ప్రెసిడెంట్ చేతుల మీదుగా త్వరలో అందుకుంటారన్నారు. ఆశ్చర్యంలో నుంచి తేరుకొని కృతజ్ఞతలు చెప్పాను.



పురస్కారాలు

గోయల్ ప్రైజ్ 2017, శాస్త్ర సీఎన్ఆర్ ప్రైజ్ 2017, రాన్బాక్సీ రీసెర్చ్ అవార్డు 2010, రాజీవ్ గోయల్ యంగ్ సైంటిస్ట్ అవార్డు 2005, నాసి- రిలయన్స్ ప్లాటినం జూబ్లీ అవార్డు 2008, ఇన్సా మెడల్ - యంగ్ సైంటిస్ట్ అవార్డు 1996, ఇన్ఫోసిస్ ప్రైజ్ 2014, సీఎన్ఆర్ నేషనల్ ప్రైజ్ 2012



పనితో ఆడుకుంటాను: కష్టపడి పని చేయడం ప్రొఫెసర్ ఫాల్క్ నుంచి నేర్చుకున్నాను. దాన్నే పాటిస్తున్నాను. ఉదయం 8.30 - రాత్రి 12.00 వరకు ల్యాబ్స్‌లో ఉండేవాడిని. ఎక్కువ సమయం ప్రాక్టీస్ చేసేవాడిని. ఇంట్లో అందరు పడుకున్నాక రాత్రి 9 గంటలకు ఆఫీసుకు వచ్చే వాడిని. బృందంతో కలిసి పని చేసి రాత్రి నాచారంలోని ఇరానీ హోటల్‌కు నడుచుకుంటూ వెళ్లి చాయ్ తాగేవాళ్లం. తర్వాత వచ్చి మరో గంట పని చేసి ఉదయం 4 గంటలకు ఇంటికి వెళ్లేవాడిని. ఇలా 50 ఏళ్లు వచ్చేదాక చేశాను. ఇంట్లో వేడుకలకు కూడా పెద్దగా హాజరేయ్యే వాడిని కాదు. ఇంటి కంటే ఆఫీసే ఇష్టమని ఇంట్లో వాళ్లు ఎప్పుడూ అంటుంటారు. నాకు పనిలోనే విశ్రాంతి దొరుకుతుంది. పనితో ఆడుకుంటాను. హైదరాబాద్‌లో ఉంటే కచ్చితంగా ఆఫీసుకు రావాల్సిందే. 2015లో ఐఐసీటీ డైరెక్టర్‌గా సేవలందించే అవకాశం లభించింది.

సచిన్ ఇన్ కెమికల్ సొసైటీ: ఐఐసీటీలో సైంటిస్ట్ అయ్యాక తిరుపతిలో నేషనల్ ఆర్గానిక్ సింపోజియం నిర్వహించారు. దానికి ప్రొఫెసర్ రామారావుగారు వెళ్లాల్సి ఉండగా చివరకు ఎలాంటి సన్నద్ధం లేకుండా నేను వెళ్లాను. ఐఐటీ ప్రొఫెసర్స్ రన్ చేసే సింపోజియం అది. ఉదయం 9 నుంచి రాత్రి 9 దాకా జరిగింది. చివరి అరగంట, అందరి కంటే చివరన నాకు అవకాశం వచ్చింది. అక్కడ నేనే అందరికంటే యంగ్ సైంటిస్ట్. నా సమయం రాగానే యంగెస్ట్ స్పీకర్ అంటూ ఇండియన్ వుడ్‌వర్డ్‌గా పిలుచుకునే ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ రంగనాథన్ నన్ను వేదికపైకి ఆహ్వానించారు. నా ప్రసంగం అయ్యాక ఆయన ఒకే మాట అన్నారు. 'ఇండియన్ కెమికల్ సొసైటీకి సచిన్ టెండూల్కర్ దొరికారు' అని చెప్పారు. నా జీవితంలో అది మరిచిపోలేని గొప్ప ప్రశంస.

సిద్ధార్థ్ బీసగోని, 9704283062

బిట్స్ కార్నర్

అరుదైన గౌరవం అందించింది!



కర్ణాటక సంగీతం వింటుంటే ఎంత శ్రావ్యంగా ఉంటుందో! దాన్ని వయోలిన్ మీద వాయిస్తుంటే అంతే మధురంగా ఉంటుంది. అపూర్వ కృష్ణ ఆ సంగీతానికి అరుదైన గౌరవం అందించిన మొదటి భారతీయ మహిళ గా ఇప్పుడు చరిత్ర సృష్టించింది.

మనదేశంలో సంగీతానికి ఇచ్చే గౌరవం అంతాఇంతా కాదు. అలాగే విదేశాల్లో సైతం మన సంగీతం పట్ల అంతే ఆదరాభిమానాలున్నాయి. అలాగే కొన్ని యూనివర్సిటీల్లో స్కాలర్‌షిప్‌ల కోసం కొందరు కళాకారులు ఎదురుచూస్తూ కూడా ఉంటారు. టారీసీయోట్రస్ట్ కూడా అలాంటిదే! 'టరీసీయో ట్రస్ట్ యంగ్ ఆర్టిస్ట్ గ్రాంట్స్ ఫర్ 2017' పేరిట స్కాలర్‌షిప్ కాంపిటీషన్ నిర్వహించారు. దాంట్లో స్కాలర్‌షిప్ పొందిన మొదటి భారతీయ మహిళగా అపూర్వ కృష్ణ ఘనత సాధించింది. 21 సంవత్సరాల ఈ వయోలనిస్ట్ మరో ఇద్దరితో కలిపి ఈ స్కాలర్‌షిప్ కాంపిటీషన్‌లో పాల్గొని మూడో బహుమతి పొంది అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఈ అమ్మాయి కర్ణాటక సంగీతంలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించింది. బెంగళూరుకి చెందిన ఈ అమ్మాయి గతేడాది చెన్నైలో జరిగిన 'మర్ఘీ మ్యూజిక్ ఫెస్టివల్'లో కూడా అలరించింది. దాదాపు 21 కంసర్ట్స్‌లో ఈమె పాల్గొన్నది. అలాగే ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడైన శంకర్ మహదేవన్ అభ్యర్థన మేరకు 2017లో బెంగళూరు జరిగిన 'గణేశోత్సవ'లో పాల్గొన్నది అపూర్వ. మరో ముఖ్య విషయమండోయ్.. ఈ అమ్మాయి తల్లిదండ్రులు, అమ్మమ్మతాతయ్యలు కూడా సంగీతంలో నిష్ణాతులు. వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని అపూర్వ ఆరేళ్ల వయసులోనే వయోలిన్ చేతబట్టింది. కాలిఫోర్నియాలో వయోలిన్ నేర్చుకొని వచ్చిన ఈ అమ్మాయి చేసిన ఒక థిల్లానా వీడియో వారంలో 30 వేల మందికి పైగా చూశారు. పైగా అపూర్వ మరికొందరు స్నేహితులతో కలిసి కర్ణాటక సంగీతం మీద అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నది.




అడుగండి చెబుతా

నేను పెళ్లి చేసుకోవచ్చా?

ఈ మధ్య నాకు కామెర్ల వ్యాధి సోకింది. ఆ సమయంలో పరీక్షలు నిర్వమించి హెపటైటిస్ బిగా నిర్ధారించారు. ఈ వ్యాధి ఒకసారి సోకితే ఇక అది పూర్తిగా శరీరం నుంచి తొలగిపోవడం సాధ్యపడదని మిత్రుడు ఒకరు అన్నారు. అది నిజమేనా? అంతేకాదు.. పెళ్లి చేసుకుంటే భాగస్వామికి కూడా సోకుతుందని కూడా అన్నాడు. నాకు ఇంకా పెళ్లి కాలేదు. నేను పెళ్లి చేసుకోకూడదా? ఇది ప్రాణాంతకంగా పరిణమిస్తుందా? నాకు ఎలాంటి చెడు అలవాట్లు లేవు. నాకెందుకు ఈ ఇన్ఫెక్షన్ సోకింది. దయచేసి పూర్తి వివరాలు తెలియజేయగలరు.

ఆనంద్, మంచిర్యాల

హెపటైటిస్ గురించిన సరైన అవగాహన లేకపోవడం వల్ల రకరకాల అపోహలు ప్రాచుర్యంలో ఉన్నాయి. హెపటైటిస్‌లో 5 రకాల వైరస్‌లు ఉంటాయి. వాటిని హెపటైటిస్ ఎ, బి, సి, డి, ఇ గా గుర్తిస్తారు. వీటిలో ఏది సోకినా కనిపించే ప్రధాన లక్షణం కామెర్లు. ఇందులో ఒక్కో వైరస్ ఒక్కోవిధంగా వ్యాపిస్తుంది. మీకు సోకిన హెపటైటిస్ బి కలుషిత రక్తం లేదా కలుషితమైన సూదులు, శృంగారం ద్వారా వ్యాప్తి చెందుతుంది. చాలా మంది హెపటైటిస్‌ను హెచ్ఐవీతో పోలుస్తారు. ఇందుకు ఈ రెండు వైరస్‌లు వ్యాప్తి చెందే తీరు ఒకటే కావడం మాత్రమే. అంతకుమించి ఈ రెండింటిలో ఎలాంటి సారూప్యం లేదు. హెపటైటిస్ బి వల్ల కాలేయం ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే దెబ్బతింటుంది. సరైన చికిత్స తీసుకోకపోతే కాలేయం పూర్తిగా దెబ్బతిని సిర్రోసిస్‌గా మారే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి స్థితిలో కాలేయ మార్పిడి తప్పమరో మార్గం ఉండదు. డాక్టర్ల పర్యవేక్షణలో సరైన చికిత్స తీసుకుంటూ ఉంటే హెపటైటిస్ బి వైరస్‌తో కూడా సాధారణ జీవితం గడపడం సాధ్యమే. క్రమం తప్పకుండా మందులు వేసుకుంటూ, పోషకాహారం, తగినంత వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తే వ్యాధిని పూర్తిస్థాయిలో అదుపులో పెట్టుకోవచ్చు. హెపటైటిస్ బి వైరస్‌కు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఇది పూర్తిగా సురక్షితం. ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. జీవిత భాగస్వామికి వ్యాక్సిన్ వేయించి, సురక్షిత శృంగారం జరుపడం ద్వారా ఆటంకాలు లేకుండా దాంపత్య జీవితం కూడా గడుపవచ్చు. కాబట్టి మీరు చింతించాల్సిన పనిలేదు. ముందుగా మీరు మీ డాక్టర్‌తో పరిస్థితిని గురించి పూర్తి స్థాయిలో చర్చించి చికిత్స ప్రారంభించండి. మీరు తప్పకుండా పెళ్లి చేసుకోవచ్చు.



డాక్టర్ బి. రవిశంకర్
చీఫ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్
సన్‌షైన్ హాస్పిటల్స్
సికింద్రాబాద్

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[హైదరాబాద్]
మంగళవారం 30 జనవరి 2018

పసుపుతో జ్ఞాపకశక్తి!

మన వంటలో దాదాపుగా పసుపు లేని వంటకమే ఉండదు. ఇది కూరకు రంగు, రుచినివ్వడమే కాదు.. మనలో జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుందట. మూడ్ పాడుకాకుండా, ఎప్పుడూ ఆహ్లాదంగా ఉండేలా కూడా సహాయపడుతుందని అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెల్స్ పరిశోధకులు.



పసుపులో ఉండే కర్క్యూమిన్‌కి యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి ఆక్సిడెంట్ లక్షణాలున్నాయని ఇంతకు ముందే నిర్ధారణ అయింది. అందుకే వాపులు, ఇన్‌ఫెక్షన్లకు ఇది బాగా పనిచేస్తుందని చెప్పారు. ఇప్పుడు పసుపు వల్ల కలిగే మరో ప్రయోజనాన్ని కూడా కనుక్కున్నారు. వయసు పైబడినవారి మెదడులో ఏర్పడే సూక్ష్మమైన ప్లేక్స్ లాంటి వాటి వల్ల అల్జీమర్స్ వ్యాధికి లోనవుతుంటారు. వీటిపైన పసుపు సమర్థవంతమైన ప్రభావాలను ఏర్పరుస్తుందని ఇటీవలి పరిశోధనల్లో తేలింది. అల్జీమర్స్ లేనివాళ్లలో కూడా జ్ఞాపకశక్తి పెరగడానికి పసుపు తోడ్పడగలదని అంటున్నారు అధ్యయనకారులు. ఈ పరిశోధన ఫలితాలు అమెరికన్ జర్నల్ ఆఫ్ జీరియాట్రిక్ సైకియాట్రీలో ప్రచురించబడ్డాయి.

మనదేశంలో పసుపును ఎక్కువగా వాడుతారు కాబట్టే మనవాళ్లకి అల్జీమర్స్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయని, కాగ్నిటివ్ సామర్థ్యాలు కూడా మెరుగ్గా ఉంటున్నాయని, ఇందుకు పసుపులోని కర్క్యూమిన్ కారణమని ఈ పరిశోధన సారాంశం. దీని ప్రభావం సరిగ్గా ఎలా ఉంటుందనేది చెప్పలేం గానీ దీనికి గల యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాల వల్ల మెదడులో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుందంటున్నారు. అల్జీమర్స్‌లో గానీ, తీవ్రమైన డిప్రెషన్‌లో గానీ ఈ ఇన్‌ఫ్లమేషన్ కనిపిస్తుంది. 50 నుంచి 90 ఏళ్ల మధ్య వయసున్న వారిలో ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. కొందరికి ప్లేసిబో, మరికొందరికి 90 మిల్లీగ్రాముల కర్క్యూమిన్‌ను 18 నెలల పాటు రోజుకు రెండుసార్లు ఇచ్చి చూశారు. కర్క్యూమిన్ తీసుకున్నవాళ్లలో జ్ఞాపకశక్తి మెరుగుపడడమే కాకుండా ఏకాగ్రత లాంటి కాగ్నిటివ్ సామర్థ్యాలు కూడా మెరుగయ్యాయి. మెమొరీ టెస్టులో 18 నెలల పాటు కర్క్యూమిన్ తీసుకున్నవాళ్లలో 28 శాతం జ్ఞాపకశక్తి మెరుగైనట్టు గుర్తించారు. డిప్రెషన్‌లో కూడా తగ్గుదల కనిపించింది. అయితే ఆయా వ్యక్తుల జన్యుపరమైన రిస్కు, వయసులను బట్టి పసుపు ప్రభావాల్లో మార్పులుంటాయంటున్నారు ఈ పరిశోధన నిర్వహించిన కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సాల్మన్. దీనిపై మరిన్ని పరిశోధనలు చేయాలని కూడా చెప్తున్నారాయన.

హెల్త్‌స్కోపీ



మన నోటిలో ఉండే బాక్టీరియా సంఖ్య ప్రపంచ జనాభా కన్నా ఎక్కువ



చలికాలపు శీతల వాతావరణం, పొడిగాలులు, విస్తృతంగా వ్యాపించే ఫ్లూ. ఆస్తమా ఉన్నవారిని పలు విధాల అవస్థ పెట్టే కాలం ఇది. ఏడాది మొత్తం మీద సాధారణ జలుబు కూడా ఆస్తమాను తీవ్రం చేసి ఆస్తమా అటాక్ దాకా తీసుకెళ్లగల సమస్యాత్మక సమయం ఇది. ఆస్తమా వల్ల అసలే సున్నితంగా తయారై ఉండే ఊపిరితిత్తులు ఫ్లూ వైరస్‌ల దాడికి తీవ్రాతి తీవ్రంగా ప్రతిస్పందిస్తాయి. ప్రస్తుతం రాత్రుళ్లు తక్కువగా ఉంటున్న వాతావరణ ఉష్ణోగ్రతలు, పగటివేళ పెరుగుతున్న ఎండ వేడిమి ఆస్తమా బాధితులలో అసాధారణ పరిస్థితులను సృష్టిస్తున్నది. ఈ నేపథ్యంలో ఆస్తమా గురించి..

చలిగాలుల్లో ఆస్తమా దెబ్బ

ఆస్తమా వ్యాధిగ్రస్థుల్లో పిల్లలు ఇరవై శాతం వరకు ఉన్నారు. మనదేశంలో తీవ్రమైన ఆస్తమా వ్యాధిపీడితుల్లో 60 లక్షలు అయిదు నుంచి పదకొండు సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలే. తక్కువ బరువుతో పుట్టినవారు, ధూమపానం, వాయుకాలుష్యంతో కూడిన వాతావరణంలో పెరుగుతున్న పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధికి గురవుతున్నారు. తరచూ శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదుర్కోవడం, శ్వాస తీసుకునేప్పుడు కీచు శబ్దం వంటి లక్షణాలతో అయిదు సంవత్సరాల వయసులోనే ఆస్తమా మొదటిసారి బయటపడుతుంది. దీంతో పాటు అలర్జీలు, ప్రత్యేకించి చర్మానికి సంబంధించినవి కూడా పరిస్థితిని విషమంగా మారుస్తాయి. తల్లిదండ్రుల్లో ఆస్తమా ఉంటే ఆ వ్యాధి పిల్లల్లో కూడా కనిపిస్తున్నది. బాలికలతో పోలిస్తే బాలురలో ఆస్తమా అధికం. చిన్న వయసులో బాలల వాయునాళాలు బాలికల్లో సన్నవిగా ఉండడం వల్ల వైరల్ వ్యాధులు, వాటితో పాటు గొంతులోంచి కీచు శబ్దం రావడానికి అవకాశం ఏర్పడుతున్నట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు.

ఆస్తమాను పెంచేవి..

అలర్జీల మొదలుకుని ఊబకాయం దాకా, జన్యుపరమైన కారణాల నుంచి వాతావరణ కాలుష్యం దాకా ఆస్తమా రావడానికి కారణాలు అనేకం. వాతావరణ ఉష్ణోగ్రతల్లో విపరీతమైన వ్యత్యాసాలతో కూడిన ప్రస్తుత పరిస్థితులకు ఇవి తోడవడం వల్ల ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి.



అలర్జీలు: ఆస్తమా వ్యాధిగ్రస్థుల్లో చలికాలంలో విజృంభించే అలర్జీల బాధితులే ఎక్కువ. అలర్జీలకు మన శరీరం ప్రతిస్పందించే క్రమంలో ఉత్పత్తైన యాంటీబాడీలు వాయునాళ వాపునకు, తద్వారా తీవ్రమైన ఆస్తమాకు కారణమవుతాయి. పెంపుడు జంతువులు, తేమతో కూడిన చలికాలపు దుమ్ములోని క్రిములు, బూజుల వంటివి అలర్జీలు పెరగడానికి కారణం అవుతుంటాయి.



కాలుష్యం

వాతావరణ కాలుష్యంతో పాటుగా ఇళ్లు, కార్యాలయాలు, ఫ్యాక్టరీలలో ఇండోర్ పొల్యూషన్ కూడా ఆస్తమా వ్యాధిని పెంచుతున్నది. భవనాల అంతర్భాగ పరిసరాల్లో నైట్రస్ ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, ఓజోన్, హానికరమైన పొగలు, వంట గ్యాస్, బూజులు, బాత్రూమ్ క్లీనర్లు, పెయింట్ల వంటివి ఆస్తమాను తీవ్రతరం చేస్తున్నాయి.

వాహనాల నుంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్ వంటి పొగలు, ఫ్యాక్టరీల నుంచి వెలువడే వాయువులు, దుమ్ము, ధూళి ఆస్తమా లేనివారిలో కూడా దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతిలో నొప్పికి కారణమవుతున్నాయి. వీటికి ఇండోర్ పొల్యూషన్ (గదిలో కాలుష్యం) ఆస్తమా స్థిరపడే ప్రమాదం ఏర్పడుతుంది.



సిగరెట్టు పొగ: ధూమపానం వల్ల గదిలో నిండే పొగ చల్లని వాతావరణంలో మరింత ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఇది తీవ్రమైన ఆస్తమా మరణాలకు దారితీస్తున్నట్టు అధ్యయనాలు గుర్తించాయి. అప్పటివరకూ ఆస్తమా లేనివారిలో సైతం ఇటువంటి వాతావరణం గొంతులో కీచు శబ్దం, సాధారణ శ్వాసకోశ వ్యాధులతో మొదలై క్రమంగా ఆస్తమాగా మారిపోతుంది. ధూమపానం చేసేవారితో పాటు, వాళ్లకి సమీపంలో ఉండే వాళ్లయిన (ప్యాసివ్ స్మోకర్స్) మహిళలు, పిల్లలు కూడా ఈ సమయంలో మామూలు కంటే సులభంగా ఆస్తమా బారిన పడుతున్నారు.



మానసిక ఒత్తిడి : చల్లని వాతావరణం సాధారణంగా కొంచెం డిప్రెస్‌గా అనిపించేట్టు చేస్తుంది. ఈ సమయంలో వ్యక్తుల్లో ఒత్తిడితో పాటే ఆస్తమా అవకాశాలూ పెరుగుతాయి. వాళ్లు ఒత్తిడినుంచి బయటపడడానికి సిగరెట్లు తాగడం కూడా ఇందుకు కొంత కారణం కావొచ్చు. అయితే మానసిక కుంగుబాటు వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడడం కూడా ఆస్తమాకు దారితీస్తున్నట్లు పరిశోధకులు చెప్తున్నారు.



ఊబకాయం: బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) 25 నుంచి 30 మధ్య ఉన్న పెద్దవారికి, ఊబకాయులు కాని అదే వయసు వారితో పోలిస్తే ఆస్తమా అవకాశాలు 38 శాతం ఎక్కువ. బిఎంఐ 30కి పైగా ఉన్న ఊబకాయులైన వయోజనులకు ఆస్తమా అవకాశాలు ఊబకాయం లేనివారికన్నా 75 శాతానికి పైగా ఎక్కువ. చల్లటి వాతావరణంలో వ్యాయామం, శారీరక శ్రమకు దూరంగా ఉండడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతుంది. ఊబకాయులకు అలర్జిక్ ఆస్తమా కన్నా ఇలా నాన్ అలర్జిక్ ఆస్తమానే అధికం.



గర్భధారణ - ప్రసవం : ధూమపానం చేస్తున్న పరిసరాల్లో గర్భవతులుంటే పుట్టబోయే శిశువుకు ఆస్తమా వచ్చే అవకాశం ఎక్కువ. సహజ ప్రసవం ద్వారా పుట్టిన వారితో పోలిస్తే సిజేరియన్ ద్వారా జన్మించిన వాళ్లకు ఆస్తమా అవకాశం 20 శాతం ఎక్కువ. సిజేరియన్ ప్రసవ సమయంలో నవజాత శిశువు రోగ నిరోధక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసే బాక్టీరియా దాడి చల్లని వాతావరణంలో ఎక్కువ ఉండడం ఇందుకు కారణం కావొచ్చు.


ఆస్తమా బాధ పెరగొద్దంటే...

సంక్లిష్టమైన ఆస్తమా వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులు, పరిసరాల్లోని ప్రేరకాల కలయిక. అయినప్పటికీ పరిసర వాతావరణం కీలకమైనది. అందువల్ల వాతావరణ ఉష్ణోగ్రతల్లో విపరీతమైన వ్యత్యాసాలున్న నేటి పరిస్థితుల్లో వ్యాధి తీవ్రం కాకుండా జాగ్రత్తపడడం అత్యవసరం. ఇందుకు కొన్ని సూచనలు పాటించడం అవసరం.

- చలికాలం, వాతావరణ ఉష్ణోగ్రతలున్న ప్రస్తుత కాలంలో ఆస్తమా వ్యాధిగ్రస్థులు మందుల వాడకాన్ని ఒక్కపూట కూడా ఆపొద్దు.
- మెత్తలపై దుమ్ము, ధూళి లేకుండా చూసుకోండి. కనీసం పదిహేను రోజులకు ఒకసారి పక్క బట్టలను మరుగుతున్న నీళ్లతో ఉతకండి.
- పెంపుడు జంతువులను బెడ్రూమ్‌లోకి, ఫర్నీచర్ పైన కూర్చోవడానికి అనుమతించకండి.
- బెడ్రూమ్‌లో కార్పెట్లు వేయకండి. దూది కూరి చేసిన పిల్లల బొమ్మలను ఈ గదిలో ఉంచొద్దు.
- ఇంటి వాతావరణంలో తేమ అధికంగా ఉండకుండా చూసుకోండి. ఇంట్లోకి వస్తున్న గాలి నాణ్యతను గమనిస్తూ ఉండండి.
- ధూమపానానికి, ధూమపానం చేసేవారికి దూరంగా ఉండండి.
- ఇంటి ఫ్లోరింగ్, బాత్రూమ్‌లను శుభ్రం చేసేందుకు ఘాటైన క్లీనర్లు, ఆసిడ్లను వాడొద్దు.
- మానసిక ఒత్తిడిని అదుపులో ఉంచుకోండి.
- తీవ్రమైన చలి ఉన్న రోజుల్లో ఆరుబయట వ్యాయామం చేయకండి.
- జలుబు, ఫ్లూ లాంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వాటి నివారణకు మందులు వేసుకోండి.
- ఆస్తమా తీవ్రం అయినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని కలవండి. అటాక్ ప్రారంభంలోని చికిత్స మొదలుపెడితే పూర్తిగా అదుపు చేసేందుకు వీలవుతుంది.

ఆస్తమా అటాక్

ఆస్తమా లక్షణాలు ఒక్కసారిగా పెరిగిపోయి, పరిస్థితి తీవ్రంగా తయారవడాన్ని ఆస్తమా అటాక్ లేదా ఆస్తమా ఎపిసోడ్ అంటున్నారు. చలికాలం, పగలు-రాత్రి ఉష్ణోగ్రతల్లో విపరీతమైన వ్యత్యాసం, పెరిగిన వాతావరణ కాలుష్యంతో ఈ పరిస్థితి హఠాత్తుగా ఏర్పడవచ్చు. ఆస్తమా అటాక్ అయినప్పుడు శ్వాసవ్యవస్థలో కొన్ని మార్పులు వేగంగా జరుగుతాయి.



- వాయునాళాల చుట్టూ కండరాలు బిగుసుకుంటాయి. దీంతో గాలి ప్రయాణించే మార్గం మరింతగా కుంచిస్తుంది.
- శ్వాసకోశాలకు చేరే గాలి పరిమాణం బాగా తగ్గిపోతుంది.
- వాయునాళాల వాపు ఎక్కువై దారి మరింతగా తగ్గిపోతుంది.
- వాయునాళాల్లో వాపు వల్ల ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కొనేందుకు రోగ నిరోధక వ్యవస్థ ఎక్కువ మ్యూకస్ ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో వాయునాళాలు మరింతగా మూసుకుపోతాయి.

సాధారణ స్థాయిలో ఉన్న ఆస్తమా వ్యాధి ప్రమాదకర స్థాయికి చేరుకుని ఆస్తమా అటాక్ జరిగినప్పుడు ప్రారంభంలో ఊపిరితిత్తులకు కొంచెం తక్కువగానైనా ఆక్సిజన్ అందుతుంది. కానీ శ్వాసకోశాల నుంచి కార్బన్ డై ఆక్సైడ్ బయటకు రావడం కష్టమవుతుంది. తద్వారా శరీరంలో ఆక్సిజన్‌కు కొరత ఏర్పడుతుంది. క్రమంగా ఊపిరితిత్తులకు అందే ఆక్సిజన్ పరిమాణం చాలా తక్కువ స్థాయికి పడిపోతుంది. దీంతో శరీర భాగాలకు రక్తం ద్వారా అందే ఆక్సిజన్ తగ్గుతుంది. అందువల్ల ఆస్తమా అటాక్ చాలా ప్రమాదకరమైనది.



ముప్పు తప్పించే చికిత్స

ఆస్తమా జీవితకాలం వేధించే వ్యాధి అయినప్పటికీ బాధను నివారించే నూతన చికిత్సలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఆస్తమా అటాక్ జరిగినప్పుడు మొదట కృత్రిమంగా శ్వాస అందించే ఏర్పాటు చేసి, మందుల ద్వారా వాయునాళాలు తెరిచి సహజంగా ఊపిరి తీసుకునేట్లు చేస్తారు. ఆపైన ఆస్తమా విషమించడానికి కారణమైనవాటిని గుర్తించి వాటినుంచి కాపాడుకునేందుకు, ఆస్తమా అటాక్ నివారణకు మందులు, అలవాట్లలో మార్పులు సూచిస్తారు. క్రమం తప్పని పరీక్షలు, నిపుణులైన వైద్యుల సూచనలను పాటిస్తూ ఉంటే చల్లని వాతావరణ పరిస్థితుల్లో కూడా ఆస్తమా వ్యాధిగ్రస్థులు సాధారణ జీవితం గడుపవచ్చు.

YASHODA HOSPITALS
పల్మనాలజీ, ఛాతీ, శ్వాసకోశ వ్యాధుల విభాగం
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

పరిశోధన

షుగర్, క్యాన్సర్‌లకు కొత్త మందు

మధుమేహం, క్యాన్సర్ వ్యాధులు రెండింటికీ కలిపి పనిచేసే ఒకే మొక్కను కనుగొన్నారు పరిశోధకులు. కాకరకాయలాగా కనిపించే చేదు పుచ్చకాయ (బిట్టర్ మిలన్)లో ఒకవైపు రక్తంలో చక్కెరలను తగ్గించే లక్షణాలు, మరోవైపు కొన్ని రకాల క్యాన్సర్లను అడ్డుకునే లక్షణాలు రెండూ ఉన్నట్టు ఇటీవలే కనుగొన్నారు కొలరాడో యూనివర్సిటీకి చెందిన శాస్త్రజ్ఞులు.



సైడ్ ఎఫెక్టులతో హాని చేసే రసాయనాలతో కూడిన మందుల కన్నా మెరుగైన మార్గాల్లో చికిత్సల కోసం ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొలరాడో యూనివర్సిటీ పరిశోధకులు పురోగతిని సాధించారు. చేదు పుచ్చకాయ అనే ప్రత్యేకమైన మొక్కలోని సుగుణాలు మధుమేహుల్లో చక్కెర విలువలను నియంత్రిస్తాయనీ, క్యాన్సర్ రోగుల జీవన నాణ్యతను పెంచుతాయనీ తెలుసుకున్నారు.

ప్రస్తుతం ఉన్న క్యాన్సర్ చికిత్సల పేరు ఎత్తితేనే బెంబేలెత్తిపోతున్నారు. మధుమేహాన్ని నివారించడం కూడా కష్టతరం అవుతున్నది. ఇంజెక్షన్లు, గ్లూకోజ్ టెస్టులతో సతమతం అవుతున్నారు. ఈ కొత్త అధ్యయనం ఇలాంటి వాళ్లకు ఊరటనిస్తున్నది. క్యాన్సర్ ఇన్‌హిబిటర్ల అవసరాన్ని, రోజూ మధుమేహం మానిటరింగ్ తగ్గించడానికి ఇటీవలి ఈ అధ్యయనాలు తోడ్పడుతాయి.

చేదు పుచ్చకాయ లేదా బిట్టర్ మిలన్ కాకరకాయ జాతికి చెందిన మొక్క. ఇవి ఆసియా, కరేబియన్, ఆఫ్రికా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఎక్కువగా సూప్స్‌లో వాడుతుంటారు. వంటలో వాడడం తక్కువ. ఇతర పండ్లలాగా కాకుండా ఇది చేదుగా ఉండడం వల్ల పండుగా మారకముందే దీన్ని ఆహారంలో చేరిస్తే అద్భుతమైన ఫలితాలుంటాయి.

ఏమిటీ ఆ లాభాలు?

చేదు పుచ్చకాయలో విటమిన్ ఎ, సిలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఇది తింటే అటు కళ్లు, చర్మ ఆరోగ్యం, ఇటు వ్యాధినిరోధక శక్తి బావుంటాయి. దీనిలో పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది. శరీరం అంతటా నాడుల ప్రసారానికి, కణ జీవక్రియలకు ఇది అవసరం. బిట్టర్ మిలన్‌లో యాంటి ఆక్సిడెంట్లయిన ల్యూటిన్, బీటా కెరొటిన్‌లు సమృద్ధిగా ఉంటాయి. వీటివల్ల ఇన్‌ఫ్లమేషన్ నివారించవచ్చు. వ్యాధులను అడ్డుకోవచ్చు. వివిధ రకాల విటమిన్లు, యాంటి ఆక్సిడెంట్లు అన్నీ కలిసి కొన్ని రకాల క్యాన్సర్లతో పోరాడడానికి, మధుమేహాన్ని నివారించడానికి సహాయపడతాయి.

మధుమేహానికి....

ఈ రకమైన కాకరకాయ లేదా చేదు పుచ్చకాయ వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు కూడా మెయిన్‌టెయిన్ అవుతాయి. దీన్ని ఆహారంగా తీసుకున్న మధుమేహ రోగుల్లో చక్కెర నిల్వలు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. వీరిలో ఇన్సులిన్ సెన్సిటివిటీ కూడా పెరిగింది. ఈ పరిశోధన 2008లోనే జరిగింది. దీనికి బలాన్నిచ్చే ఫలితం ఇటీవలి పరిశోధనలో వెలువడింది. దీని నుంచి సేకరించిన 2000 మిల్లీలీటర్ల ఎక్స్‌ట్రాక్ట్‌ను రోజూ తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర నిల్వలు తగ్గినట్టుగా గుర్తించారు.



మన రోజువారీ ఆహారంలో బిట్టర్ మిలన్‌ను కలుపడానికి ముందు కొన్ని విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

- గర్భిణులు దీన్ని తీసుకోకూడదు. ఎందుకంటే రక్తస్రావం, గర్భసంచి సంకోచాలు జరగొచ్చు. గర్భస్రావాలు కూడా కావొచ్చు.
- డయాబెటిస్ లేదా ఇన్సులిన్ మందులతో కలిపి దీన్ని తీసుకోవద్దు. రెండూ ఒకేసారి తీసుకోవడం వల్ల అకస్మాత్తుగా షుగర్ లెవల్స్ తగ్గిపోయే ప్రమాదం ఉంది.
- దీన్ని తీసుకున్న కొందరిలో అల్సర్లు, అలర్జీ చర్యలు, గుండెదడ లాంటివి గమనించారు. కాబట్టి అందరికీ పడకపోవచ్చు.

క్యాన్సర్‌కి ఇలా..

కొలరాడో యూనివర్సిటీలో ఈ మొక్కపైన రెండు రకాల అధ్యయనాలు జరిగాయి. పరీక్ష నాళికల్లో, జంతువులపై వేర్వేరుగా పరిశోధనలు నిర్వహించారు. పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు ఇది ఎలా సహాయపడుతుందనే అంశాన్ని లక్ష్యంగా చేసుకుని పరిశోధన సాగించారు. క్యాన్సర్ కణాల ఉత్పత్తి పెరుగకుండా ఈ మొక్క అడ్డుకుంటున్నట్టు గమనించారు. తద్వారా క్యాన్సర్ గడ్డలు ఏర్పడం ఆగిపోతున్నది. ఈ మొక్కను ఆహారంలో చేర్చడం వల్ల క్యాన్సర్ కణాలు వాటినవే చంపుకొనేలా (స్వీయ కణ విచ్ఛిత్తి) చేసుకోవడాన్ని ప్రేరేపిస్తాయని చెప్తున్నారు పరిశోధకులు. ఈ రకమైన కాకరకాయలు క్యాన్సర్ కణాలకు గ్లూకోజ్ రవాణా కాకుండా అడ్డుకుంటాయి. కణ పెరుగుదలకు కావాల్సిన కీలకమైన పోషకం గ్లూకోజ్ కాబట్టి అది దొరకక కణాలు చనిపోతాయి. ప్రతి రోజూ వీటిని తీసుకుంటే సహజసిద్ధమైన యాంటి-క్యాన్సర్ మందు వేసుకుంటున్నట్టే. ప్రొస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ల విషయంలో కూడా ఇది బాగా పనిచేస్తుందంటున్నారు అధ్యయనకారులు. మరిన్ని క్యాన్సర్లపై దీని ప్రభావం ఎలా ఉంటుందో ఇంకా పరిశోధన చేయాల్సి ఉంది.

హై బీపీ అదుపు చేయొచ్చిలా..



రక్తపోటు ఒక్కసారిగా పెరిగిపోవడాన్నే హై బీపీ అంటారు. ఇంకోలా చెప్పాలంటే హైపర్ టెన్షన్. అది తగ్గాలంటే ఈ కింద చెప్పినట్టు చేస్తే సరిపోతుంది.

- సాధారణంగా పొగ తాగేవారిలో రక్తపోటు బాగా పెరుగుతుంది. కాబట్టి ఆ అలవాటుకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.
- పొటాషియం ఎక్కువగా ఉండే పళ్లు, కూరగాయలు తరచూ తీసుకోవాలి. ఇవి రక్తనాళాలు వెడల్పయ్యేలా చేసి రక్తప్రసరణ నిరాటంకంగా జరిగేందుకు సాయపడతాయి.
- పచ్చి టమాటలు తినడం వల్ల బీపీ కంట్రోల్ అవుతుంది. వాటిలో ఉండే లైకోపీన్ హైబీపీని కంట్రోల్ చేసేందుకు ఉపకరిస్తుంది.
- చేపల్లో ఉండే మాంసకృత్తులు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ రక్తనాళాలను వ్యాకోచింపజేస్తాయి. దీని వల్ల రక్తప్రసరణ సాఫీగా జరిగి హైపర్‌టెన్షన్ తగ్గుతుంది.
- ధ్యానం చేయడం వల్ల శ్వాసక్రియ క్రమబద్ధీకరించబడి ప్రశాంతత చేకూరుతుంది.

నీటితో డీటాక్సిఫికేషన్!



నీటిని సర్వరోగ నివారిణిగా చెప్తారు వైద్య నిపుణులు. కానీ నీరు ఎక్కువగా తాగాలంటే ఒక్కోసారి తాగబుద్ధి కాదు. దీనికి ప్రత్యామ్నాయం సూచిస్తున్నారు నిపుణులు. నిమ్మ, నారింజ, పుచ్చ లాంటి ఫలాలను నీటిలో కలుపుకొంటే వాటి రసం నీటిలో కలిసి మంచి వాసన, రుచి వస్తాయి. అంతేకాదు. ఈ రకమైన నీరు శరీరాన్ని శుభ్రం చేసేందుకు డీటాక్సిఫయర్‌గా పనిచేస్తుందట. మన శరీరంలో పేరుకుపోయే ఆమ్ల పదార్థాలన్నీ విషతుల్యమైనవే. వీటికి క్షార గుణం కలిగిన నీరు మంచి అస్త్రంగా పనిచేస్తుంది. అందుకే నీరు ఆమ్ల పూరితమైన హానికర పదార్థాలను శరీరం నుంచి బయటికి పంపించివేస్తుంది. తద్వారా శరీరం శుభ్రపడుతుంది.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[హైదరాబాద్]
మంగళవారం 30 జనవరి 2018

బాక్టీరియాపై కొత్త బాణం

యాంటీబయోటిక్స్‌ను సరైన పద్ధతిలో వాడకపోవడం వల్ల శరీరంలో కొన్ని బ్యాక్టీరియాలు దృఢంగా పాతుకుపోతాయి. అలాంటి వాటి ఆటకట్టించే కొత్త జెల్‌ను కనిపెట్టారు శాస్త్రవేత్తలు.

నెదర్లాండ్స్‌కు చెందిన పరిశోధకులు అమైనో ఆమ్లాలతో కూడిన ఎస్‌ఏఏపీ-148 అనే కొత్త జెల్‌ను కనిపెట్టారు. ఈ జెల్‌లో ఉండే మూల పదార్థము.. మనుషుల్లో బాక్టీరియాకు వ్యతిరేకంగా పోరాడే శక్తిని పెంచుతుంది. ఎలుకలపై దీన్ని ప్రయోగించిన పరిశోధకులు.. ఎమ్ఆర్‌ఎస్ఏ(మిథైలిసిన్ రెసిస్టెంట్ స్టాఫైలోకోకస్ ఆరియస్) వల్ల కలిగే గాయాలను పూర్తిగా నిర్మూలించగలిగింది. ఈ సింథటిక్ ప్రొటీన్ జీవపొరలను ఏర్పర్చకుండా వ్యాధికారక జీవులను నియంత్రిస్తుంది. ఈ జీవపొరల్లో నివసించే బ్యాక్టీరియా పది నుంచి వెయ్యిరెట్లు ఎక్కువ శక్తివంతమైనదిగా తయారై, దృఢమైన ప్రతిరూపాలుగా తేలియాడుతుంటాయి. యాంటీ బయోటిక్స్‌ను తట్టుకొనే శక్తిని సంపాదించుకొన్న సూక్ష్మజీవులతో కూడిన బాక్టీ



రియాను కూడా ఈ ఎస్‌ఏఏపీ-148 జెల్ సమూలంగా తొలగించేస్తుంది. చికిత్స అనంతరం ఆ బాక్టీరియా తిరిగి రాకుండా చేస్తుంది. బాక్టీరియాలపై పనిచేసే ఆయుధాల్లాంటి యాంటీ బయోటిక్స్‌కు అవసరమైన శక్తిని ఈ ప్రొటీన్ అందిస్తుందని అట్లాంటాలోని ఎమోరీ యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్ మైక్రోబయాలజిస్ట్ డేవిస్ విస్ చెబుతున్నారు. ఎస్‌ఏఏపీ-148ని ప్రయోగించాక రెండు వారాల తర్వాత.. ఈ జెల్‌ను తట్టుకొనే శక్తి బాక్టీరియాకు లేదని గుర్తించారు శాస్త్రవేత్తలు. ఇతర బాక్టీరియాలపైనా దీన్ని ప్రయోగించే ప్రయత్నం కూడా జరుగుతున్నది. ఇదే సంవత్సరం ఈ జెల్‌ను మనుషులలో ఉండే బాక్టీరియా పైనా ప్రయోగించనున్నారట.

మంచి చేసే మంచు తుంపరలు

మంచు తుంపరలు మంచి చేయడమేమిటి? ఇదేం వింతైన విషయం కాదే! అని ఆశ్చర్యపోతున్నారా! భూమ్మీద అయితే సాధారణ విషయమే. కానీ ఇదెక్కడో తెలుసా?

భూమ్మీద తప్ప ఇతర ఏ గ్రహాల మీద కూడా తాగడానికి చుక్క నీరు దొరుకదనుకున్నాం. కానీ అంగారకుడిపై ఆ జాడలు కనిపెట్టారు అమెరికా శాస్త్రవేత్తలు. అక్కడి మట్టిలో ఈ మంచు తుంపరలు కప్పబడి ఉండడాన్ని గమనించారు. ఇది భవిష్యత్ వ్యోమగాములకు ఎంతో ఉపయోగకరమని తేల్చారు. ఈ మంచు పొరల ద్వారా తాగేందుకు నీరు, పీల్చేందుకు ఆక్సిజన్‌ను సృష్టించుకోవచ్చని అంతరిక్ష పరిశోధకుడు కోలిన్ డుండాస్ అభిప్రాయపడ్డాడు. అంతే కాదు అంతరిక్షంలోకి వెళ్లిన వ్యోమగామి తిరిగి వచ్చేందుకు ఇందనాన్ని కూడా సృష్టించుకోవచ్చని చెబుతున్నాడు. మంచు తుంపరలు ఈ ఎర్ర గ్రహానికి ఉత్తర లేదా దక్షిణ ప్రాంతాలకు దగ్గరలో 55 డిగ్రీ కోణంలో ఉండొచ్చని చెబుతున్నాడు డుండాస్. ఉపగ్రహ చిత్రాలను పరిశీలించి అక్కడి మంచు సన్నని పొరలుగా ఉన్నట్టుగా గుర్తించారు శాస్త్రవేత్తలు. కొన్ని మిలియన్ సంవత్సరాలుగా ఇది స్నోఫాల్స్‌గా ఉన్నట్టు మరో డైరెక్షన్‌లో తీసిన చిత్రం ద్వారా తెలుస్తున్నది. అయితే ఈ మంచు తుంపరలు ఉన్న వాలు ప్రాంతాలు మనుషులు కాలుమోపడానికి అంత శ్రేయస్కరమైనవి కావట. అయితే ఆ మంచు ఎక్కడి నుంచి వస్తున్నదనే విషయం తెలుసుకోవడానికి ఆ వాలు ప్రాంతాలే ఆధారమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.





ఇద్దరమ్మాయిలు... ఒక అమ్మాయి షాపింగ్ మాల్ సెల్లార్‌లో ఫోన్ చూసుకుంటూ కార్లో కూర్చుని ఉంటుంది. పక్కన ఉన్న కార్లో అబ్బాయితో కళ్లు కలుస్తాయి. అతనికి తన ఫోన్ నంబర్ ఇస్తుంది.

మరో అమ్మాయి అంతే.. అదే షాపింగ్ మాల్.. పక్కన కార్లో అబ్బాయి.. అంతా సేమ్ టు సేమ్.

ఇలా ఆ అమ్మాయి జీవితంలో ఎటువంటి సంఘటనలు జరుగుతాయో.. సంవత్సరం తరువాత ఈ అమ్మాయి జీవితంలో కూడా దాదాపుగా అలాంటి సంఘటనలే జరుగుతుంటాయి. ఆ అమ్మాయిలా ఈ అమ్మాయి కూడా చనిపోతుందేమోనని భయపడుతుంటుంది.

ఇటీవల వచ్చిన ఓ సినిమాలోని కథ ఇది. ఇలా ఇద్దరి జీవితాల్లో సమాంతరంగా ఒకే రకమైన సంఘటనలు జరగడాన్ని ప్యారలల్ లైఫ్ (సమాంతర జీవితం) అంటారని చెప్తాడు సినిమాలో ప్రొఫెసర్. సినిమాలో ఫాంటసీగా కనిపించినట్టు నిజంగా ఇలాంటి ప్యారలల్ జీవితాలు ఉంటాయా?

వందేళ్ల తేడాతో అమెరికా అధ్యక్షులుగా చేసిన లింకన్, కెనడీల జీవితాల్లో ఇలాంటి సారూప్యత కనిపిస్తుందన్నది చరిత్రకారుల మాట...

ఇద్దరు వ్యక్తులు.. ఒక్క జీవితం సాధ్యమా!

మనిషిని పోలిన మనుషులు ఉండడం గురించి విన్నాం. కానీ జీవితాలను పోలిన జీవితాలు ఉండడం ఎక్కడైనా చూశామా! వీటినే సమాంతర జీవితాలుగా చెబుతున్నారు. అంటే ఒక మనిషి జీవితంలో సంఘటనలు.. అచ్చం అలాగే మరొకరి జీవితంలో జరుగడమన్నమాట. అదెలా సాధ్యమన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

ఒక మనిషిని పోలిన మనుషులు ప్రపంచంలో ఏడుగురు ఉంటారని అంటారు. ఆ నమ్మకం నిజమే అనుకున్నా.. వాళ్ల పోలికలు ఒకేలా ఉండొచ్చు.. కానీ వారి జీవితగమనాలు ఒకేలా ఉంటాయని చెప్పలేం. వాళ్ల జీవితంలో ప్రతీ సంఘటన ఒకే తీరుగా జరిగేందుకు అవకాశం



ఉంటుందా! సాధారణంగా ఒక కడుపున పుట్టిన ఇద్దరు కవలల పిల్లల విషయంలోనే అది సాధ్యం కాదు, అలాంటిది ఒకే పోలికతో దూరంగా ఉన్న వ్యక్తుల జీవితాల్లో అదెలా సాధ్యం! రూపురేఖల్లో కూడా పోలికలు లేని ఇద్దరు మనుషుల్లో ఒకే రకమైన జీవితం సాధ్యమవుతుందనే ఆధారాలు మాత్రం ఇప్పటి వరకూ లేవు. ఇలా రెండు జీవితాల మధ్య నెలకొనే అత్యంత సారూప్యతే సమాంతర జీవితం (పారలల్ లైఫ్). నిజంగా ఇలాంటి జీవితాలు ఉన్నట్టు ఇప్పటివరకైతే సైన్సుకి అందలేదు. సమాంతర జీవితాన్నే మన పరిభాషలో యాదచ్ఛికంగా జరిగే సంఘటన (కో-ఇన్సిడెంట్)గా చెప్పొచ్చు. ఒక వ్యక్తికి ఎదురైన సంఘటనే మరొకరికి కూడా అనుకోకుండా ఎదురుకావొచ్చు. అంతేగానీ అదేపనిగా ప్రతీ సంఘటన ఒకేలా జరగకపోవచ్చు.

సైన్స్ కాదు.. నమ్మకం

సమాంతర జీవితాల గురించి పాశ్చాత్య దేశాల్లో చాలా పుస్తకాలు వచ్చాయి. సినిమాలు కూడా తీశారు. కొంతవరకు ఈ సిద్ధాంతాన్ని నమ్ముతారు కూడా. కొన్నిసార్లు మనలో చాలా మందికి కొన్ని కొన్ని సంఘటనలు ఇంతకు ముందు అదే రకంగా జరిగినట్టు అనిపిస్తుంది. ఎవరితోనో మాట్లాడుతుంటాం... మనం మాట్లాడిన మాటలు, అవతలివాళ్లు స్పందించిన తీరు ఇదివరకే జరిగినట్టు అనిపిస్తుంటుంది. అంటే అదే సంఘటన మనకే ఇదివరలో జరిగినట్టు జ్ఞాపకం వస్తుంది. ఇదెంతవరకు నిజమో మనకే గుర్తుండదు. అదేవిధంగా ఇద్దరి జీవితాల్లో ఒకే రకమైన సంఘటనలు జరుగుతాయనీ చెప్పలేం. జరగవని కూడా గట్టిగా అనలేం. ఇప్పటి వరకూ శాస్త్రీయ ఆధారాలు లేవు కాబట్టి నమ్మలేం.

మన భారతీయ సిద్ధాంతాల ప్రకారం అయినా పునర్జన్మలు, కర్మ సిద్ధాంతాల వంటివి ఉన్నాయి గానీ సమాంతర జీవితం గురించి ఎక్కడా ప్రస్తావన ఉండదు. పురాణేతిహాసాల ప్రకారమైనా ఒక జన్మ ముగిసిన తర్వాత మరో జన్మ పాపపుణ్యాల లెక్కల ప్రకారం ఉంటుందంటారు. అలా అనుకున్నా కూడా ప్రస్తుత జన్మ, పోయిన జన్మకు కొనసాగింపే తప్ప పోయిన జన్మలో జరిగిన సంఘటనలే ఈ జన్మలోనూ ఉండవు. కాబట్టి శాస్త్రీయంగా అయినా మన కర్మ సిద్ధాంతం ప్రకారమైనా ప్యారలల్ జీవితాలు ఉండేందుకు ఆస్కారం లేదు. ఇద్దరు జీవితాల్లో ఒకే రకమైన సంఘటనలు జరుగడం, పోయిన జన్మలో జరిగిన అంశాలే ఈ జన్మలోనూ పునరావృతం కావడమన్నది అసంభవమన్నది కొందరి వాదన.

ఇండియన్ మైథాలజీ ఈ విషయాన్ని ఒప్పుకోకపోయినా, పాశ్చాత్య సిద్ధాంతాలు మాత్రం ఈ ప్యారలల్ జీవితాన్ని నమ్ముతున్నాయి. గ్రీకు పురాణాల్లో ఇలాంటి సమాంతర జీవితాల ప్రస్తావన ఉంటుంది. అవి కూడా ఊహాజనితమైనవే కావొచ్చు. ముఖ్యంగా ఈ సమాంతర జీవితాలపై అనేక కథలు రకరకాలుగా రచించబడి ఉన్నాయి. ఇవన్నీ పాశ్చాత్య దేశాలకు చెందినవి కావడం విశేషం.

శాస్త్రీయత ఎంతవరకు?

పారలల్ లైఫ్ అనేది ఒక ఫాంటసీ. ఊహాజనితమైన అంశంగా తీసిపారేసే వాళ్లూ ఉన్నారు. దీనికున్న శాస్త్రీయనేపథ్యాన్ని ప్రశ్నించేవారూ లేకపోలేదు. ఎందుకంటే ఒక మనిషి, మరో మనిషిలా ఆలోచించవచ్చేమో గాని, ఇద్దరూ ఒకేలా ప్రవర్తిస్తారని, ఒకే పనిని ఒకేలా చేసేందుకు ఆసక్తి చూపుతారనీ చెప్పలేం. ఇది ఊహించడానికి బాగానే ఉండొచ్చు, కానీ ఆచరణలో సాధ్యం కావడమన్నది మాత్రం అసాధ్యం అంటున్నారు మరికొందరు పరిశోధకులు.

సమాంతర ఆలోచనలు ఉండొచ్చు!

డార్విన్ కనుగొన్న సిద్ధాంతం.. అదే సమయంలో మరో వ్యక్తి కూడా కనుగొన్నాడు. కానీ నోబెల్ మాత్రం డార్విన్‌నే వరించింది. అంటే ఇక్కడ ఇద్దరి వ్యక్తుల ఆలోచనలు ఒకేలా పనిచేశాయి. కానీ ఫలితం మాత్రం ఒకర్ని ఒకలా వరిస్తే, మరొకర్ని ఇంకోలా వరించింది. అదేవిధంగా చాలా పరిశోధనలు ఒక్కో దేశంలో ఒక్కో సైంటిస్టు ఒకే రకమైన అంశంపై పరిశోధన చేయడం చాలా సందర్భాల్లో కనిపిస్తుంది. అంటే సమకాలీన పరిస్థితులు (సామాజిక, భౌతిక, రాజకీయ, ఆర్థిక) ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తులు పారలల్‌గా (సమాంతరంగా) ఆలోచించేందుకు వీలుంటుంది. కానీ వారికి ఒకేలా ఫలితం దక్కడం జరుగదనే విషయం దీనిద్వారా స్పష్టమవుతున్నది. ఇద్దరి జీవితాల్లో పోలిక ఉండొచ్చు. కానీ అచ్చు గుద్దినట్టు జరుగడం అసాధారణం.

మన విశ్వానికి సమాంతర విశ్వం ఉందా?



మన విశ్వాన్ని పోలిన విశ్వం మరొకటి ఉన్నట్టు.. పరిశోధకులు చెబుతున్నారు. అయితే ఈ రెండింటిలోనూ పరిస్థితులు ఒకేలా ఉంటాయని చెప్పలేం. ఆ విషయంలో శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధనలు కొనసాగిస్తూనే ఉన్నారు. మనం జీవిస్తూ ఉన్న ఈ విశ్వం మనకే ప్రత్యేకమైనది అనుకుంటాం. అయితే సైన్స్ ఫిక్షన్ ఆలోచన నుంచి సైన్స్ చెప్పే నిజాల మధ్య ఆలోచిస్తే మన విశ్వంతో పాటు ఈ బ్రహ్మాండంలో మరెన్నో విశ్వాలున్నాయంటున్నారు శాస్త్రజ్ఞులు. ఈ అంశాన్నే ప్యారలల్ యూనివర్స్‌గా అభివర్ణిస్తున్నారు. దీని నుంచి వచ్చించే మల్టీవర్స్ అనే అంశం కూడా. దీని గురించి కొంత ఆధారం కూడా లేకపోలేదు. ఇది తెలుసుకోవాలంటే అసలు మన విశ్వం ఎలా ఏర్పడిందో తెలియాలి. 13.7 బిలియన్ సంవత్సరాల క్రితం ఈ జగత్తు అంతా ఒక అనంతమైన ఏకత్వంతో నిండి ఉండేది. బిగ్ బాంగ్ సిద్ధాంతం ప్రకారం మనకు తెలియని ఏదో ప్రేరణ వల్ల అదంతా విస్తృతమై 3 డైమెన్షనల్‌గా విస్తరించింది. ప్రారంభంలో విస్తరించిన ఆ అపారమైన శక్తి అంతా చల్లబడిన తరువాత దాని గుండా కాంతి ప్రసారం జరిగింది. క్రమంగా చిన్న చిన్న కణాలు, రేణువులన్నీ కలిసిపోయి పెద్ద పెద్ద భాగాలుగా ఏర్పడింది. ఈ విశ్వంలోని సౌరకుటుంబాలు, నక్షత్రాలు, గ్రహాలు అలా ఏర్పడినవే. మనకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికత మన విశ్వాన్ని దాటి గమనించడానికి అనుకూలంగా లేదు.


చరిత్రలో ప్యారలల్ జీవితం

అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన అబ్రహాం లింకన్, జాన్ ఎఫ్ కెనడీ జీవితాల్లో ఇలాంటి సమాంతర జీవితం కనిపిస్తుంది. లింకన్, కెనడీ ఇద్దరి పేర్లలోనూ ఏడక్షరాలే ఉన్నాయి. అబ్రహాం లింకన్ 1846లో కాంగ్రెస్‌కి ఎన్నికైతే, కెనడీ 1946లో అంటే సరిగ్గా వంద సంవత్సరాల తర్వాత ఎన్నికయ్యాడు. 1860లో లింకన్ అమెరికా ప్రెసిడెంట్ అయ్యాడు. కెనడీ 1960లో అధ్యక్షుడయ్యాడు. వైట్‌హౌజ్ నుంచి వచ్చేప్పుడు ఇద్దరూ తమ బిడ్డల్ని కోల్పోయారు. లింకన్‌ని ఫోర్డ్స్ థియేటర్‌లో కాల్చి చంపితే, కెనడీని ఫోర్డ్ కార్లో ఉండగా కాల్చి చంపారు. చనిపోయేటప్పుడు ఇద్దరి పక్కనా వారి వారి భార్య ఉంది. ఇద్దరూ శుక్రవారం రోజునే హత్యగావింపబడ్డారు. ఇద్దరికీ తల పైనే కాల్చారు. వాళ్లని చంపిన వ్యక్తుల పేర్లు కూడా ఒకటే.. జాన్సన్. లింకన్‌ని చంపింది ఆండ్రూ జాన్సన్ అయితే కెనడీని చంపింది లిండన్ జాన్సన్. వీళ్లిద్దరి అసలు పేర్లు జాన్ విల్క్స్ బూత్, లీ హార్వే ఆస్వాల్డ్. బూత్ అమెరికన్ నటుడు కాగా, ఆస్వాల్డ్ మార్క్సిస్టు. వీళ్ల జీవితాల్లో కూడా ప్యారలల్ జీవితాన్ని గమనించవచ్చు. వీళ్ల ఇద్దరి పేర్లలోనూ 15 అక్షరాలే ఉన్నాయి.



లింకన్ కెనడీ

జాన్ విల్క్స్ బూత్ 1839లో జన్మించాడు. లీ హార్వే ఆస్వాల్డ్ 1939లో జన్మించాడు. ఇద్దరినీ పోలీసులు కడుపులో కాల్చి చంపారు. బూత్ ఒక థియేటర్ నుంచి పరిగెత్తుతుంటే వేర్‌హౌజ్‌లో పట్టుకుని చంపారు. ఆస్వాల్డ్ వేర్‌హౌజ్ నుంచి పరిగెత్తుతుంటే థియేటర్‌లో పట్టుకుని కడుపులో కాల్చి చంపారు.



విల్క్స్ బూత్ ఆస్వాల్డ్

చరిత్రలో ఇలా ప్యారలల్ జీవితం కనిపించేవాళ్లు ఇంకా చాలా మందే ఉన్నారు. ఇదొక ఉదాహరణ మాత్రమే.

ఇప్పుడు ఆస్కార్‌కి పోటీ పడుతున్న 60 ఏళ్ల గేరీ ఓల్డ్‌మన్, 59 ఏళ్ల డేనియల్ డే లూయిస్‌ల జీవితాల్లో కూడా కొంతవరకు ప్యారలల్ లైఫ్ కనిపిస్తుంది. ఇద్దరూ దక్షిణ లండన్‌కి చెందిన నటులే. నటులుగా ఇద్దరూ 1980లోనే ఫేమస్ అయ్యారు. ఇద్దరూ తమ భార్యలకు విడాకులు ఇచ్చారు. ఇద్దరి తండ్రులూ వీళ్ల చిన్నతనంలోనే చనిపోయారు. వాళ్ల ఇద్దరి కొడుకులూ మోడల్స్. కలిసి ర్యాంప్ వాక్ కూడా చేశారు. ఇలా వీళ్ల జీవితాల్లో కూడా చాలావరకు కో-ఇన్సిడెంట్స్ కనిపిస్తాయి.



గేరీ ఓల్డ్‌మన్ లూయిస్

విధి ప్రకారమేనా!

సమాంతర జీవితాలైనా, మామూలు జీవితాలైనా విధిప్రకారమే జరుగుతాయన్నది భారతీయులు మాత్రమే కాదు.. అన్ని వర్గాలు, దేశాల ప్రజలు నమ్మే అంశం. రెండు జీవితాల్లో ఒకే విధంగా జరుగుతాయన్నది మాత్రం.. మన సిద్ధాంతానికి ఏమాత్రం సూటవ్వదు. పాపపుణ్యాలు, కర్మఫలాలు, పునర్జన్మలు.. ఇవే ఇండియన్ మైథాలజీ చెబుతున్నది. పోయిన జన్మకు ప్రస్తుత జన్మ కొనసాగింపు. అయితే కొందరికి పోయిన జన్మ జ్ఞాపకాలు, ఈ జన్మలోనూ ఉండడమనేది అసాధారణం. అంతకు మించి పారలల్ లైఫ్స్ అనేది ఒక నమ్మకం మాత్రమే అంటున్నది ఇండియన్ ఫిలాసఫీ. నిజానికి పునర్జన్మలకు సంబంధించిన కచ్చితమైన శాస్త్రీయ ఆధారాలు కూడా లేవు. వీటిపై పరిశోధనలు మాత్రం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి.

...✍ రచన ముడుంబై,
సంతోష్ కుమార్ ప్యాట

నమ్మకం - విజ్ఞానం

విజ్ఞానం రోజురోజుకు నిత్య నూతనంగా వికసిస్తున్నది. విశ్వంతరాళ రహస్యాలు ఛేదిస్తూ కొత్త పుంతలు తొక్కుతున్నది. మానవ జీవనాన్ని సౌకర్యవంతం చేస్తున్నది. ఎన్నడూ లేనంతగా నేడు సాంకేతికత మన జీవితాల్లో భాగమైపోయింది. ఒకవైపు పురోగమనం జరుగుతుండగా మరోవైపు ఏనాడో కాలం చెల్లిన మూఢ నమ్మకాలు సమాజాన్ని పట్టి పీడిస్తూనే ఉన్నాయి. చాలా మంది ప్రజలు బాణామతి, చేతబడి, సోదె పెట్టడం, దయ్యాలు, భూతాలు అంటూ ఇంకా భయభ్రాంతులకు గురవుతూనే ఉన్నారు. వారి అమాయకత్వాన్ని మోసగాళ్ళు క్యాష్ చేసుకుంటున్నారు. అందుకే ఇలాంటి మూఢ నమ్మకాల్లో నిజానిజాలు తెలియపరిచేందుకే ఇకపై ఓ నమ్మకం, దాని వెనుక ఉన్న రహస్యం.. దానిలోని నిజం.. ప్రతి వారం..శాస్త్రలో.

పేద గుడిసెలో ధన పిశాచి వీరంగం

నాటి పాలమూరు జిల్లా (నేటి వనపర్తి జిల్లా) చింతకుంట గ్రామం. ఊరు ఊరంతా ఆందోళనగా ఉంది. అక్కడ ధన పిశాచి తిరుగుతున్నదని, పిల్లలను పట్టి పీడిస్తున్నదని, చంపుతుందని అందరూ భయపడుతున్నారు. ఇంతకూ ఈ దయ్యం ఎక్కడి నుండి వచ్చింది?

కొన్ని రోజుల క్రితం ఊరిలోకి ఒక మంత్రగాడు వచ్చాడు. ఒక పేద కుటుంబం తమ ఆర్థిక బాధలను ఆయనకు చెప్పుకున్నది. ఆ మంత్రగాడు 'మీ అరిచేతిలో ధన రేఖ జెర్రిపోతులా ఉన్నది. మీ ఇంట్లో భూమిలో నిధులున్నాయి. అవి తీసుకుంటే మీకిక ధనమే ధనం' అన్నాడు. ఆశ పుట్టిన ఆ దంపతులు 'మరి దాన్ని ఎలా తీయాలి?' అని అడిగారు. ధనాన్ని ధన పిశాచి కాపలా కాస్తుంది. జాగ్రత్తగా పూజలు చేసి తీయాలి. లేకుంటే అది మిమ్మల్ని పీడిస్తుంది. తినేస్తుందని చెప్పాడు. ఆ పూజలకు పదివేల వరకు ఖర్చు అవుతుందని కూడా చెప్పాడు. పేదలే అయినప్పటికీ ధనం మీద మోజుతో అప్పు తెచ్చి మరీ పూజలు జరిపించారు.



నిష్ఠ తగ్గింది.. ధనం పోయింది..

మంత్రగాడు పూజలు జరుపుతూనే వారి గుడిసెలో ఉన్న ఒకే ఒక గది మధ్యలో పెద్ద గుంత తవ్వించాడు. అలా అర్ధరాత్రి నుండి తెలతెలవారే వరకు తవ్వించాడు. ఎంత తవ్వినా అందులో నిధులు రాలేదు. ఇంతలో దంపతు ల్లో భార్యకు చిన్న నిద్ర వచ్చి కునుకు తీసింది. భర్త తవ్వుతూనే ఉన్నాడు. 'నిష్ఠగా పూజ చేస్తూ తవ్వాలని చెప్పా ను. నీ పెళ్లాం నిద్ర పోయింది. నిష్ఠ చెడిపోయింది. ధనం ఇంకో దగ్గరకు వెళ్లి పోయింది. నేను ఏమీ చేయలేను' అని మంత్రగాడు వీళ్లను తిట్టుకుంటూ వెళ్లిపోయాడు. వీళ్లు ఏమీ చేయలేక ఆ గుంత ముందు కూర్చుని ఏడ్చారు. మరుసటి రోజు విషయం ఊరంతా తెలిసింది.

పిశాచి నిద్రలేచిందా..?!

ఈలోపు ఆ గ్రామంలో ఇద్దరు ముగ్గురు చిన్న పిల్లలకు వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. ఇక ఊరంతా ఒకటే పుకారు. ధనం కోసం గుంత తవ్వారు. అందులో నుండి ధన పిశాచి బయటకు వచ్చింది. అది ఊరిని పీడిస్తుందని ప్రచారం ఊరంతా పాకింది. మీరు చేయబట్టే ధన పిశాచి లేచింది. మీరే ఎలాగైనా ఈ ధన పిశాచిని బంధనం చేయించాలి. లేకుంటే మీ సంగతి చూస్తామని ఊరి వారి నుండి బెదిరింపులు వచ్చాయా దంపతులకు. ఏమీ చేయలేక ఆ కుటుంబం మొత్తం ఏడుస్తున్న సమయం లో జనవిజ్ఞాన వేదిక బృందం అక్కడికి చేరుకుంది. గ్రామాన్ని పరిశీలించగా అసలు విషయం అర్థమైంది. అ ది వర్షాకాలం. కొత్తగా నీళ్లు వచ్చి చేరుతున్నాయి. కలుషితమైన ఆ నీళ్లను తాగుతున్న వారికి వాంతులు, విరేచనాల వంటి రోగాలు వస్తున్నాయి. వెంటనే డాక్టర్లను సం ప్రదించి ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసింది. రోగాల బారి న పడిన వారికి చికిత్స చేయించింది. ఇలాంటి కాలంలో నీళ్లు మరగబెట్టి, వడపోసుకుని తాగాలనే అవగాహన కల్పించింది. దయ్యం ఆ ఊరి నుండి పారిపోయింది.

అసలు కథ ఇది..

ఆ తరువాత ఆ కుటుంబాన్ని కలిసి ఇంత పేదవాళ్లు కదా. ఆ మంత్రగాడిని నమ్మి అప్పు చేసి మరీ ఎందుకు డబ్బులు ఇచ్చారని అడుగగా 'ఆ మంత్రగాడు అక్కడ ధనం ఉందని నమ్మించడానికి ముందు ఒక చిన్న గొయ్యి తవ్వించాడు. పూజలు చేస్తూ అందులో పసుపు, కుంకుమ, పూలు చల్లుతూ మమ్మల్ని తవ్వమంటున్నాడు. తవ్వుతుండగా మాకొక మూట తగిలింది. అందులో ఒక బంగారు నాణెం ఉంది. అది చూసి మాకు ఆశ కలిగింద'ని చెప్పారు. అప్పుడు ప్రజలంతా మరి ధన పిశాచి లేకుంటే బంగారు నాణెం ఎలా వచ్చిందనే అనుమానం వెలిబుచ్చారు. మేము కూడా వాళ్లతో చిన్న గుంత తవ్వించాం. అందులో నుండి ఒక మూట బయటపడింది. అందులో 500 రూపాయల నోటు ఉంది. వాళ్లకు ఆశ్చర్యం! హస్త లాఘవంతో మంత్రగాళ్లు అంతకు ముందే తమ దగ్గర సిద్ధంగా ఉన్న మూటను ఎలా గుంతలోకి మారుస్తారో ప్రాక్టికల్‌గా చూపించాం. సంపన్నుల ఇంట్లో ధన పిశాచి పీడించడం ఎప్పుడూ చూడలేదు. మరి ఈ ధన పిశాచి పిచ్చిదా? పేదలను పట్టి పీడించడానికని అడిగాం. దాంతో విషయం అర్థమైన ప్రజలు ఆ పేద దంపతులను ఓదార్చారు. వారిపైన ధన పిశాచిని లేపారనే కోపం పోయి, అందరూ కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మంత్రగాడిపై కేసు పెట్టారు.

ఇలా మంత్రగాళ్లు చాలా ఊర్లలో రకరకాల పేరుతో మోసాలు చేస్తుంటారు. వారి మోసాలకు గురికాకుండా నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

...✍ టి.రమేష్
ప్రధాన కార్యదర్శి
ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్

సుడోకు

డైలీ సుడోకు 114 సమాధానం

9	6	8	2	4	5	7	1	3
5	2	1	3	7	8	9	6	4
7	4	3	1	6	9	8	5	2
3	5	4	9	8	1	6	2	7
6	1	9	7	2	3	4	8	5
2	8	7	4	5	6	1	3	9
1	7	5	6	3	4	2	9	8
4	3	6	8	9	2	5	7	1
8	9	2	5	1	7	3	4	6

డైలీ సుడోకు - 115

	7					1		
			7				6	4
1			9			8		2
8		1					9	3
	2		5		9		8	
9	6					4		1
6		4			8			7
7	9				6			
		5					1	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



ఎంత వింతగా ఉన్నదో నీ గురించి కల కనడం. నేను మెళకువ ఉన్నప్పుడు కూడా..

మాధురి దీక్షిత్
@MadhuriDixit



మాధురి దీక్షిత్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య


6,010,373

కామన్‌మ్యాన్ వాయిస్

పైస ఉన్నోడు ఫామ్‌హౌస్‌లో ప్రకృతిని నిర్మించుకుంటున్నాడు. పల్లెలో ఫార్మర్ బై డిఫాల్ట్ నేచర్‌కి దగ్గరగానే ఉన్నాడు. నడమంత్రపోడే నగరంలో కాలుష్యాలతో, కల్మషాలతో కొట్టుమిట్టాడుతున్నాడు.
-Valmeeki Vaddemani

ప్రార్థన మందిరాల గోడలపై ఉండే పోర్న్ పిక్చర్స్ ఏం సందేశం ఇస్తున్నాయి సమాజానికి. సంప్రదాయబద్ధంగా అక్కడికి వెళ్లే వారికి అది ఇబ్బందికరం కాదా? యువత అవి చూసి చెడిపోదా? ఆర్జీవీని ప్రశ్నించే వారికి నా ప్రశ్న!
-Naveed Roxie Mla

వైరల్ వీడియో



బీటెక్ స్టూడెంట్స్ ఎగ్జామ్స్ ఎలా ప్రిపేర్ అవుతారు? అనే అంశాన్ని ఛలో సినిమా ప్రమోషన్‌గా వాడుకున్నాడు. నాగశౌర్య ఫ్యాకల్టీగా చేశాడు. ఈ వీడియో యూట్యూబ్ ట్రెండింగ్ వీడియో అయింది.

Be Tekku - Supple Exam Preparations | ft. Naga Shaurya | Chai Bisket
Total views : 2,55,082+
Published on Jan 27, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
మంగళవారం 30 జనవరి 2018

గత కొంతకాలంగా ఇటు దక్షిణాదిలో అటు ఉత్తరాది పరిశ్రమలో మహిళా ప్రధాన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నాయి. అగ్ర కథానాయకుల చిత్రాలతో పోటీపడుతూ వసూళ్ల పరంగా దూసుకుపోతున్నాయి. తాజాగా తెలుగులో అనుష్క కథానాయికగా నటించిన 'భాగమతి', బాలీవుడ్‌లో దీపికాపదుకునే టైటిల్ రోల్‌ని పోషించిన 'పద్మావత్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నాయి. ఇటీవలకాలంలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు ఈ స్థాయిలో వసూళ్లను రాబట్టడం ఇదే ప్రథమమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 'బాహుబలి-2' తర్వాత అనుష్క నటించిన 'భాగమతి' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇక 'పద్మావత్' వరుస వివాదాలతో ప్రాచుర్యాన్ని సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలు ఆయా పరిశ్రమల బాక్సాఫీస్ వద్ద సంచలనాల్ని సృష్టిస్తున్నాయి.



బాక్సాఫీస్

వసూళ్ల మహారాణులు



• వందకోట్లు దాటిన 'పద్మావత్'

సంజయ్‌లీలాభన్సాలీ దర్శకత్వంలో దీపికాపదుకునే, రణవీర్‌సింగ్, షాహిద్‌కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'పద్మావత్' తొలి నుంచి వివాదాలతో సహవాసం చేసింది. ఈ నెల 25న ప్రేక్షకులముందుకొచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతున్నది. తొలి వారాంతంలో 114కోట్ల వసూళ్లను సాధించి బాలీవుడ్ ట్రేడ్ పండితుల్ని ఆశ్చర్యపరచింది. శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకొని కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు ఈ చిత్ర ప్రదర్శనకు అభ్యంతరం తెలిపాయి. అయితే సుప్రీంకోర్టు ఆదేశంతో పోలీస్ భద్రత నడుమ ఆయా రాష్ట్రాల్లో 'పద్మావత్'ను ప్రదర్శించారు. కొన్ని వర్గాల నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత దృష్ట్యా సినిమా కలెక్షన్లపై దర్శకనిర్మాతలు తొలుత భయాందోళనలు వ్యక్తం చేశారు. వాటిని పటాపంచలు చేస్తూ విడుదలైన ఐదు రోజుల్లోనే 100కోట్ల కలెక్షన్ల మైలురాయిని దాటి సంచలనం సృష్టించింది. బాలీవుడ్ చరిత్రలో ఓ మహిళా ప్రధాన చిత్రానికి తొలి వారాంతంలో ఈ స్థాయి కలెక్షన్స్ రావడం ఇదే తొలిసారని చెబుతున్నారు.

• 'భాగమతి' ఆల్‌టైమ్ రికార్డ్

'బాహుబలి-2' చిత్రంలో దేవసేనగా అశేష భారతీయ ప్రేక్షకుల మన్ననలు సొంతం చేసుకుంది అనుష్క. దాంతో ఆమె తదుపరి సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో అనుష్క హారర్ థ్రిల్లర్ 'భాగమతి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అశోక్ దర్శకత్వం వహించారు. టీజర్, ట్రైలర్స్‌లోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ చిత్రం ఈ నెల 26న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఒక్క తెలుగులోనే తొలి మూడురోజుల్లో 30కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. ఇందులో 10కోట్ల వసూళ్లు నైజాంలో రావడం విశేషం. మరికొన్ని రోజుల్లో 'భాగమతి' సునాయసంగా యాభైకోట్ల వసూళ్ల మైలురాయిని దాటుతుందని టాలీవుడ్ ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మహిళా ప్రధాన చిత్రం తొలి మూడు రోజుల్లో 30కోట్లు సాధించడం తెలుగు పరిశ్రమలో సరికొత్త చరిత్ర అని చెబుతున్నారు. అదేసమయంలో మహిళా ప్రధాన చిత్రాల్లో తొలిసారిగా 50కోట్ల క్లబ్‌లో (శాటిలైట్ హక్కులతో కలిపి) చేరబోతున్న తెలుగు చిత్రంగా 'భాగమతి' అరుదైన ఘనతను సొంతం చేసుకోబోతుందని అంటున్నారు. మొత్తంగా గత వారంలో ప్రేక్షకులు ముందుకొచ్చిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాలైన 'భాగమతి' 'పద్మావత్' బాక్సాఫీస్‌కు సరికొత్త భాష్యాన్ని చెబుతూ వసూళ్ల సునామీని సృష్టిస్తున్నాయి.

'నటిగా మూసధోరణికే పరిమితమవ్వకుండా అన్ని రకాల పాత్రల్లో కనిపించాలనుంది. గ్లామర్, అభియనం రెంటింటికి సమ ప్రాధాన్యతనిస్తూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నాను' అని చెప్పింది రాశీఖన్నా. ఆమె హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'టచ్‌చేసిచూడు'. రవితేజ కథానాయకుడు. విక్రమ్ సిరికొండ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో రాశీఖన్నా పాత్రికేయులతో ముచ్చటించింది..

ఆ భయాలు పోయాయి!

సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?

• ఇందులో నా పాత్ర పేరు పుష్ప. సాధారణంగా సినిమాల్లో హీరోయిన్లకు కామెడీ, అభినయాన్ని ప్రదర్శించే అవకాశాలు అరుదుగా వస్తుంటాయి. ఈ సినిమాలో కామెడీ టచ్‌తో నా పాత్ర వైవిధ్యంగా సాగుతుంది. రవితేజతో నా కాంబినేషన్‌లో వచ్చే ప్రతి సన్నివేశం నవ్విస్తుంది. నాకు కామెడీ అంటే బాగా ఇష్టం. చిన్న చిన్న హావభావాలకు ప్రాధాన్యతనిస్తూ నా పాత్రను దర్శకుడు వినూత్నంగా తీర్చిదిద్దారు.

మీ పాత్ర హీరోతో సమానంగా ఉంటుందని దర్శకుడు విక్రమ్ సిరికొండ ప్రచార వేడుకల్లో చెప్పారు?

• ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రమిది. వ్యక్తిగత జీవితం, ఉద్యోగబాధ్యతల్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లే క్రమంలో ఓ పోలీస్ అధికారికి ఎదురైన పరిణామాల నేపథ్యంలో వినోద ప్రధానంగా సాగుతుంది. రవితేజ ఓ రోజు ఫోన్ చేసి 'ప్రథమార్థంలో నీ పాత్రనే సినిమాను నిలబెట్టింది' అనిచెప్పారు. ఆయన మాటలు వినగానే ఆనందం కలిగింది. రవితేజ చాలా ఎనర్జిటిక్. సెట్స్‌లో అందరిలో ఉత్సాహాన్ని నింపుతూ నవ్విస్తుంటారు. ఆయనతో పనిచేయడం ఎప్పుడూ హ్యాపీనే.

వరుసగా కామెడీ పాత్రల్లోనే కనిపిస్తున్నారు?

• 'సుప్రీమ్' తర్వాత పూర్తిస్థాయి వినోదభరిత పాత్రలో నేను కనిపిస్తున్న చిత్రమిది. ఆ సినిమాలో చేసిన బెల్లం శ్రీదేవి పాత్రతో పోలిస్తే భిన్నంగా సాగుతుంది. దర్శకులే నాకోసం కామెడీ పాత్రల్ని సృష్టిస్తున్నారు. ఆ విషయంలో నేను చాలా లక్కీ. 'సుప్రీమ్' సినిమాకు ముందు నాలో తెలియని భయం, సంశయాలు ఉండేవి. అవన్నీ ఇప్పుడు పోయాయి. నటిగా నాలోని పరిణితిని ఆవిష్కరించే చిత్రమిది.

సినిమాలో డ్యాన్సర్‌గా కనిపిస్తానని చెప్పారు. పాత్ర కోసం ఎలాంటి శ్రద్ధ తీసుకున్నారు?

• విదేశీ నృత్యంలో ఐదు రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. చాలా కష్టపడి ఆ డ్యాన్సుల్లో మెళకువలను నేర్చుకున్నాను. ఆ సన్నివేశాలు తెరపై ఆకట్టుకుంటాయనే నమ్మకముంది.

తెలుగు బాగా మాట్లాడుతున్నారు? సొంతంగా డబ్బింగ్ చెప్పే ఆలోచన ఉందా?

• సొంత గొంతు వినిపించాలని నాకు ఉంది. టచ్‌చేసిచూడు, తొలి ప్రేమ సినిమాల్లో నా పాత్రలకు నేనే డబ్బింగ్ చెప్పాల్సింది. కానీ సమయం లేకపోవడంతో కుదరడం లేదు. ఏదో ఒక రోజు తెలుగులో డబ్బింగ్ చెబుతాను.

తెలుగు, తమిళ భాషల్లో కథలు, పాత్రల ఎంపికలో మీ ప్రాధామ్యాల్లో మార్పులు కనిపిస్తున్నాయి?

• తెలుగులో ఎక్కువగా గ్లామర్ పాత్రల్లో కనిపిస్తే తమిళం, మలయాళంలో పక్కింటి అమ్మాయి తరహాలో సహజత్వంతో కూడిన నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు నన్ను వెతుక్కుంటూ వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగులో హీరోయిన్లను గ్లామర్‌గా చూపించాలనే దృక్పథంలో మార్పులు వస్తున్నాయి. హీరోయిన్ల కోసం దర్శకులు విభిన్నమైన పాత్రల్ని సృష్టిస్తున్నారు. 'తొలిప్రేమ'లో నా పాత్ర మూడు భిన్న పార్శ్వాల్లో సాగుతుంది.

పోటీ గురించి ఆలోచిస్తుంటారా?

• రకుల్‌ప్రీత్‌సింగ్, లావణ్య త్రిపాఠి నాకు మంచి స్నేహితులు. అందరం తరుచుగా కలుస్తుంటాం. కానీ సినిమాలకు సంబంధించిన ప్రస్తావన మా మధ్య ఎప్పుడూ రాదు. పోటీ అనే ఆలోచన ఉండదు. నేను మరొకరితో పోల్చి చూసుకోను. ప్రస్తుతం నేనున్న స్థాయికి సంతృప్తిగా ఉన్నాను.

తదుపరి సినిమా విశేషాలేమిటి?

• వరుణ్‌తేజ్‌తో 'తొలిప్రేమ' సినిమా చేస్తున్నాను. అలాగే తమిళంలో ఇమైక్కా నొడిగల్, సైతాన్ కా బచ్చా సినిమాల్లో నటిస్తున్నాను.



రాశీఖన్నా



శ్రియ

మహిళల భాగస్వామ్యం పెరగాలి!

'నాకోసం దర్శకులు మంచి కథల్ని సృష్టిస్తున్నారు. నటిగా నాలోని భిన్న పార్శ్వాల్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే ప్రేక్షకుల్ని మెప్పించే చక్కటి పాత్రలు వరిస్తున్నాయి' అని చెప్పింది శ్రియ. ఆమె కీలక పాత్రలో నటించిన చిత్రం 'గాయత్రి'. మోహన్‌బాబు కథానాయకుడు. ఫిబ్రవరి 9న పేక్షకులముందుకు రానుంది. ఈ సందర్భంగా శ్రియ సోమవారం పాత్రికేయులతో ముచ్చటించింది. ఆమె చెప్పిన సంగతులివి..

పల్లెటూరి అమ్మాయిగా..

దర్శకుడు మదన్ కథ చెప్పగానే గొప్ప చిత్రమవుతుందనిపించింది. ఇందులో నేను పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తాను. అమాయకత్వం, నిజాయితీ, కొంచెం తెలివితేటలు మూర్తీభవించిన యువతిగా నా పాత్ర భిన్న కోణాల్లో సాగుతుంది. నిడివి తక్కువైనా కథాగమనంలో కీలకంగా వుంటుంది. పాత్ర చిత్రణ సహజంగా అనిపిస్తుంది. అభినయానికి ఆస్కారమున్న పాత్ర కావడంతో వెంటనే అంగీకరించాను.

సుదీర్ఘ కెరీర్ రసహ్యమిదే...

పరిశ్రమలోకి ప్రవేశించి చాలా ఏళ్లవుతుంది. నా సమకాలీనులతో పోల్చితే విభిన్నమైన పాత్రలు చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాను. నేటి భారతీయ మహిళ అన్ని రంగాల్లో పురోగమిస్తున్నది. పిల్లల బాగోగుల గురించి తపించే గృహిణిగా, ఉద్యోగినిగా, కార్పొరేట్ సంస్థల అధిపతిగా...ఇలా మహిళలు భిన్న పాత్రల్ని సమర్థవంతంగా పోషిస్తున్నారు. ఆధునిక మహిళల స్ఫూర్తితో దర్శకులు, రచయితలు మంచి పాత్రల్ని సృష్టిస్తున్నారు. ఆ తరహా పాత్రలు నన్ను వస్తున్నందువల్లే కెరీర్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నాను.

తెరవెనక వుండాలి...

నా దృష్టిలో మహిళా ప్రధాన చిత్రాలంటే వాటి నిర్మాణంలో అధికశాతం మహిళలే పాలుపంచుకోవాలి. అప్పుడే వాటిని పూర్తిస్థాయి మహిళా చిత్రాలుగా భావించాలి. నేను హాలీవుడ్‌లో చేసిన 'మిడ్‌నైట్ చిల్డ్రన్' సినిమా కోసం ఒకరిద్దరు మినహా అందరూ మహిళలే పనిచేశారు. ఆ పద్ధతిలో ఇక్కడ కూడా లేడీ ఓరియెంటెడ్ చిత్రాల నిర్మాణం జరగాలి. సినిమాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి.

తదుపరి సినిమాల గురించి..

తెలుగులో 'వీరభోగ వసంతరాయలు' చిత్రంలో నటిస్తున్నాను. క్రైమ్ థ్రిల్లర్ ఇది. నేను పోలీస్ పాత్రలో కనిపిస్తాను. తమిళ దర్శకుడు కార్తీక్ నరేన్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా చేస్తున్నాను. 'గౌతమిపుత్ర శాతకర్ణి' కెమెరామెన్ జ్ఞానశేఖర్ నిర్మాణంలో ఓ సినిమా చేయబోతున్నాను. ఈ చిత్రానికి మహిళ దర్శకురాలు నిర్దేశక బాధ్యతల్ని చేపడుతోంది.

ముక్కోణపు ప్రేమకథ!



పునర్నవి, నందు

నందు, నోయల్, పునర్నవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఎందుకో ఏమో'. కోటి మద్దినేని దర్శకుడు. మాలతీ మద్దినేని నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో దర్శకుడు వి.వి.వినాయక్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'టైటిల్‌తో పాటు టీజర్ కూడా బాగుంది. ట్రెండీగా, ఆసక్తికరంగా వుంది. ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న కోటికి మంచి పేరుతో పాటు, నిర్మాతకు లాభాలు తెచ్చిపెట్టాలి' అన్నారు. మూడు పాత్రల నేపథ్యంలో సాగే ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలో ఆడియోను, అదే నెలలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'కొత్త పంథాలో సాగే చిత్రమిది. మంచి లవ్‌స్టోరీతో పాటు కమర్షియల్ హంగులన్నీ వున్న సినిమా ఇది' అన్నారు.

చెన్నై చిన్నోడి ప్రేమాయణం



జీవీ ప్రకాష్‌కుమార్, ఆనంది

జీవీ ప్రకాష్‌కుమార్, నిక్కీ గల్రానీ, ఆనంది ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కడవుల్ ఇరుకాన్ కుమారు'. ఈ సినిమాను నిర్మాత వి.జయంత్‌కుమార్ 'చెన్నై చిన్నోడు' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. 'వీడి లవ్‌లో అన్ని చిక్కులే' ఉపశీర్షిక. రాజేష్ దర్శకుడు. ఇటీవలహైదరాబాద్‌లో ఈ చిత్ర ఫస్ట్‌లుక్, టీజర్‌ను సీనియర్ నిర్మాత కె.వి.వి. సత్యానారాయణ విడుదలచేశారు. ఆయన మాట్లాడుతూ నిర్మాతగా తొలి సారి జయంత్ చేస్తున్న ఈ ప్రయత్నం ఫలించాలని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ఇష్టపడ్డ అమ్మాయిని పెళ్లిచేసుకోవాలని కలలు కన్న యువకుడి జీవితం ఓ ప్రయాణం కారణంగా ఎలా సమస్యల వలయంలో చిక్కుకున్నది?వాటి నుంచి ఏ విధంగా బయటపడ్డడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. వినోదం, ఉత్కంఠత మిళితంగా సాగే ఈ చిత్రం నవతరం మనోభావాలకు దర్పణంలా ఉంటుంది.పోలీస్ అధికారిగా ప్రకాష్‌రాజ్ నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటకృష్ణ, పూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

కామెడీ అంటే ఇష్టం

'తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులో మా ఊరు ఉంటుంది. ఆ ఊరిని స్ఫూర్తిగా తీసుకొని 'ఛలో' కథను సిద్ధం చేసుకున్నాను. ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిది' అన్నారు వెంకీ కుడుముల. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఛలో'. నాగశౌర్య, రష్మిక మందన జంటగా నటిస్తున్నారు. ఉషా ముల్పూరి నిర్మించారు. ఫిబ్రవరి 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. సోమవారం హైదరాబాద్‌లో వెంకీ కుడుముల పాత్రికేయులతో ముచ్చటించారు...


ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మాది. కమర్షియల్ అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివాను. సినిమాలపై ఆసక్తితో తేజ వద్ద 'నీకు నాకు డాష్‌డాష్' సినిమాకు దర్శకత్వ విభాగంలో చేరాను. ఆ తర్వాత దర్శకుడు యోగితో 'జాదుగాడు', త్రివిక్రమ్ వద్ద 'అఆ' సినిమాలకు పనిచేశాను. 'జాదుగాడు' సమయంలో నాగశౌర్య మంచి స్నేహితుడయ్యాడు. దర్శకుడిగా నా తొలి సినిమాను అతడితోనే చేయాలని నిర్ణయించుకున్నాను. తొలుత ఓ క్రైమ్ కామెడీ కథను శౌర్యకు వినిపించాను. కానీ అది వర్కవుట్ కాలేదు.

నిజమైన వ్యక్తిత్వాన్ని...

ఇప్పటివరకు నాగశౌర్య లవర్‌బాయ్, సాఫ్ట్ క్యారెక్టర్స్‌లో కనిపించాడు. అతడి సహజమైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే సినిమా ఇది. ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని ఓ ఊరిలో కథ జరుగుతుంది. చదువు కోసం అక్కడికి వచ్చిన ఓ యువకుడికి ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయనేది వినోదాన్ని పంచుతుంది. తొలుత వేరే నిర్మాతతో ఈ సినిమా చేయాల్సింది. కానీ కథకు న్యాయం చేయడం కోసం కష్టమైనా... ఇష్టపడి నాగశౌర్య తల్లిదండ్రులు ఉషా, శంకర్‌ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. వారు నాపై పెట్టిన నమ్మకాన్ని నిజం చేయడానికి ఓ బాధ్యతగా భావించి ఈ సినిమా చేశాను.

వారి శైలి నచ్చుతుంది.

కన్నడ సినిమా 'కిరిక్‌పార్టీ'లో రష్మిక మందన అభినయం నచ్చడంతో ఆమెను కథానాయికగా తీసుకున్నాం. సాయిశ్రీరామ్ ఛాయాగ్రహణం, సాగర్ మహతి స్వరాలు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. దర్శకుడిగా కామెడీ సినిమాలు చేయడానికి ఎక్కువ ఇష్టపడతాను. పూరి జగన్నాథ్, త్రివిక్రమ్‌ల శైలి నచ్చుతుంది.



వెంకీ కుడుముల

దయ్యాలే భయపడితే...



శ్రీకాంత్

'హారర్, కామెడీ కథతో నేను చేసిన తొలి సినిమా ఇది. నటుడిగా నాకు ఓ కొత్త అనుభూతినిచ్చింది. చాలా రోజుల తర్వాత నా కెరీర్‌లో ఓ మంచి సినిమాగా నిలుస్తుందనే నమ్మకముంది' అని అన్నారు శ్రీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'రా..రా'. విజి చెర్రీష్ దర్శకత్వం వహించారు. విజయ్ నిర్మాత. నజియా, సీత ప్రధాన పాత్రల్లో నటించారు. ఫిబ్రవరి 23న ఈ చిత్రం విడుదలకానున్నది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. శ్రీకాంత్ మాట్లాడుతూ 'సినిమాను తెరకెక్కించే క్రమంలో ఓ దర్శకుడికి ఎదురయ్యే అనుభవాల సమాహారమే ఈ చిత్ర ఇతివృత్తం. మనుషుల్ని చూసి దయ్యాలు ఎందుకు భయపడ్డాయనే పాయింట్ ఆధారంగా ఈ సినిమా సాగుతుంది. ప్రతి సన్నివేశం నవ్విస్తూనే భయపెడుతుంది' అని తెలిపారు. తొంభై శాతం వినోదం మిళితమైన సినిమా ఇదని, తెలుగు చిత్రపరిశ్రమలోని హాస్యనటులంతా ఈ చిత్రంలో కనిపిస్తారని సమర్పకుడు శ్రీమిత్రచౌదరి చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాత విజయ్ పాల్గొన్నారు.



షకీలా

యదార్థ ఘటనల 'శీలవతి'

షకీలా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శీలవతి'. సాయిరాం దాసరి దర్శకత్వం వహిస్తున్నారు. రాఘవ ఎమ్ గణేష్, వీరు బాసింశెట్టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఇటీవల చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదలచేసింది. నిర్మాతలు మాట్లాడుతూ 'కేరళలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్న చిత్రమిది. సైకలాజికల్ థ్రిల్లర్ కథాంశంతో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతుంది. షకీలా నటిస్తున్న 250వ సినిమా ఇది. ఆమె నటన, పాత్రచిత్రణ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. గీతాంజలి, లడ్డు, అశోక్‌బాబు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: తరుణ్ కరమ్‌తోత్.

సోషియో ఫాంటసీ నేపథ్యంలో..

కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి జంటగా నటిస్తున్న చిత్రం 'దీర్ఘ ఆయుష్మాన్‌భవ'. వింగ్ మూవీ మేకర్స్ పతాకంపై జి.ప్రతిమ నిర్మిస్తున్నారు. పూర్ణానంద్ దర్శకుడు. ఈ చిత్ర మోషన్‌పోస్టర్‌ను దర్శకులు పూరి జగన్నాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్, పోస్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా ఉన్నాయి. కథలో కొత్తదనం కనిపిస్తోంది. ఈ సినిమా ద్వారా కార్తీక్‌రాజ్ హీరోగా మంచి గుర్తింపును సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను' అన్నారు. 'ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. మా సినిమాకు పూరి జగన్నాథ్ ఆశీస్సులు దొరకడం ఆనందంగా ఉంది' అని హీరో కార్తీక్‌రాజు తెలిపారు. సోషియో ఫాంటసీ అంశాలు మేళవించిన ప్రేమకథా చిత్రమిదని దర్శకుడు చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'కైకాల సత్యనారాయణగారు యముడి పాత్రలో కనిపిస్తారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. ఆమని, పృథ్వీరాజ్, కాశీ విశ్వనాథ్, సత్యం రాజేష్, తాగుబోతు రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మల్హార్‌భట్‌జోషి, మాటలు: ప్రదీప్ ఆచార్య, పూర్ణానంద్, సంగీతం: సిద్దార్థ్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పూర్ణానంద్ ఎం.



'దీర్ఘ ఆయుష్మాన్‌భవ' మోషన్ పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం